


# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

visit us @ http://epaper.suryaa.com

శనివారం | 5 అక్టోబర్ 2024 | హైదరాబాద్

సంపుటి 17 | సంచిక 305

| పేజీలు 10+8 | వెల: రూ. 6.50

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi







అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయణం - వర్ష ఋతువు, ఆశ్వీయుజ మాసం తదియ తె.4.40 వరకు, స్వాతి రా.7.57, వర్జ్యం రా.02.02 నుంచి 3.46 వరకు
రాహుకాలం ఉ.9.00 నుంచి 10.30 వరకు దుర్ముహూర్తం ఉ.7.30 వరకు

## లడ్డూ వ్యవహారంపై విచారణకు
# ప్రత్యేక సిట్

**కొత్త సిట్ విచారణను స్వాగతించిన ఏపి సిఎం చంద్ర బాబు**

- సిబిఐ డైరెక్టర్ నేతృత్వంలో 5 గురు సభ్యుల సిట్
- అభ్యంతరం వ్యక్తం చేసిన పిటీషనర్ తరపు న్యాయవాది
- సిట్ సభ్యులపై ఎలాంటి సందేహాలు లేవన్న రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది రోహత్గి
- ఈ విషయంలో రాజకీయ డ్రామాలు వద్దని ఇరుపక్షాలకు సుప్రీం సూచనలు
- తనపై విజిలెన్స్ విచారణ అంశాన్ని దాచిపెట్టిన సుబ్బారెడ్డిపై ఆగ్రహం





6లో

తిరుమల లడ్డూ వివాదంలో సుప్రీంకోర్టులో స్వతంత్ర దర్యాప్తునకు ఆదేశించింది. ఐదుగురు సభ్యులతో కూడిన ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తు చేయాలని సూచించింది. ఇద్దరు ప్రస్తుతం వేసిన సిట్ నుంచి సభ్యులుగా ఉంటారు.

## కొత్త స్పోర్ట్స్ పాలసీ
# రూపొందించండి

- క్రీడల్లో గ్రామీణ యువతను ప్రోత్సహించాలి
- క్రీడా ప్రాంగణాలు ఒకే గొడుగు కిందికి తీసుకురావాలి
- యూనివర్సిటీల సహకారం తీసుకోవాలి
- అధికారులకు సూచించిన సీఎం రేవంత్ రెడ్డి



3లో

అద్భుతమైన క్రీడాకారులను తీర్చిదిద్దటంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణకు గుర్తింపు తెచ్చేలా కొత్త స్పోర్ట్స్ పాలసీని తయారు చేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. 2036 ఒలింపిక్స్ ను దృష్టిలో పెట్టుకొని కొత్త పాలసీలో లక్ష్యాలను నిర్దేశించుకోవాలని చెప్పారు. అధికారులు తయారు చేసిన కొత్త స్పోర్ట్ పాలసీ ముసాయిదాపై ముఖ్యమంత్రి శుక్రవారం సచివాలయంలో అధికారులతో సమావేశమయ్యారు.

## ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

- 36 మందికిపైగా మావోయిస్టుల మృతి
- దంతెవాడ-నారాయణపూర్ సరిహద్దులో కాల్పుల మోత
- నెత్తురోడిన అబూజ్ మాడ్ అటవీ ప్రాంతం
- భారీగా ఆటోమేటిక్ ఆయుధాలు స్వాధీనం చేసుకున్న పోలీసులు



6లో

## భారీ నష్టాల్లో
# స్టాక్ మార్కెట్‌లు



5లో

- రెండు రోజుల్లో రూ.14 లక్షల కోట్లు నష్టం
- మిడిల్ ఈస్ట్‌లో ఉద్రిక్తతల నేపథ్యంలో నష్టాల్లో మార్కెట్
- 808 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్
- మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్‌లో వెల్లువెత్తిన అమ్మకాలు

## రైల్వే ప్రైవేటీకరణ
# జరగదు



- కేంద్రం దృష్టంతా సేవలపైనే
- కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్

వివరాలు-6లో

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

## ప్రారంభమైన తిరుమల తిరిదే
# బ్రహ్మోత్సవాలు



2లో

- శాస్త్రోక్తంగా అంకురార్పణ - ధ్వజారోహణం
- ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తూ ఎగిరిన గరుడ పటం

అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుని బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరిగింది. శ్రీవారి సాల్ల బ్రహ్మోత్సవాలు శుక్రవారం సాయంత్రం 5.45 నుంచి 6 గంటల మధ్య మీన లగ్నంలో ధ్వజారోహణ ఘట్టంతో వైభవంగా ప్రారంభమయ్యాయి.

## డిప్యూటీ సీఎం భట్టికి
# ఘన స్వాగతం

- గత నెల 24న ప్రారంభమైన భట్టి అమెరికా, జపాన్ దేశాల అధికారిక పర్యటన నిన్నటితో విజయవంతంగా ముగిసింది
- దాదాపు 13 రోజుల పాటు కొనసాగిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విదేశీ పర్యటన
- ఘనంగా స్వాగతం పలికిన ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు.



3లో

అమెరికాలో జరిగిన అంతర్జాతీయ మైనింగ్ ఎగ్జిబిషన్ మైనెక్స్-2024లో కోమత్సు ,హిట్యాచి, క్యాటర్ పిల్లర్ వంటి ప్రముఖ కంపెనీలు ఉత్పత్తి చేసిన అత్యాధునిక షావెల్స్, డంపర్లు, కంటిన్యూయస్ మైనర్ యంత్రాలు, గనిలో ప్రమాదాలు జరగకుండా చూసే రక్షణ వ్యవస్థలను పరిశీలించారు.

## పశ్చిమాసియాలో
# యుద్ధ మేఘాలు

- భద్రతా వ్యవహారాలపై మంత్రులతో ప్రధాని భేటీ
- భారత ఆర్థిక వ్యవస్థపై ప్రభావం ఎంత? అని ఆరా
- దేశీయ స్టాక్ మార్కెట్లపై ప్రభావంపైనా చర్చ
- ఒక్క రోజులో లక్షల కోట్ల సంపద ఆవిరి కావటంపై ఆందోళన



6లో

పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం తీవ్రమవుతుందా? దాని ప్రభావం ప్రపంచ దేశాలపై పడుతోందా? భారత ఆర్థిక వ్యవస్థపై ప్రభావం ఎంత? దేశీయ స్టాక్ మార్కెట్లపై ప్రభావం చూపుతోందా? ఒక్క రోజులో లక్షల కోట్ల సంపద ఆవిరయ్యిందా? కేంద్రం ముందు ఉన్న ప్రత్యామ్నాయ మార్గాలేంటి? ఈ సమస్య నుంచి గట్టెక్కడం ఎలా? నిన్న సాయంత్రం ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశమైంది.

## అంతా ఇంతే!




మన కూటమే కదా అక్కడ ఉంది ప్రత్యేకంగా చెప్పడమెందుకట సార్

## సరిహద్దుల్లో చైనా
# నిర్మాణాలు



6లో

- అదే స్థాయిలో మనం కూడా సరిహద్దు సౌకర్యాలను అప్‌గ్రేడ్ చేస్తున్నాం
- 2047 నాటికి ఆయుధాలను పూర్తిగా దేశీయంగా తయారు చేసుకోవాల్సిన అవసరం ఉంది
- వాయుసేన చీఫ్ అమర్ ప్రీత్ సింగ్

# ధరణి పోర్టల్ రద్దు

- త్వరలోనే ఆర్‌ఓఆర్ చట్టం తీసుకు వస్తాం
- ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండేలా ఈ చట్టం రూపొందించాం
- మంత్రి పొంగులేటి



దరణి పోర్టల్‌ను రద్దు చేసి త్వరలో ఆర్ ఓ ఆర్ చట్టం తీసుకు వస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. ఈ నెలాఖరులోగా అమల్లోకి తెస్తామని చెప్పారు. ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండే విధంగా రూపొందించాం.. ప్రజల అభిప్రాయాలు పరిగణలోకి తీసుకుంటాం.. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్స్‌ను గాలికి వదిలేసింది..

వివరాలు-3లో

## మోడీ దేవుళ్ళ పేరుతో
# రాజకీయం చేస్తున్నారు



3లో

- కేటీఆర్- హరీశ్ రావు అబద్ధపు మాటలు మాట్లాడుతున్నారు
- బీజేపీ- బీఆర్ఎస్ పార్టీలపై టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఫైర్

## సికింద్రాబాద్-వాస్కో డి-గామా
# బై వీక్లీ ఎక్స్‌ప్రెస్

రేపు ప్రారంభించనున్న కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి



3లో

ఈ రైలు కర్ణాటక, గోవా వైపు ప్రయాణించే ప్రజలకు ప్రత్యేకమైన ప్రత్యక్ష రైలు సౌకర్యాన్ని అందిస్తుంది. రైలు సమయాలు గోవా ఇతర మార్గమధ్య స్టేషన్లకు అనుకూలమైనవి.

## ఎస్సీల ఉపవర్గీకరణపై
# పునఃసమీక్ష వద్దు



- ఇప్పటికే ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల ఉపవర్గీకరణ ఆమోదిస్తూ సుప్రీం తీర్పు
- న్యాయసమీక్షకు లోబడే వర్గీకరణ ఉంటుందని స్పష్టీకరణ

వివరాలు-6లో

# తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

● శాస్త్రోక్తంగా అంకురార్పణ - ధ్వజారోహణం
● ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తూ ఎగిరిన గరుడ పటం

తిరుమల: అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుని బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరిగింది. శ్రీవారి సాల్క బ్రహ్మోత్సవాలు ) శుక్రవారం సాయంత్రం 5.45 నుంచి 6 గంటల మధ్య మీన లగ్నంలో ధ్వజారోహణ (గ్రా) ఘట్టంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామి వారి సమక్షంలో వేదగానాల మధ్య మంగళవాద్యాలు మోగుతుండగా అర్చకస్వాములు బంగారు ధ్వజస్తంభంపై గరుడధ్వజాన్ని ఎగురవేశారు. సకల దేవతలను, అష్టదిక్పాలకులను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తారని ప్రాశస్త్యం. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో తిరుమల శ్రీవారి ఆలయం దేదీప్యమానంగా వెలిగిపోతోంది. అటు, కల్యాణవేదిక వద్ద ఏర్పాటు చేసిన ఫలపుష్ప, అటవీ, శిల్ప, ఫోటో ప్రదర్శన శాలలను తితిదే శుక్రవారం ప్రారంభించింది. ప్రవేశ ద్వారంలో ఉంచిన దుర్యోధన పరాభవం, శేషాచల శ్రేణుల సెట్టింగ్, శ్రీ వేంకటేశ్వర సాంప్రదాయ శిల్పకళాశాల ఆధ్వర్యంలో విద్యార్థులు తయారు చేసిన చెక్క, సిమెంట్, లోహ శిల్పాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.



# తిరుమలలో చంద్రబాబు మరో రికార్డు



● భువనేశ్వరితో కలసి వచ్చిన సిఎం బాబు ● అధిక పర్యాయాలు పట్టువస్త్రాలు సమర్పించిన సిఎంగా చంద్రబాబు ● ఎన్టీఆర్ హయాంలో పట్టు వస్త్రాలు సమర్పించే ఆనవాయితీని పునః ప్రారంభం ● గతంలో పట్టువస్త్రాలను సమర్పించి వస్తున్నప్పుడే చంద్రబాబుపై అలిపిరిలో దాడి

తిరుమల : బ్రహ్మోత్సవాల్లో భాగంగా.. ఏపీ ప్రభుత్వం తరవునముఖ్యమంత్రి నారా చంద్రబాబు, నారా భువనేశ్వరి దంపతులు.. శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. . తిరుమలలోని బేడీ ఆంజనేయ స్వామిని దర్శించుకున్న అనంతరం వెండి పళ్లెంలో పట్టు వస్త్రాలు తీసుకుని శ్రీవారి ఆలయానికి చేరుకున్నారు. పట్టు వస్త్రాలు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. తితిదే ఈవో శ్యామలరావు తదితరులు సీఎం వెంట ఉన్నారు. కాగా ఏపీ ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరో రికార్డు సృాఎష్టించారు. ఇప్పటివరకు శ్రీవారి బ్రహ్మోత్సవాలకు హాజరై.. స్వామివారికి పట్టు వస్త్రాలు అధిక సార్లు



సమర్పించిన సీఎంగా చంద్రబాబు చరిత్ర కెక్కనుండటం గమనార్హం . తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల సమయంలో ప్రభుత్వం తరవున.. సీఎం హోదాలో ఉన్న నేత పట్టు వస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డ అనంతరం.. శ్రీవారి బ్రహ్మోత్సవాలు జరుగుతుండగా.. సీఎం చంద్రబాబు పట్టు వస్త్రాలను స్వామి వారికి సమర్పించారు.. .

ఏడాదికి ఒకసారి శ్రీవారి బ్రహ్మోత్సవాలను టీటీడీ అంగరంగ వైభవంగా నిర్వహిస్తుంది. ఈ బ్రహ్మోత్సవాలకు తెలుగు రాష్ట్రాల నుండే కాక దేశవ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుంటారు. అంతేకాకుండా విదేశీయులు సైతం శ్రీవారి బ్రహ్మోత్సవాలలో పాల్గొనడాన్ని.. వుణ్యకార్యంగా భావిస్తారు. అందుకే ఈ ఏడాది కూడా శ్రీవారి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు టీటీడీ ఈవో శ్యామల రావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి.

కాగా శ్రీవారికి ముఖ్యమంత్రి పట్టు వస్త్రాలు సమర్పించే ఆనవాయితీ 1978 నుండి ప్రారంభమైందని తెలుస్తోంది. తొలిసారిగా శ్రీవారికి నాటి ముఖ్యమంత్రి చెన్నారెడ్డి, స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం కొన్నేళ్లు స్వామివారికి పట్టు వస్త్రాలను ఆలయ అధికారులే సమర్పించగా, 1984లో ముఖ్యమంత్రిగా ఉన్న నందమూరి తారక రామారావు ప్రభుత్వం తరవున పట్టు వస్త్రాలు సమర్పించే ఆనవాయితీని వునః ప్రారంభించారు. ఇలా చంద్రబాబు సైతం సీఎం హోదాలో 2003లో పట్టు వస్త్రాలు సమర్పించేందుకు తిరుమలకు వెళుతున్న క్రమంలో అలిపిరి వద్ద జరిగిన బాంబు పేలుళ్ల నుండి అదృాఎష్టవశాత్తు బయటపడ్డారు. తనకు తిరుమలేశుడు వునర్జన్మ ఇచ్చినట్లు బాబు నాడు ప్రకటించారు.

ఇలా తమ ఇంటి ఇలవేల్పుగా తిరుమల శ్రీ శ్రీనివాసుడిని సీఎం చంద్రబాబు వూజిస్తారు. తాజాగా జరిగిన ఏపీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన అనంతరం చంద్రబాబు తిరుమల పర్యటనకు వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే తన పరిపాలన ప్రక్షాళన తిరుమల నుండే ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. 1995 లో నాటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా భాద్యతలు చేపట్టిన చంద్రబాబు.. శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం 1999-2004, 2014-19 సంవత్సరాలలో సీఎంగా గల బాబు.. ఆ పదేళ్ళ కాలంలో స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. తాజా గెలువుతో నాల్గవసారి సీఎంగా గెలువు అందుకున్న చంద్రబాబు.. ప్రస్తుతం జరుగుతున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలలో పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. ఇప్పటికి పది సార్లకు పైగా.. శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన సీఎంగా చంద్రబాబుకు రికార్డు సొంతమైందని చెప్పవచ్చు.

# సత్యసాయి జిల్లాను అగ్రపథాన్ని నిలబెడదాం

● నియోజక వర్గాల వారీగా యాక్షన్ ప్లాన్లు రూపొందించండి ● జిల్లాలో ఉన్న వనరులు సద్వినియోగం చేసుకుంటే మనదే అగ్రస్థానం ● అధికారులు మరింత బాధ్యతగా పనిచేయాలన్న మంత్రి ● చేనేత అన్ని విధాలా అండగా ఉన్నాం ● నేతన్నలకు ఆర్థిక భరోసా కల్పించేలా కార్యక్రమాల నిర్వహణ : మంత్రి సవిత ● రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి




ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : దేశంలో ఏపీని అగ్రగామిగా నిలపాలని సీఎం చంద్రబాబు కృాఎషి చేస్తున్నారని, ఆయన స్ఫూర్తితో రాష్ట్రంలో శ్రీసత్యసాయి జిల్లాను అగ్రపథాన నిలువుదామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖామాత్యులు ఎస్.సవిత పిలువునిచ్చారు. శుక్రవారం స్వర్ణాంధ్ర 2047 జిల్లా విజన్ ప్లాన్ వుట్టపర్తిలో జిల్లాస్థాయి సమావేశం వుట్టపర్తి సాయిరామమ్ లో నిర్వహించారుఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ మరియు చేనేత శాఖ మంత్రివర్యులు సవితమ్మ, వుట్టపర్తి ఎమ్మెల్యే సింధూర రెడ్డి,కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ , సిపిఓ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు, ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మంత్రివర్యులు మాట్లాడుతూ రాబోయే అయిదేళ్లలో రాష్ట్రంలో అభివృాఎద్ధి చేపట్టాలన్ని, ఏపీని దేశంలోనే అగ్రగామిగా నిలపాలని సీఎం చంద్రబాబు లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. దీనిలో భాగంగా జిల్లాల వారీగా యాక్షన్ ప్లాన్ అందించాలని సీఎం ఆదేశించారన్నారు. ఆయన ఆలోచనలకు అనుగుణంగా అధికారులు, ప్రజాప్రతినిధులు పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని శాఖల అధికారులు నియోజక వర్గాల వారీగా తమ శాసనసభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి, ఎటువంటి అభివృాఎద్ధి చేపట్టాలో చర్చించి యాక్షన్ ప్లాన్ రూపొందించాలని మంత్రి ఆదేశించారు. జిల్లాలో వ్యవసాయం, హార్టికల్చర్, పరిశ్రమల ఏర్పాటుకు అనువైన వాతావరణం ఉందని, అభివృాఎద్ధికి కావాల్సిన అన్ని వనరులూ ఉన్నాయని అన్నారు. వాటిని ప్రజాప్రతినిధులు, అధికారులు సద్వినియోగం చేసుకుంటే జిల్లాను అభివృాఎద్ధి బాట పట్టించొచ్చునన్నారు. రాబోయే అయిదేళ్లలో ఏపీని దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టాలని సీఎం చంద్రబాబు పనిచేస్తున్నారన్నారు. ఆయన స్ఫూర్తితో మన అందరం కూడా సత్యసాయి జిల్లాను రాష్ట్రంలో అగ్రపథాన నిలబెట్టడానికి కృాఎషి చేద్దామని పిలువునిచ్చారు. జిల్లా అభివృాఎద్ధికి సమావేశానికి హాజరైన ఎంపీలు, ఎమ్మెల్యేలు ఎంతో విలువైన సలహాలు అందజేశారని, వాటిన్నింటిని నమోదు చేసుకున్నామని, క్షేత్రస్థాయిలో కూడా కూర్చొని నియోజక వర్గాల వారీగా యాక్షన్ ప్లాన్ రూపొందించాలని సూచించారు. అధికారులు బాధ్యతతో పనిచేయాల్సిన అవసరం ఉందని మంత్రి సవిత స్పష్టం చేశారు.

**కేంద్రం సహకారంతో చేనేత అభివృాఎద్ధి**

చేనేత కార్మికులకు అన్ని విధాలా అండగా నిలవాలని సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ చిత్తశుద్ధితో ఉన్నారని మంత్రి సవిత వెల్లడించారు. కొద్ది రోజుల కిందటే చేనేత రంగంపై సీఎం చంద్రబాబు సమీక్షా సమావేశం నిర్వహించారన్నారు. గత టీడీపీ ప్రభుత్వం మాదిరిగా నూలుపై సబ్సిడీ ఇవ్వాలని నిర్ణయించామన్నారు. చేనేతపై జీఎస్టీ మినహాయించాలని త్వరలో ఢిల్లీ వెళ్లి కేంద్రాన్ని కోరనున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం ముందుకు రాకపోయినా జీఎస్టీ భారం రాష్ట్ర ప్రభుత్వం మోయడానికి సిద్ధంగా ఉందన్నారు. చేనేతలకు మరింత ఆర్థిక దన్ను లభించేలా ట్రెండ్ కు తగ్గట్లుగా కొత్త డిజైన్లపై శిక్షణివ్వనున్నామన్నారు. అలా తయారు చేసిన వస్త్రాలకు మార్కెటింగ్ సదుపాయం కూడా రాష్ట్ర ప్రభుత్వమే కల్పించనుంది. త్వరలో సెల్లర్స్, బయ్యర్స్ సమావేశం కూడా ఏర్పాటు చేయబోతున్నామన్నారు. కలంకారీ వినియోగంపైనా చేనేతలకు శిక్షణిస్తున్నామన్నారు. ముఖ్యంగా ప్రకృాఎతి సంబంధమైన రంగుల వినియోగంపై చేనేత కార్మికులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఖాదీ బోర్డు ద్వారా రుణాలిచ్చే కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టబోతున్నామన్నారు. త్వరలోనే నియోజక వర్గంలో ఖాదీ బోర్డు రుణాల సద్వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు మంత్రి వెల్లడించారు. అంతిమంగా నేతన్నలకు మేలు చేయాలన్నదే సీఎం చంద్రబాబునాయుడు కృాఎతనిశ్చయంతో ఉన్నారని మంత్రి సవిత వెల్లడించారు.

# పేదరిక రహిత స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యం




● స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్‌కు సూచనలు ఇవ్వండి
● వ్యవసాయం, అనుబంధ రంగాల అభివృద్ధికి చర్యలు : మంత్రి కొలుసు

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్ ను పేదరికరహిత స్వర్ణాంధ్రప్రదేశ్ రాష్ట్రంగా రూపొందించడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రూపొందిస్తున్న స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ కు ప్రతీ ఒక్కరూ మంచి సూచనలు అందించాలని రాష్ట్ర గృాఎహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ రూపొందించడంపై గురువారం స్థానిక కలెక్టరేట్లోని గోదావరి సమావేశవు హాలులో అధికారులతో సమీక్షించిన అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విజన్ తో హైదరాబాద్ నగరానికి ప్రపంచపటంలో గుర్తింవు తెచ్చిన విధంగానే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృాఎద్ధిపథంలో దేశంలోనే ముందుస్థానంలో నిలిపేందుకు స్వర్ణాంధ్ర-2047 ప్రణాళికతో ముందుకు వెళుతున్నారన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వ విజన్ కు ముఖ్యమంత్రి అన్ని రంగాలలో 2047 నాటికి రాష్ట్రాన్ని దేశంలో ప్రథమ స్థాయిలో నిలిపేందుకు అవసరమైన విజన్ డాక్యుమెంట్ రూపొందించడంలో సమాజంలోని అన్ని వర్గాల ప్రజల ఆలోచనలను పరిగణనలోనికి తీసుకుంటున్నారన్నారు. రాష్ట్రాన్ని 2047 నాటికి స్వర్ణాంధ్ర గా రూపొందించడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి చేస్తున్న కృాఎషి కి అన్ని వర్గాల ప్రజలు తమ అమూల్యమైన సలహాలు, సూచనలు అందించి అత్యంత ఉత్తమమైన స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ రూపకల్పనకు సహకరించాలన్నారు. స్వర్ణాంధ్ర-2047 క్యూ ఆర్ కోడ్ ను స్కాన్ చేసి, అందులో సూచించిన అభివృాఎద్ధి సూచిక అంశాలలో ప్రజలు తమ అభిప్రాయాలను తెలియజేయాలన్నారు. అధికారులు, ప్రజల ఆలోచనలతో స్వర్ణాంధ్ర -2047 డాక్యుమెంట్ రూవుదిద్దుకుంటుందన్నారు. 2019 కి ముందు ఇదే విజన్ తో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆలోచనలు అమలు చేసిందన్నారు. రాష్ట్రంలో వ్యవసాయం, అనుబంధ రంగాలు, పారిశ్రామికంగా అభివృాఎద్ధిపథంలో నిలిపి రాష్ట్ర వృాఎద్ధిరేటు ను పెంచడమే ముఖ్యమంత్రి లక్ష్యమన్నారు. పోలవరం ప్రాజెక్ట్ పనులను చంద్రబాబునాయుడు 72 శాతం పూర్తి చేస్తే, గత ప్రభ్యుత్వం అస్సలు పట్టించుకోలేదన్నారు. అదేవిధంగా అమరావతి ప్రపంచస్థాయి రాజధాని రూపకల్పన చేస్తే దానిని కూడా ముందుకు తీసుకువెళ్లకుండా నిర్లక్ష్యం చేశారన్నారు. పరిశ్రమలు స్థాపించేందుకు వచ్చే పారిశ్రామికవేత్తలకు నమ్మకాన్ని కలిగించలేకపోయారన్నారు. గత ప్రభుత్వ రాజకీయ దురుద్దేశాలు కారణంగా రాష్ట్రంలో అభివృాఎద్ధి కుదేలైపోయిందన్నారు. అందుకే ప్రజలు తమ భావనను ఎన్నికలలో తెలియజేసి, విజన్ గల నాయకుడు చంద్రబాబునాయుడు ఒక్కరే అని నమ్మి ఘన విజయాన్ని అందించారన్నారు. గత 5 కాలంలో ఆర్థిక అవకతవకలు తప్ప రాష్ట్రంలో అభివృాఎద్ధి పై ఎటువంటి విజన్ ఆలోచన లేని నాయకత్వం కారణంగా ప్రజలు ఎంతో నష్టపోయారన్నారు. 10. 5 లక్షల కోట్ల అప్పులు, వాటిపై వడ్డీలు గత ప్రభుత్వం సాధించిన ఘనతలన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల అభివృాఎద్ధికి ప్రధానమంత్రి ఆవాస యోజన, జల్ జీవన్ మిషన్ వంటి ఎన్నో పథకాలు అమలు చేస్తున్నదని , వాటికి రాష్ట్ర ప్రభుత్వము కొంతమేర అందించవలసిన మాచింగ్ గ్రాంట్ లను గత ప్రభుత్వం విస్మరించడంతో కేంద్ర నిధులను సక్రమంగా వినియోగించుకోలేకపోయామన్నారు. ఏలూరు జిల్లా విజన్ డాక్యుమెంట్ చక్కగా రూపొందించారని, అదేస్థాయిలో అమలు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని మంత్రి పార్థసారథి చెప్పారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, జాయింట్ కలెక్టర్ పి .ధాత్రిరెడ్డి, ఎమ్మెల్యే లు బడేటి రాధాకృాఎష్ణయ్య (చంటి), డా. కామినేని శ్రీనివాస్, పత్సమట్ల ధర్మరాజు, జిల్లా అటవీశాఖాధికారి రవీంద్ర దామా, జిల్లా పరిషత్ సీఈఓ కె. సుబ్బారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సచివాలయ మహిళా ఉద్యోగులకు ముగిసిన క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : తిరుపతిలోని స్విమ్స్ శ్రీ బాలాజి ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజి ఆధ్వర్యంలో అమరావతిలోని సచివాలయంలో మహిళా ఉద్యోగులకు పింక్ బస్ ద్వారా రెండు రోజుల పాటు జరిగిన ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు శుక్రవారం ముగిశాయి. బ్లాక్ నంబరు 3లోని మహిళా ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ హాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు విశేషంగా పాల్గొని స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకున్నారు. ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖ, సచివాలయ మహిళా ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ అభ్యర్థన మేరకు సచివాలయంలో పింక్ బస్ క్యాంవు నిర్వహించారు. ఇందులో నోటి క్యాన్సర్ పరీక్షలు, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ లక్షణాలను గుర్తించేందుకు పాప్ స్మియర్, రొమ్ముక్యాన్సరుకు సంబంధించిన మామోగ్రామ్, అల్ట్రాసౌండ్ పరీక్షలు చేపట్టారు. ఒక్కొక్కరికి దాదావు రూ.10,000/- దాకా ఖర్చయ్యే ఈ పరీక్షలను మహిళా ఉద్యోగులకు ఉచితంగా నిర్వహించారు. పింక్ బస్ లోపల పూర్తిగా మహిళా వైద్యులు, సిబ్బందితో క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. క్యాన్సర్ తోపాటు గుంటూరు, విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రుల నుండి నిపుణులైన గైనకాలజీ, జనరల్ సర్జరీ, ఈఎన్ టి, డెంటల్ సర్జరీ వైద్యులు వైద్యసేవలందించారు. ఈ కార్యక్రమంలో ఎన్సీడి స్టేట్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శారద, స్విమ్స్ కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ నాగరాజ్, రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ విజయలక్ష్మి, కాంప్రహెన్సివ్ క్యాన్సర్ కేర్ స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్ బాబు, ప్రివెంటివ్ అంకాలజి నోడల్ ఆఫీసర్ డాక్టర్ అనిల్, పింక్ బస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హరిత, పిఆర్వో డి.చంద్రమోహన్ మరియు సిబ్బంది, ఏపీ సచివాలయ మహిళా ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రెసిడెంట్ కె.వైదూరిదేవి, వైస్ ప్రెసిడెంట్ ఎం.లక్ష్మణకుమారి, సెక్రెటరీ ఏ.సుస్మిత, అడిషనల్ సెక్రటరీలు ఎం.రాజేశ్వరి, ఎన్.నాగలలితా దేవి, జాయింట్ సెక్రెటరీ కె.సునీత, ట్రెజరర్ టి.శారద, గుంటూరు, విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రుల నుండి నిపుణులైన గైనకాలజీ, జనరల్ సర్జరీ, ఈఎన్ టి, డెంటల్ సర్జరీ వైద్యులు, పారామెడికల్ సిబ్బంది కలిపి 40 మంది వైద్య బృాఎందం పాల్గొన్నారు.

# సుప్రీంకోర్టు వ్యాఖ్యలు జగన్‌కే వర్తిస్తాయి



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : శ్రీ వారి ప్రసాదం లడ్డు ను రాజకీయం చేయడం తగదని సుప్రీం కోర్ట్ చేసిన హెచ్చరిక ప్రతిపక్ష పార్టీ నాయకుడు జగన్ కే వర్తిస్తుందని దేవాదాయ ధర్మదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. అయిదేళ్ల పాటు ఆంధ్రప్రదేశ్ లో హిందుత్వం పై, హిందూ దేవాలయాలపై దాడులు జరిగినప్పుడు అప్పటి ముఖ్యమంత్రి జగన్ నోరు మెదకపోవడమే కాకుండా చర్యలు తీసుకోలేదని మీడియాతో అన్నారు. రివర్స్ టెండర్ల పేరుతో నాసిరకం నెయ్యి సరఫరా అవుతున్న విషయం అప్పటి ఈవో కి తెలిసే మౌనం గా వున్నారా? సుప్రీం కోర్ట్ చేసిన వ్యాఖ్యలంటూ జగన్ చేస్తున్నది తప్పుడు ప్రచార మన్నారు. నాసిరకం వస్తువులు సరఫరా చేసిన సంస్థల ఎంపికలో కక్కుర్తి పడిన అప్పటి అధికారులను, తప్పు ఒప్పుకోకుండా జగన్ రక్షించే ప్రయత్నం చేయడం లేదా.? అని ప్రశ్నించారు. చంద్రబాబు ప్రజలకు జవాబుదారి కాబట్టే లడ్డు కల్తీని వెలుగు లోకి తెచ్చి అప్పటి జగన్ గుతేదార్లు, గంగిరెద్దుల్లా తలూపిన అప్పటి టీటీడీ ఈవో లు చేసిన నిర్వాకం వల్ల, టీటీడీ శ్రీవారి ప్రసాదంలో కల్తీ నిజాన్ని చంద్రబాబు వెలుగులోకి తెచ్చారు. జగన్ దేవుడు దగ్గర చేసిన తప్పులకు మే ప్రయాస్చితం చేసుకోవాల్సిన వచ్చి ది.లడ్డు విషయంలో నిజాలు వెలుగులోకి వస్తే తనకు, తను మద్దతు ఇచ్చిన అధికారులకు తగిన శిక్ష తప్పదని తెలిసే జగన్ తప్పుడు ప్రచారానికి దిగారు.సుప్రీమ్ కోర్ట్ ఇవుడు ఏర్పాటు చేసిన సిట్ అన్ని విషయాలను వెలుగులోకి తెస్తుంది. అప్పుడు జగన్ ఏ రకంగా నోరు మె దువుతారో చూడాలి. తాను చేసిన తప్పులు దేవుడి వ్యతిరేకం విధానాలు జగన్ వెంటాడుతాయి. శ్రీవారి పట్ల భయం, భక్తి లేని వ్యక్తి జగన్ మాత్రమేనని హిందువులు భావిస్తున్నారని తెలిపారు.

# సాలూరును కరుణించిన నరేంద్రమోడీ



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : పార్వతీవురం మన్యం జిల్లాలోని సాలూరుపై కేంద్రం కరుణించింది. గతంలో దేశానికి స్వాతంత్ర్యం రావడానికి ముందు సాలూరులో బ్రిటీష్ వారు రైల్వేస్టేషన్ ఏర్పాటు చేసి రైలుబండిని నడిపించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కొన్నాళ్లు నడిచిన ఆ రైలు బండి ఆగిపోయింది. ఈ స్టేషన్ మీదుగా రైళ్లు నడుస్తున్న సమయంలో దేశ, విదేశాలకు సాలూరు నుంచి గోధుమలు, సిమెంటు, బియ్యంతోపాటు ఇతర వస్తువులు సరఫరా అయ్యేవి. కాలక్రమేణా ఈ స్టేషన్ మూతపడింది. దీంతో సరకు రవాణా ఆగిపోయింది. అప్పటి నుంచి స్థానికులు రైలుబండిని నడిపించాలంటూ ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేస్తూనే ఉన్నారు. సాలూరు వరకు పొడిగింవు ప్రస్తుతం విశాఖపట్నం నుంచి విజయనగరం వరకు నడుస్తున్న మెము రైలును సాలూరు వరకు పొడిగించారు. ఈమేరకు గత నెలలోనే విశాఖపట్నం డివిజనల్ రైల్వే మేనేజర్ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఈ రైలు నెంబర్లు 07468, 07467, 67292, 67291 ఇవి. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా నడుస్తున్న రైలు బళ్లు ఇక్కడ నష్టాలు వస్తున్నాయని సేవలను ఆపేశారు. కనీసం ఒక బోగీతోనైనా నడిపించాలని కోరడంతో 2004లో రైలు బస్సు సేవలను ప్రారంభించారు. సాలూరు–బొబ్బిలి మధ్య ఇది నడిచేది. సాలూరు వరకు పొడిగింవు ప్రస్తుతం విశాఖపట్నం నుంచి విజయనగరం వరకు నడుస్తున్న మెము రైలును సాలూరు వరకు పొడిగించారు. ఈమేరకు గత నెలలోనే విశాఖపట్నం డివిజనల్ రైల్వే మేనేజర్ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఈ రైలు నెంబర్లు 07468, 07467, 67292, 67291 ఇవి. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా నడుస్తున్న రైలు బళ్లు ఇక్కడ నష్టాలు వస్తున్నాయని సేవలను ఆపేశారు. కనీసం ఒక బోగీతోనైనా నడిపించాలని కోరడంతో 2004లో రైలు బస్సు సేవలను ప్రారంభించారు. సాలూరు–బొబ్బిలి మధ్య ఇది నడిచేది. విజయవాడ వరకు పొడిగించాలి సాలూరు నుంచి పార్వతీవురం, రాయగడ, అలాగే మరో మార్గంలో సాలూరు నుంచి విజయవాడకు రైలు సేవలు అందించాలని స్థానికులు కోరుతూ వస్తున్నారు. దీంతో కొంతకాలం తర్వాత దండిగాం రోడ్డు వరకు ఈ రైలు పొడిగించారు. స్టేషన్ ను ఆధునికీకరించడంతోపాటు ఇతర మౌలిక సౌకర్యాలన్నీ ఏర్పాటు చేశారు. ఆ సమయంలో తుఫాను, ఈదురుగాలులతో ట్రాక్ దెబ్బతినడంతో మరమ్మతులు నిర్వహించారు. తాజాగా రైల్వేబోర్డు అనుమతులు జారీచేయడంతో మెము రైలు నడవడానికి మార్గం సుగమమైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తమ కల నెరవేరడంతో స్థానికులంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# వైఎస్సార్ జిల్లా పేరు మార్చండి



కడప : మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డికి ఏపీకి చెందిన వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ షాకిచ్చారనే చెప్పవచ్చు. మాజీ సీఎం వైయస్ జగన్ సొంత జిల్లా పేరును మార్చాలని సీఎం చంద్రబాబుకు మంత్రి సత్య కుమార్ లేఖ రాశారు. కడప జిల్లా చరిత్రపై అవగాహన లేని జగన్ .. నాడు తన పరిపాలన సమయంలో కడప జిల్లా పేరును వైఎస్సార్ జిల్లా గా మార్చారని మంత్రి లేఖలో పేర్కొన్నారు. కలియుగ వేంకటేశ్వరుడి సన్నిధికి చేరేందుకు తొలి గడప కడప అని, అటువంటి కడప పేరును యధాతథంగా మార్చాలని డిమాండ్ చేశారు. ఎంతో గొప్ప ఆధ్యాత్మిక ప్రాశస్త్యం గల కడప పేరు మార్పుపై నాడు.. శ్రీవారి భక్తులు భయంతో తమ అభిప్రాయాలను నాటి ప్రభుత్వం దృాఎష్టికి తీసుకెళ్ళలేదన్నారు. కడప జిల్లా అభివృాఎద్ధికి దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి పాటు పడిన విషయం ఎవ్వరూ కాదనలేని సత్యమని సత్యకుమార్ అన్నారు. రాయలసీమలోని కడప జిల్లాలో ప్రసిద్ధ వుణ్యక్షేత్రం దేవుని కడప. ఆదిమధ్యాంతరహితుడైన శ్రీనివాసుడు వెలసియున్న గొప్ప వుణ్యక్షేత్రం. ఈ ఆలయంలో శ్రీవారు శ్రీలక్ష్మి వెంకటేశ్వర స్వామిగా అవతరించి ఉన్నారు. ప్రధానంగా ఈ ఆలయం హనుమత్ క్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. పూర్వం ఈ ప్రాంతమంతా రాక్షస నిలయంగా ఉండేది. రాక్షసాంతకుడైన హనుమంతుడు ఈ ప్రాంత వాసులకు దానవ పీడ తొలగించడానికి మశ్చ్యావతారంగా ఆవిర్భవించాడని ప్రసిద్ధి. ఆ తరువాత కృాఎపాచార్యుల వారు తీర్థయాత్రలు చేస్తూ ఈ ప్రాంతానికి వచ్చి హనుమత్ క్షేత్రమైన ఈ క్షేత్రంలో బస చేశారు. అక్కడ నుండి వారు తిరుమల వెళ్లి శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించాలని సంకల్పించారు. కానీ కొన్ని పరిస్థితుల వలన వారు ముందుకు సాగలేకపోయారు. శ్రీవారి దర్శనాభిలాషతో కృాఎపాచార్యులు తపించి పోయారు. శ్రీవారి కరుణను పొందారు, స్వామి సాక్షాత్కారాన్ని పొంది కృాఎతార్థులైనారు. శ్రీవారి కృాఎప పొందిన ప్రదేశం కనుక వారు ఈ ప్రాంతాన్ని కృాఎపావతిగా నామకరణం చేశారు. ఆ కృాఎపావతి కురుపగా, కుడపగా క్రమేపి కడపగా ప్రసిద్ధి చెందింది. శ్రీవారి దర్శనాన్ని పొందిన కృాఎపాచార్యులు తన వలే తిరుమల క్షేత్రానికి వెళ్లలేని నిస్సహాయుల కొరకు తిరుమల శ్రీవారి ప్రతిరూపాన్ని ఇక్కడ ప్రతిష్టించారు. శ్రీవారి ఆదేశానుసారం హనుమంతుడి విగ్రహం ముందు ప్రతిష్ఠించబడిన శ్రీ వెంకటేశ్వర స్వామి భక్త వత్సలుడై ఇక్కడ పూజలు అందుకుంటున్నాడు. నాటి నుంచి తిరుమల శ్రీవారిని దర్శించడానికి వెళ్లే భక్తులు ముందుగా దేవుని కడప శ్రీవారిని దర్శించి తిరుమలకు వెళ్లడం ఆచారంగా మారిపోయింది.

# స్వతంత్ర సిట్ ఏర్పాటును స్వాగతిస్తున్నాము



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి మహాప్రసాదం లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగంపై అయిదుగురు సభ్యులతో స్వతంత్ర సిట్ ఏర్పాటు చేయాలని సుప్రీం కోర్టు ఆదేశించడాన్ని స్వాగతిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాన్ అన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాలకు అనుగుణంగా సి.బి.ఐ. నుంచి ఇద్దరు, రాష్ట్ర ప్రభుత్వం తరవున ఇద్దరు పోలీసు అధికారులు, ఎఫ్.ఎస్.ఎస్.ఏ.ఐ. నుంచి ఒక సీనియర్ అధికారి సభ్యులుగా ఉండే స్వతంత్ర సిట్ విచారణ ద్వారా సత్యం వెలుగు చూస్తుందన్నారు. తిరుమల శ్రీవారి లడ్డూ తయారీల్లో కల్తీ నెయ్యి వినియోగం విషయం వెల్లడైనప్పటి నుంచి సనాతన ధర్మాన్ని విశ్వసించే ప్రతి ఒక్కరూ ఆందోళనతో ఉన్నారని,. గత పాలకులు నియమించిన టీటీడీ బోర్డుల హయాంలో లడ్డూ ప్రసాదం కావచ్చు, స్వామివారికి చేసే కైంకర్యాలు కావచ్చు, అన్న ప్రసాదం కావచ్చు... అన్నిటా నాణ్యత ప్రమాణాలు లోపించాయనే భక్తులు ఆవేదనను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. పవిత్ర క్షేత్రం తిరుమలలో గత పాలక మండళ్ళు చేసిన నిర్ణయాలు, వారి పాలన తీరును – సమగ్రంగా సమీక్షించి, సంస్కరించే బాధ్యతను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృాఎత్వంలోని కూటమి ప్రభుత్వం తీసుకుంటుంది. తప్పుడు నిర్ణయాలకు, అపవిత్ర చర్యలకు కారకులైన వారిని నిబంధనల ప్రకారం బాధ్యులను చేస్తామని చెప్పారు.

# మోడీ దేవుళ్ళ పేరుతో రాజకీయం, ఓట్ల బిక్షాటన చేస్తున్నారు



● కేటీఆర్- హరీశ్ రావు అబద్దపు మాటలు మాట్లాడుతున్నారు
● బీజేపీ- బీఆర్ఎస్ పార్టీలపై టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఫైర్..

తెలంగాణ బ్యూరో ప్రతినిధి: బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఫైర్ అయ్యారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ దేవుళ్ళ పేరుతో రాజకీయం, ఓట్ల బిక్షాటన చేస్తున్నారు అని మండిపడ్డారు. కులం, మతం, శ్రీరాముడు, హనుమంతుడు పేర్లతో ఓట్లు అడుగుతున్నారని అన్నారు. అభివృద్ధి ధ్యేయంగా ప్రజల కోసం వెళ్తున్న సెక్యులర్ పార్టీ కాంగ్రెస్ కు ప్రజలు అండగా నిలవండి కోరారు. పెద్ద పెద్ద కంపెనీలు అదాని, అంబానీలకి కట్టబెట్టారు అని ఆయన ఆరోపించారు. అప్పులు చేసి కేసీఆర్ ఫాంహౌస్ కు పరిమితం అయ్యారు.. ఇక, కేటీఆర్, హరీశ్ రావు అబద్దపు మాటలు మాట్లాడుతున్నారు.. ఆ పార్టీకి ప్రతిపక్ష హోదా అవసరమా..? అని మహేష్ కుమార్ గౌడ్ అడిగారు.

ఇక, పీసీసీ అధ్యక్ష పదవి కోసం చివరి వరకు ప్రచార కమిటీ ఛైర్మన్ మధు యాష్కీతో ఆహ్లాదకరమైన పోటీ పడ్డామని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ఆఖరి వరకు పోటీ ఉన్న కలిసి పోయే తత్వం కాంగ్రెస్ లో ఉంటాయి.. మధు యాష్కీ నాకు పెద్దన్న లాంటి వారు.. రాజకీయ విభేదాలు ఉన్న డీఎస్ నా రాజకీయ గురువే అని చెప్పుకొచ్చారు. నేను రాజకీయ కుటుంబం నుంచి రాలేదు, మాది వ్యవసాయ కుటుంబం.. నక్సల్ ప్రభావిత ప్రాంతం నుంచి నిజామాబాద్‌కు వచ్చాను.. రాజకీయాల్లో పనీ చేసు కుంటూ అవకాశం వస్తుంది అని టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ వెల్లడించారు.

# కొత్త స్పోర్ట్స్ పాలసీ రూపొందించండి



● క్రీడల్లో గ్రామీణ యువతను ప్రోత్సహించాలి ● క్రీడా ప్రాంగణాలు ఒకే గొడుగు కిందికి తీసుకురావాలి
● యూనివర్సిటీల సహకారం తీసుకోవాలి ● అధికారులకు సూచించిన సీఎం రేవంత్ రెడ్డి

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: అద్భుతమైన క్రీడాకారులను తీర్చిదిద్దటంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణకు గుర్తింపు తెచ్చేలా కొత్త స్పోర్ట్స్ పాలసీని తయారు చేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. 2036 ఒలింపిక్స్ ను దృష్టిలో పెట్టుకొని కొత్త పాలసీలో లక్ష్యాలను నిర్దేశించుకోవాలని చెప్పారు. అధికారులు తయారు చేసిన కొత్త స్పోర్ట్ పాలసీ ముసాయిదాపై ముఖ్యమంత్రి శుక్రవారం సచివాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, జితేందర్ రెడ్డి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, క్రీడలు, యువజన అభ్యున్నతి శాఖ ముఖ్య కార్యదర్శి వాణి ప్రసాద్, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం కార్యదర్శి షానవాజ్ ఖాసీం ఈ సమావేశంలో పాల్గొన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు వివిధ దేశాలు, ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలను ప్రధానంగా చర్చించారు. వివిధ ఆటల్లో ప్రతిభ ఉన్న యువతను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడే క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పంగా ఎంచుకుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ లక్ష్యాన్ని నెరవేర్చేందుకు అనుసరించాల్సిన అత్యుత్తమ విధానాలను క్రీడా పాలసీలో పొందుపరచాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా నెలకొల్పనున్న స్పోర్ట్స్ యూనివర్సిటీని యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి సూచించారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ తరహాలోనే స్పోర్ట్స్ యూనివర్సిటీని పీపీపీ మోడల్లో నిర్వహించాలన్నారు. ప్రత్యేకంగా బోర్డు ఏర్పాటు చేసి ఛైర్మన్ను నియమించాలని, యూనివర్సిటీకి స్వయం ప్రతిపత్తి ఉండేలా బాధ్యతలు అప్పగించాలని సూచించారు. స్పోర్ట్స్ యూనివర్సిటీలో దాదాపు 13 కోర్సులు నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించారు. క్రికెట్, హాకీ, ఫుట్బాల్, బాస్కెట్ బాల్, స్విమ్మింగ్, టెన్నిస్, బ్యాడ్మింటన్, షూటింగ్, బాక్సింగ్, రెజ్లింగ్, టేబుల్ టెన్నిస్, అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్స్, ఆక్వాటిక్స్ లాంటి 14 క్రీడలను స్పోర్ట్స్ హబ్ లో పొందుపరిచారు. గచ్చిబౌలి స్పోర్ట్స్ స్టేడియం ప్రాంగణంలో స్పోర్ట్స్ యూనివర్సిటీని ప్రారంభించాలని చెప్పారు. దాదాపు 70 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ ప్రాంగణంలో ఇప్పటికే వివిధ క్రీడలకు రెడీమేడ్ సదుపాయాలున్నాయని, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా వాటిని అధునాతనంగా అప్ గ్రేడ్ చేసుకోవాలని సూచించారు. హైదరాబాద్ లో ఇప్పటికే అందుబాటులో ఉన్న ప్రముఖ క్రీడా మైదానాలు, స్టేడియంలు అన్నింటినీ స్పోర్ట్ హబ్ పరిధిలోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఎల్బీ స్టేడియం, హకీంపేట స్పోర్ట్స్ స్కూల్, కోట్ల విజయ భాస్కరరెడ్డి ఇండోర్ స్డేడియం, సరూర్ నగర్ ఇండోర్ స్టేడియం, యూనివర్సిటీ సైక్లింగ్ వెలోడ్రమ్ లాంటివన్నింటినీ గుర్తించి. ఒకే గొడుగు కిందకి తీసుకురావాలని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ క్రీడల్లో ప్రతిభావంతులను గుర్తించటం నుంచి వారికి చదువులకు ఆటంకం లేకుండా.. అటు జాతీయ స్థాయి, అంతర్జాతీయ స్థాయి పోటీలకు అవసరమైన ప్రావీణ్యం నేర్పించే క్రమంలో ఎదురయ్యే ఆటుపోట్లన్నీ పరిష్కరించేలా కొత్త పాలసీ ఉండాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. మన ప్రాంతంలో ఉన్న భౌగోళిక పరిస్థితులతో పాటు మన ప్రాంత యువతకు ఆసక్తి ఉన్న క్రీడలకే ప్రాధాన్యమివ్వాలని అప్రమత్తం చేశారు. దేశ విదేశాల్లో ఉన్న కోచ్లను రప్పించాలని, అక్కడున్న యూనివర్సిటీల సహకారం తీసుకునేలా ఎంవోయూలు చేసుకోవాలని చెప్పారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులకు ఇచ్చే ప్రోత్సాహకాలకు స్పష్టమైన విధానాన్ని అనుసరించాలని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఏ స్థాయి పోటీల్లో విజయం సాధించిన వారికి ఎంత ప్రోత్సాహకం అందించాలి, ఎవరికి ఉద్యోగం ఇవ్వాలి.. అనే మార్గదర్శకాలను ఖరారు చేయాలని అధికారులను ఆదేశించారు. ముసాయిదాకు సంబంధించి పవర్ పాయింట్ ప్రజంటేషన్లను పరిశీలించిన ముఖ్యమంత్రి పలు మార్పులు చేర్పులను సూచించారు.

## తెలంగాణలో ధరణి పోర్టల్ రద్దు

● త్వరలోనే ఆర్ఓఆర్ చట్టం తీసుకు వస్తాం ● ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండేలా ఈ చట్టం రూపొందించాం: మంత్రి పొంగులేటి



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: ధరణి పోర్టల్‌ను రద్దు చేసి త్వరలో ఆర్ ఓ ఆర్ చట్టం తీసుకు వస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. ఈ నెలాఖరులోగా అమల్లోకి తెస్తామని చెప్పారు. ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండే విధంగా రూపొందించాం.. ప్రజల అభిప్రాయాలు పరిగణలోకి తీసుకుంటాం.. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్స్ ను గాలికి వదిలేసింది.. పూర్తన ఇండ్లను దసరా లోపు పేద ప్రజలకు అందజేస్తామని ఆయన వెల్లడించారు. ఇక, వెంటనే మరమ్మత్తులు మౌలిక వసతులు కల్పిస్తాం.. ప్రతి నియోజకవర్గానికి 3500 నుంచి 4 వేల ఇండ్లు మంజూరు.. ప్రతిపక్షాల సలహాలు, సూచనలు స్వీకరిస్తామని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈనెల 7వ తేదీత ప్రజా ప్రభుత్వం ఏర్పాడి 10 నెలలు పూర్తి అవుతుంది అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. 10 నెలల్లో ప్రజలు కోరుకున్న వాటిని సాధించలేక పోయాం.. రాబోయే రోజుల్లో తెల్ల రేషన్ కార్డు సహా అన్ని పథకాలకు స్మార్ట్ కార్డుతో అనుసంధానం చేస్తాం.. ఈ దసరా లోపు స్మార్ట్ కార్డులు ఇస్తాం.. అర్హతలను బట్టి స్మార్ట్ కార్డు ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తాం.. రాబోయే నాలుగేళ్లలో ఇందిరమ్మ ఇళ్లకు అర్హులైన ప్రతి పేదలకు ఇళ్లు ఇస్తామన్నారు. జనవరి నుంచి ఆసరా పెన్షన్లు, సన్న బియ్యం పంపిణీ చేస్తాం.. రుణ మాఫీ కానీ రైతులకు 13 వేల కోట్ల రూపాయలతో త్వరలో విడుదల చేస్తామని ఆయన వెల్లడించారు. ప్రతిపక్షాలు సొల్లు మాటలు మాట్లాడుతున్నారు.. 10 ఏళ్లలో బీఆర్ఎస్ రైతులకు ఇచ్చింది 15 వేల కోట్లు మాత్రమే.. ప్రతిపక్ష పార్టీలు పోరం బోకు మాటలు మాట్లాడుతున్నాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మండిపడ్డారు.

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
# అమెరికా, జపాన్ పర్యటనలు విజయవంతం



● రాత్రి 9:30 గంటలకు శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారుల బృందం
● అభిమాన నేత డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఘనంగా స్వాగతం పలికిన ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు.
● గత నెల 24న ప్రారంభమైన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు అమెరికా, జపాన్ దేశాల అధికారిక పర్యటన నేటితో విజయవంతంగా ముగిసింది ● దాదాపు 13 రోజుల పాటు కొనసాగిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విదేశీ పర్యటన

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: అమెరికాలో జరిగిన అంతర్జాతీయ మైనింగ్ ఎగ్జిబిషన్ మైనెక్స్-2024లో కోమత్సు ,హిట్యాచి, క్యాటర్ పిల్లర్ వంటి ప్రముఖ కంపెనీలు ఉత్పత్తి చేసిన అత్యాధునిక షావెల్స్, డంపర్లు, కంటిన్యూయస్ మైనర్ యంత్రాలు, గనిలో ప్రమాదాలు జరగకుండా చూసే రక్షణ వ్యవస్థలను పరిశీలించారు.

ఆధునిక గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి పద్ధతులు, బొగ్గు ఉత్పత్తిలో భద్రత, ఆధునిక సాంకేతికతలు పరిశీలించారు. అంతర్జాతీయంగా ఉనికిలోకి వచ్చిన అత్యాధునిక గ్రీన్ ఎనర్జీ టెక్నాలజీలు, ఆధునిక మైనింగ్ విధానంలో అధికోత్పత్తిని సాధించే భారీ యంత్రాలు, వర్చువల్ రియాలిటీతో రక్షణ చర్యలు మొదలైనవి పరిశీలించారు. భూగర్భ గనుల్లో వర్చువల్ రియాలిటీ ద్వారా గని వెలుపలే ఉండి లోపల బొగ్గును తవ్వే సాంకేతికత ప్రధాన ఆకర్షణగా నిలిచింది.

అమెరికాలో అతిపెద్ద హూవర్ జల విద్యుత్ డ్యామ్ ను సందర్శించి జల విద్యుత్ ఉత్పత్తి విధానాలు, రక్షణ చర్యలు తెలుసుకున్నారు. జపాన్ పర్యటనలో యమనాషీ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ కేంద్రంలో గ్రీన్ హైడ్రోజన్ ను పెద్ద ఎత్తున ఉత్పత్తి చేయడానికి వినియోగించే సాంకేతికతను, సోలార్ విద్యుత్తును నిలువ ఉంచే ఫ్యూయల్ సెల్స్ టెక్నాలజీని పరిశీలించారు.

తోషిబా పరిశ్రమలను సందర్శించి అక్కడ ఉత్పత్తి అవుతున్న అత్యాధునిక ఫోటో వోల్టాయిక్ మాడ్యూల్స్ తయారీ టెక్నాలజీని పరిశీలించారు. రోహ్మ సెమీ కండక్టర్ల పరిశ్రమను సందర్శించి అక్కడ జరుగుతున్న పలు రకాల సెమీకండక్టర్ లు, హై ఎఫిషియన్సీ బ్యాటరీలు, ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్ సెమీకండక్టర్లు వంటివి పరిశీలించారు. జపాన్ రవాణా వ్యవస్థ లో కీలక పాత్ర పోషిస్తున్న బుల్లెట్ ట్రైన్ లో ఆయన స్వయంగా ప్రయాణించారు.

## ప్రభుత్వాన్ని విమర్శించిన జర్నలిస్టులపై
# క్రిమినల్ కేసు లొద్దు



న్యూఢిల్లీ, బ్యూరో ప్రతినిధి: ప్రభుత్వంపై విమర్శనాత్మక కథనాలు రాసినంత మాత్రన జర్నలిస్టులపై క్రిమినల్ కేసులు పెట్టడం సరికాదని భారత సర్వోన్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. అలా చేస్తే భావ ప్రకటనా స్వేచ్ఛకు విఘాతం కలిగించినట్లే అవుతుందని స్పష్టం చేసింది. తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్ను కొట్టివేయాలని కోరుతూ ఓ జర్నలిస్టు వేసిన పిటిషన్ విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ కేసులో ఎటువంటి బలవంతపు చర్యలు తీసుకోకుండా మధ్యంతర రక్షణ కల్పించింది. ప్రభుత్వ పాలనా విభాగంలో కుల సమీకరణాలకు సంబంధించి ఉత్తర్ప్రదేశ్కు చెందిన అభిషేక్ ఉపాధ్యాయ్ ఓ కథనం రాశారు. దీనిపై యూపీ పోలీసులతో పాటు వివిధ ప్రాంతాల్లో కేసులు నమోదయ్యాయి. దీనిని కొట్టివేయాలని కోరుతూ అభిషేక్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్ను విచారించిన జస్టిస్ హృషికేశ్ రాయ్, జస్టిస్ ఎస్వీఎన్ భట్టీలతో కూడిన ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రజాస్వామ్య దేశాల్లో భావవ్యక్తీకరణ స్వేచ్ఛను గౌరవించాలి. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఏ) ప్రకారం జర్నలిస్టుల హక్కులకు రక్షణ ఉంటుంది. కేవలం జర్నలిస్టులు రాసిన కథనాలను విమర్శలుగా భావించి, వారిపై క్రిమినల్ కేసులు పెట్టకూడదు అని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. ఈ క్రమంలో ఉత్తర్ప్రదేశ్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసిన న్యాయస్థానం. తదుపరి విచారణ నవంబర్ 5కు వాయిదా వేసింది.

# సికింద్రాబాద్-వాస్కో డి-గామా బై వీక్లీ ఎక్స్‌ప్రెస్

## ప్రారంభించనున్న కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి, జి. కిషన్ రెడ్డి, భారత ప్రభుత్వం , సికింద్రాబాద్ - వాస్కో డ - గామా ప్రారంభోత్సవ ఎక్స్ప్రెస్‌ను 6 అక్టోబర్, 2024న సికింద్రాబాద్ స్టేషన్ నుండి జెండా ఊపి ప్రారంభించనున్నారు. గౌరవ రవాణా శాఖ శ్రీ పొన్నం ప్రభాకర్ బీసీ సంక్షేమం శాఖ మంత్రి, తెలంగాణ ప్రభుత్వం ; మరియు హైదరాబాద్ జిల్లా ఇన్చార్జ్ మంత్రి మేయర్ గద్వాల విజయలక్ష్మి గద్వాల్ , గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పార్లమెంటు సభ్యులు, రాజ్యసభ ఎం. అనిల్ కుమార్ యాదవ్, శాసన మండలి సభ్యులు ఎస్ . వాణీ దేవి, శాసన మండలి సభ్యులు ఏ. వి. ఎన్ రెడ్డి, గౌరవ శాసన మండలి సభ్యులుఎం ఎం. ఎస్ ప్రభాకర్ రావు , శాసన మండలి సభ్యులు మీర్జా రహమత్ బేగ్ , శాసన మండలి సభ్యులు; మొహమ్మద్ మహమూద్ అలీ, శాసన మండలి సభ్యులు మీర్జా రియాజుల్ హసన్ ఎఫెండి, శాసన మండలి సభ్యుడు; డాక్టర్ బి. వెంకట్ నర్సింగ్ రావు , శాసన మండలి సభ్యులు అమెర్ అలీ ఖాన్, గౌరవ శాసన మండలి సభ్యులు; ప్రొ. ఎం. కోదండ రామ రెడ్డి, శాసన మండలి సభ్యులు; సనత్నగర్ శాసన సభ్యులు తలసాని శ్రీనివాస్ యాదవ్ ఈ సందర్భంగా పాల్గొనే అవకాశం ఉంది. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ మరియు ఇతర సీనియర్ రైల్వే అధికారులు కూడా హాజరుకానున్నారు.

ఈ రైలు కర్ణాటక, గోవా వైపు ప్రయాణించే ప్రజలకు ప్రత్యేకమైన ప్రత్యక్ష రైలు సౌకర్యాన్ని అందిస్తుంది. రైలు సమయాలు గోవా ఇతర మార్గమధ్య స్టేషన్లకు అనుకూలమైనవి. ఇది రిజర్వ్ మరియు అన్రిజర్వ్ సెగ్మెంట్ ప్రయాణీకులకు సౌకర్యాన్ని అందిస్తుంది. ఇది ఇతర రవాణా విధానాలతో పోల్చినప్పుడు తక్కువ ఖర్చుతో కూడుకున్న రవాణా సౌకర్యాన్ని అందిస్తుంది మరియు రైలు వినియోగదారులు వారి ప్రయాణాన్ని మరింత సౌకర్యవంతంగా ప్లాన్ చేసుకునే అవకాశాన్ని అందిస్తుంది. ఈ రైలు సేవ వినోదం, పర్యాటకం, విద్య, ఆరోగ్య సంరక్షణ మరియు వ్యాపార ప్రయోజనాల కోసం ప్రయాణించే ప్రజలకు సహాయపడుతుంది ఉపాధి అవకాశాలను విస్తరించడం ద్వారా ఈ ప్రాంతంలోని ప్రజల సామాజిక-ఆర్థిక అభివృద్ధికి ఉతమిస్తుంది.

ఈ రైలు సికింద్రాబాద్ , మహబూబ్నగర్ , గద్వాల్ , కర్నూల్ సిటీ, ధోన్లను వాస్కో-డ-గామాతో కలువుతుంది మరియు రెండు దిశలలో వారానికి రెండు రోజులు నడుపబడుతోంది. ఈ కొత్త రైలు దాదావు 854 కి.మీల దూరాన్ని ప్రయాణ సమయంలో దాదావు 20 గంటల పాటు ఎగువ దిశలో మరియు తిరుగు దిశలో 21 గంటల పాటు ప్రయాణిస్తుంది. ఈ రైలు సరికొత్త అత్యాధునిక ఎల్.ఎచ్.బి.కోచ్లతో ప్రవేశపెట్టబడింది. ఇది ప్రయాణీకులకు సౌకర్యవంతమైన ప్రయాణ అనుభూతిని మరియు ఆధునిక సౌకర్యాలను అందిస్తుంది. ఈ రైలు ఎ. సి. మరియు నాన్- ఎ.సి కోచ్ల మిశ్రమ కూర్పుతో అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడుతుంది. ఈ రైలు సౌకర్యవంతమైన రైలు షెడ్యూల్తో సికింద్రాబాద్ నుండి ప్రత్యక్ష ప్రత్యేకమైన రైలు ప్రయాణ సౌకర్యాన్ని అందిస్తుంది.

## రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

### బిజెపి ఎల్‌పి నాయకుడు మహేశ్వర్ రెడ్డి



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: రైతు రుణ మాఫీ విషయంలో సర్కార్ చెబుతున్నవన్ని ఖాకీ లెక్కలేనని బిజెపి శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చందుపట్లలో జరిగిన రైతు దీక్ష లో పాల్గొని సంఘీభావం తెలిపారు. చందుపట్ల సొసైటీలో 7వేల మంది రైతులు సభ్యులుగా ఉంటే కేవలం 3వేల మందికి మాత్రమే రుణమాఫీ జరిగిందని తెలిపారు. అందరికీ రుణమాఫీ జరిగే వరకు బిజెపి రైతుల పక్షాన నిలబడి పోరాటం చేస్తుందని చెప్పారు. చందుపట్ల కో ఆపరేటివ్ సొసైటీ లో జరిగిన అవినీతి, అక్రమాలపై విజిలెన్స్ ఎంక్వైరీ చేయాలని కోరతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ప్రేమెందర్ రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు, కిసాన్ మోర్చ రాష్ట్ర నాయకులు, భువనగిరి, చందుపట్ల రైతులు, సొసైటీ సభ్యులు, బిజెపి కిసాన్ మోర్చ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా బతుకమ్మ పండగ

● భాగ్యలక్ష్మి ఆలయం వద్ద మహిళా మోర్చ ఆధ్వర్యంలో బతుకమ్మ పండగ ● పాల్గొన్న ఎంపీ డీకే అరుణ, బిజెపి మహిళా మోర్చా జాతీయ అధ్యక్షురాలు వనతి శ్రీనివాసన్ ● రంగారెడ్డి జిల్లాలో పాల్గొన్న జిల్లా కార్యదర్శి చెన్నమనేని స్రవంతి





తెలంగాణ బ్యూరో ప్రతినిధి: తెలంగాణ లో ప్రత్యేకంగా నిర్వహించే బతుకమ్మ పండగ అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఆడబిడ్డలు అతి పవిత్రంగా నిర్వహించే బతుకమ్మ పండుగను అతి పవిత్రంగా నిర్వహిస్తారు. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతి బింబంగా నిలిచే బతుకమ్మ పండగ బుధవారం నుండి ప్రారంభమై తొమ్మిది రోజుల పాటు (సద్దుల బతుకమ్మ) కొనసాగుతుంది. 'బతుకమ్మ' పండుగను తెలంగాణా రాష్ట్రంలో ఆశ్వయుజ మాస శుద్ధ పాడ్యమి నుండి తొమ్మిది రోజుల పాటు జరువుకుంటారు. బతుకమ్మ (గౌరి) పండుగ లేదా సద్దుల బతుకమ్మతో ఈ పండగ ముగుస్తుంది. మూడవ రోజు ముద్దపప్పు బతుకమ్మ పండుగలో భాగంగా బతుకమ్మ పండుగ అంగరంగ వైభవంగా కొనసాగుతోంది. శుక్రవారం భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ మహిళా మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ పండుగలో బిజెపి మహిళా మోర్చా నాయకురాలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారి దేవాలయం ముందు బతుకమ్మ సంబరాల్లో భాగంగా బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు పార్లమెంట్ సభ్యులు డి కె అరుణ బిజెపి మహిళా మోర్చా జాతీయ అధ్యక్షురాలు వనతి శ్రీనివాసన్, బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ మేకల శిల్పారెడ్డి బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొన్నారు. రంగారెడ్డి జిల్లా పరిధిలోని శేరిలింగంపల్లి, కూకట్ పల్లి నియోజకవర్గంలో జరిగిన బతుకమ్మ పండుగ ఉత్సవాల్లో రంగారెడ్డి జిల్లా బిజెపి కార్యదర్శి చెన్నమనేని స్రవంతి పాల్గొని బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆ పరమశివుని సతీమణి పార్వతి దేవికి ప్రతిరూపం గౌరమ్మ నేపథ్యమే బతుకమ్మ ప్రతిరూపమని అన్నారు ముత్తదువలు అతి పవిత్రంగా పూజలు చేసి బతుకమ్మ పండుగలు పాల్గొంటారని తెలిపారు.

## రాజకీయాల్లో ఉన్నప్పుడు
# నోరు జాగ్రత్తగా పెట్టుకోవాలి

### బీజేపీ ఎంపీ డీకే అరుణ

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయం వద్ద బీజేపీ మహిళ మోర్చ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఎంపీ డీకే అరుణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలపై రియాక్ట్ అయ్యారు. కొండా సురేఖతో నాకు మంచి అనుబంధం ఉంది.. గతంలో ఇద్దరం కలిసి మంత్రులుగా పని చేశాం.. కానీ ఓ సినీ కుటుంబంపై ఆమె చేసిన ఆరోపణలు అభ్యంతకరంగా ఉన్నాయని చెప్పుకొచ్చారు. సినిమా ఇండస్ట్రీలో ఆ కుటుంబానికి ప్రత్యేక పేరు ఉంది.. ఎవరి వ్యక్తిగత విషయాలతో రాజకీయాలు ముడి పెట్టడం సరికాదు అని బీజేపీ ఎంపీ సూచించారు. రాజకీయాల్లో ఉన్నప్పుడు నోరు జాగ్రత్తగా పెట్టుకొని మాట్లాడాలి అని డీకే అరుణ తెలిపారు. ఇక, ఒకసారి మాట్లాడి మళ్లీ వెనక్కు తీసుకోలేమని మాజీమంత్రి, బీజేపీ ఎంపీ డీకే అరుణ అన్నారు. రాజకీయ నాయకులు ఆవేశం వచ్చినా ఆలోచించి మాట్లాడాలి.. ఒకరి మీద కోపం ఇంకొకరి మీద తీయడం సరికాదు అని చెప్పారు. ఒక మహిళను పట్టుకొని, సినిమా కుటుంబాన్ని కించపరిచే విధంగా మాట్లాడం కరెక్ట్ కాదు అని పేర్కొన్నారు. అలాగే, భాగ్యలక్ష్మి అమ్మవారి ఆగ్రహానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం గురి కావొద్దు అని తెలిపారు. అమ్మవారి ఆలయం దగ్గర మహిళలు బతుకమ్మ ఆడటానికి కోర్టు పర్మిషన్ తీసుకోవాల్సి వచ్చింది.. తెలంగాణ రాష్ట్రంలో మళ్లీ నియంతృాఎత్వ పాలనా కొనసాగుతుందని డీకే అరుణ చెప్పుకొచ్చారు.

# రంగారెడ్డి నుంచి రూ. 1436 కోట్లు

● రవాణా శాఖలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా రికార్డు ● రాష్ట్ర ఆదాయం రూ. 3195 కోట్ల లో 45 శాతం ఆదాయం ఇక్కడే
● త్రైమాసిక పన్నులు చెల్లించకుంటే వాహనాలు సీజ్ ● డీటీసీ మామిండ్ల చంద్ర శేఖర్ గౌడ్



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: రవాణా శాఖ ఆర్థ వార్షిక ఆదాయంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా టాప్నిలిచింది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా లోని జిల్లా పరిధిలోని రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, వికారాబాద్ జిల్లాలుసంయుక్తంగా రూ. 1436 కోట్లు ఆదాయాన్ని సాధించాయని ఉమ్మడి రంగారెడ్డి డీటీసీ మామిండ్ల చంద్ర శేఖర్ గౌడ్ వెల్లడించారు. శుక్రవారం మూడు జిల్లాల రవాణా శాఖ అధికారుల తో నిర్వహించిన సమీక్షా సమావేశం లో చంద్ర శేఖర్ గౌడ్ మాట్లాడుతూ, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలో ఆర్థి వార్షిక ఆదాయ లక్ష్యం రూ. 1792 కోట్లుగా ఉండగా.. ఇందులో 80 శాతం ఆదాయం ఇప్పటికే వచ్చిందని వెల్లడించారు. ఇక, జిల్లాలపరంగా రంగారెడ్డి జిల్లా రూ. 802 కోట్లు, మేడ్చల్-మల్కాజిగిరి రూ. 595 కోట్లు, వికారాబాద్ రూ. 39 కోట్ల ఆదాయం తెచ్చిపెట్టాయని, ఈ పరిధిలో మొత్తం రూ. 1436 కోట్ల ఆదాయం సాధించామన్నారు. రవాణా శాఖ పరిధి రాష్ట ఆదాయంలో రూ. 3195 కోట్లలో ఉమ్మడిరంగారెడ్డి జిల్లా పరిధి నుంచే 45 శాతం వచ్చిందన్నారు. త్రైమాసిక పన్నుల ద్వారా 161 కోట్లు, జీవిత కాలవు పన్నుల ద్వారా 1120 కోట్లు, ఫీజుల ద్వారా 92 కోట్లు, సర్వీస్ ఛార్జీ ల ద్వారా 21 కోట్లు, గ్రీన్ టాక్స్ ల ద్వారా 10 కోట్లు, తనిఖీల ద్వారా 32 కోట్లు వసూలు చేశామని, మొత్తం రూ. 1436 కోట్ల ఆదాయాన్ని సాధించినట్లు చంద్ర శేఖర్ గౌడ్ తెలిపారు. కాగా, త్రైమాసిక పన్నులు చెల్లించని వాహనదారులు పన్నులు చెల్లించాలని, లేని పక్షం లో తనిఖీలలో పట్టుబడితే వాహనాలను సీజ్ చేయడంతో పాటు భారీ జరిమానా విధిస్తామని చంద్ర శేఖర్ గౌడ్ హెచ్చరించారు. ఓవర్ లోడ్ తో తిరిగే వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఈ 2024-25 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం నిర్దేశించిన ఆదాయ లక్ష్యాన్ని చేరుకుంటామని మామిండ్ల చంద్ర శేఖర్ గౌడ్ ఈ సందర్భంగా సమీక్షలో వివరించారు. ఈ సమీక్షా సమావేశంలో వివిధ జిల్లాల రవాణా శాఖ అధికారులు సుభాష్ చందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, కిరణ్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, సుశీల్ రెడ్డి, నవీన్, వాసు, కృష్ణవేణి, మున్ని, అనూష, ఉపాసిని తదితరులు పాల్గొన్నారు.

గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్
GHMC
ఉప్పల్ సర్కిల్-2,ఉప్పల్,
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
**నిట్ నెం.11/EEC-2/UPL/GHMC/2024-25,** **తేదీ: 03-10-2024**
**పని పేరు:** 2024 సంవత్సరానికి గాను 5 పనుల కోసం "వార్డు నెం.7- చిల్కానగర్, డివిజన్ నెం.2, GHMCలోని వివిధ ప్రాంతాలలో బతుకమ్మ గుంటల ఏర్పాట్లను అందించడం. 2024 సంవత్సరానికి డివిజన్ నెం.10 - ఉప్పల్, డివిజన్ నెం.2, GHMC-" లోని బేబీ చెరువు, నల్ల చెరువు వద్ద బతుకమ్మ పండుగకు ఏర్పాట్లను అందించడం, **అంచనా వ్యయం: 8.22 లక్షలు. బిడ్స్ స్వీకరణకు చివరి తేది మరియు సమయం:** 07-10-2024 ఉ॥ 11.00 గం॥లకు. **అధికారి పేరు మరియు చిరునామా:** శ్రీ వి. హరిలాల్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఉప్పల్ డివిజన్ నె. 2., GHMC, తదుపరి వివరములను ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా http://www.tender.telangana. gov.in వద్ద చూడవచ్చును.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-2, ఉప్పల్, GHMC
DIPR.RO.No.4972-PP/CL/Advt/1/2024-25 , Dt: 04-10-2024

సూర్య
హైదరాబాద్
శనివారం
5 అక్టోబర్ 2024

సంపాదకీయం
editpage@suryaa.com

## వీర జవాన్ల సేవలను మరువరాదు !

రాత్రనక, పగలనక, ఎండనక, వాననక, చలి అనక అనుక్షణం భారతదేశ రక్షణకై అలుపెరుగని పోరాటం సల్పుతూ తుపాకి గుండ్లకు ఎదురొడ్డి కోట్లాది మంది దేశ ప్రజానీకానికి శత్రువుల నీడ కూడా తాకకుండా చేస్తున్న మన వీర జవాన్ల త్యాగనిరతిని, వారి వీరోచిత,మహోన్నత సేవలను మన మెప్పుడు మరచిపోకూడదు,పెడ చెవిన పెట్టకూడదు. ఒక విధంగా చెప్పాలంటే మన తల్లిదండ్రులతో సమానంగా మన వీర జవాన్లను ప్రేమించాలి,వారి ఆయురారోగ్యాలు బాగుండాలని ఆ దేవ దేవున్ని అశేష కోట్లాది మంది భారతదేశ ప్రజానీకం అయిన మనమంతా మనస్ఫూర్తిగా,మనసా,వాచ,కర్మణ ఎల్లవేళలా ప్రార్థించాలి, వేడుకోవాలి.ఎందుకంటే వారు పెట్టె ప్రాణభిక్ష తోనే మన యావత్ భారతదేశ ప్రజానీకం ఈ రోజున

ఎంతో సుఖసంతోషాలతో జీవిస్తున్నారు ఎలాంటి ప్రాణభయం లేకుండా అనే మాట సత్య దూరం కాదు.అలాగే మన భారతదేశ ప్రజానీకం మీద ఈగ,దోమ కూడా వాలకుండా ఒక రక్షణ కవచంలా నిలుస్తూ మన దేశ ప్రజానీకానికి వీరు అందిస్తున్న అమూల్యమైన,అద్వితీయమైన సేవలు వెలకట్టలేనివి,అజారామమైనవి.అలాగే తమ భార్య పిల్లలకు,నా అనుకున్న తమ కుటుంబ సభ్యులకు,బంధువులకు, స్నేహితులకు దూరంగా ఎక్కడో భారతదేశ సరిహద్దుల్లో తమ విధులు నిర్వర్తిస్తూ అనుక్షణం ప్రాణ భయంతో కూడిన వృత్తిలో కొనసాగుతూ కూడా వారు తమ వృత్తిని ఎంతో గౌరవప్రదంగా,అతి పవిత్రంగా భావిస్తూ చావో రేవో తేల్చుకోవాలి అన్న కొండంత ధైర్యసాహసాలతో ఒక చిరుత పులిలా ముందుకు సాగిపోతూ భారతదేశ రక్షణకై కంకణ బద్ధులై ఉండటం ఎంతైనా అభినందించాల్సిన విషయం.ఒక విధంగా చెప్పాలంటే మన భరతమాత ముద్దు బిడ్డలుగా మన భారతదేశాన్ని,యావత్ కోట్లాది మంది భారతదేశ ప్రజలను శత్రువుల నుంచి అనుక్షణం,నిరంతరం, రెప్ప కూడా వాల్చకుండా కాపాడుతూ తమ కర్తవ్యాన్ని,బాధ్యతను, అంకుటిత దీక్షను అత్యంత సమర్థవంతంగా నిర్వహిస్తూ మన వీరజవాన్లు పోషించే పాత్ర నభూతో న భవిష్యత్ అని నిస్సందేహంగా చెప్పవచ్చు. ఏదిఏమైనా నరనరాన దేశభక్తిని నింపుకొని శత్రు దేశాలతో జరిగే యుద్ధ రంగంలో కాలు మోపి,సమరభేరి మ్రోగించి తమ పరాక్రమాన్ని,ప్రతాపాన్ని ప్రదర్శించేందుకు ఎల్లవేళలా ఉద్రిక్తులు అయ్యే మన వీరజవాన్ల తెగువ, అంచెలంచెల దేశభక్తికి ప్రతి ఒక్క మన భారతదేశ ప్రజానీకం శిరస్సు వంచి శతకోటి నమస్కారాలు,నమ సుమాంజలులు వారికి తెలియజేయాల్సిన గురుతర బాధ్యత మనందరిపై అంటే ప్రతి ఒక్క భారతీయ సోదర, సోదరిమణులందరిపై ఎంతైనా వుంది అనే మాట సత్యదూరం కాదు. ఏమైనా మన వీరజవాన్లకు మనమెప్పుడు కూడా రుణపడి ఉండాలి,ఎందుకంటే వారు లేనిదే మన భారతదేశం కానీ,యావత్ మన భారతదేశ ప్రజానీకం కానీ సుఖ సంతోషాలతో,శాంతి,సౌఖ్యాలతో,సౌభాగ్యాలతో వర్ధిల్లడం అనేది దాదాపు అసంభవం అనే విషయం మనందరికీ విధితమే.అందుకే మన వీరజవాన్లు మరియు వారి కుటుంబ సభ్యుల శ్రేయస్సు,సంక్షేమం కోసం మన భారతదేశ ప్రజానీకం యావత్తు ఆ భగవంతునికి ఎల్లవేళలా పూజలు నిర్వహించడం అనేది భారతదేశ గడ్డపై జన్మించినందుకు భారతీయులం అయిన మనమంతా చేయాల్సిన ఒక తక్షణ కర్తవ్యం,ఓ ఎనలేని బృహత్తర బాధ్యత మనందరి భుజస్కందాలపై ఎంతైనా వుంది.విజయిభవా!జయ జయహో మన భారతదేశ సైనిక వీర కిశోరాలకు,మేరా భారత్ మహాన్. జైహింద్!

# ఏమిటీ తొందరపాటు మాటలు

● కేటీఆర్ సినిమా వాళ్ళను వాడుకున్నారంటూ మంత్రి కొండా సురేఖ ఆరోపణ ● మా జీవితాల్లోకి రాకూడదంటూ సమంత స్టేట్ మెంట్
● మంత్రిపై కోర్టుకు వెళ్లి కేసు నమోదు చేయించిన అక్కినేని నాగార్జున ● మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావు ల పై కేసు నమోదు
● పోలీసు ఫిర్యాదు చేసిన బిజెపి ఎంపి రఘునందన్ రావు ● సమాజానికి ఆదర్శంగా ఉండే వాళ్లే మితిమీరుతున్నారా సినీ సెలబ్రిటీస్ వర్సెస్ పొలిటికల్ వార్ ● నటుడు నాగార్జునకు అండగా నిలిచిన సినీ సెలబ్రిటీస్ ● క్షమాపణ చెప్పిన మంత్రి కొండా సురేఖ



విద్య వెంకట్ తెలంగాణ బ్యూరో
9391618181

సమాజానికి సేవలు అందిస్తూ ఆదర్శంగా ఉండాల్సిన సెలెబ్రిటీలు రాజకీయ నేతలు రోడ్డున పడుతున్నారు. సామాజిక స్పృహని పెంపొందించే నేతలు కావలసిన ప్రస్తుత రోజుల్లో రాజకీయాల కోసం డైలాగ్ వార్ తో రోడ్డున పడుతున్నారు. ఎదుటివారి మనోభావాలను గాయపర్చనంత వరకు మనకు వాక్స్వాతంత్రం ఉంటుందని గుర్తు చేశారు. ఇలాంటి చవకబారు, నిరాధారమైన వ్యాఖ్యలను తాను తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. సినిమా వారిని లక్ష్యంగా చేసుకోవద్దని, సినిమా వాళ్లే కదా అని చులకనగా చూడొద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. మన దేశంలోని మహిళలను, సినిమా పరిశ్రమ వారిని గౌరవించాలని సూచించారు. సమంతకు సురేఖ క్షమాపణ చైతూ-సమంత విడాకులపై మంత్రి కొండా సురేఖ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సమంతకు మంత్రి క్షమాపణ చెప్పారు. 'నా వ్యాఖ్యల ఉద్దేశం మహిళల పట్ల ఒక నాయకుడి చిన్నచూపు ధోరణిని ప్రశ్నించడమే కానీ మీ మనోభావాలను దెబ్బతీయడం కాదు. మీరంటే నాకు అభిమానం మాత్రమే కాదు. ఆదర్శం కూడా. నా వ్యాఖ్యల పట్ల మీరు మనస్తాపానికి గురైనట్లైతే బేషరతుగా నా వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నాను' అని ట్వీట్ చేశారు. సమంత-నాగచైతన్య విడాకులపై మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలతో మొదలైన రచ్చ.. చల్లారడం లేదు. తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్టు ప్రకటించిన కొండా సురేఖ..ఈ వ్యవహారంలో సమంతకు క్షమాపణలు చెప్పారు. సమంతకు కొండా సురేఖ సారీ చెప్పినా నిరసనలు ఆగడం లేదు. అక్కినేని కుటుంబానికి సపోర్టా సెలబ్రిటీల వరుస ట్వీట్లు చేస్తున్నారు. అయితే మంత్రి సురేఖకు లీగల్ నోటీసులు పంపుతామన్నారు అక్కినేని నాగార్జున. వ్యక్తిగత జీవితాలను రాజకీయాల్లోకి లాగొద్దని చెబుతోంది మూవీ అసోసియేషన్. బాధపెట్టాలని చూస్తే మౌనంగా ఉండబోమంటూ లేఖల ద్వారా చెబుతున్నారు సెలబ్రిటీలు. నాగ చైతన్య, సమంత దంపతులు విడిపోవడానికి మాజీ మంత్రి కేటీఆరే కారణమని, ఆయన సినీ పరిశ్రమలో పలువురు హీరోయిన్లకి మాదక ద్రవ్యాలు అలవాటు చేశారని, ఆయన వేధింపులు భరించలేక పలువురు సినీ హీరోయిన్లు పెళ్ళిళ్ళు చేసుకొని సినిమాలకు గుడ్ బై చెప్పేసి వెళ్ళిపోయారని తెలంగాణ మంత్రి కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ మంత్రి కొండా సురేఖకు బిగ్ షాక్ తగిలింది. కొండా సురేఖపై ప్రముఖ సినీ నటుడు అక్కినేని నాగార్జున పరువు నష్టం దావా వేశారు. ఈ మేరకు నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తమ కుటుంబ గౌరవాన్ని, ప్రతిష్టను దెబ్బతీసేలా సురేఖ వ్యాఖ్యలు చేశారని నాగార్జున పిటిషన్లో పేర్కొన్నారు. ఆమెపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు. వివరాలు..బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్పై విమర్శలు గుప్పిస్తూ మంత్రి కొండా సురేఖ చేసిన కామెంట్స్ ప్రస్తుతం తీవ్ర దుమారం రేపుతున్నాయి. హీరో నాగచైతన్య, హీరోయిన్ సమంత విడిపోవడానికి కేటీఆర్ కారణమని కొండా సురేఖ ఆరోపించారు. అలాగే ఎన్ కన్వెన్షన్ సెంటర్కు సంబంధించి కూడా ఆమె సంచలన ఆరోపణలు చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్గా మారాయి. అయితే కొండా సురేఖ కామెంట్లును నాగార్జున, అమల, నాగచైతన్య, సమంతతో సహా పలువురు సినీ ప్రముఖులు ఖండిస్తున్నారు. సాధారణంగా సినీ ప్రముఖులు ఇటువంటి వ్యాఖ్యలపై కూడా తొందరపడి స్పందించరు. స్పందిస్తే అది అక్కడితో ఆగదని వారికీ తెలుసు. కానీ తొలిసారిగా నాగ చైతన్య, సమంత, జూ.ఎన్టీఆర్, నాని తదితరులు చాలా ఘాటుగా స్పందించారు. ముందుగా నాగ చైతన్య స్పందిస్తూ "జీవితంలో విడాకులు అత్యంత భాధాకరమైన, కటినమైన నిర్ణయం. ఈ విషయంలో మేమిద్దరం చాలా ఆలోచించిన తర్వాతే పరస్పరం అంగీకారంతో విడిపోయాము. ఆ తర్వాత మా విడాకులపై అనేక నిరాధారమైన ఆరోపణలు వచ్చాయి. కానీ ఇరు కుటుంబాలపై ఉన్న గౌరవంతో ఇన్నాళ్ళు మౌనంగా ఉన్నా. మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు పూర్తిగా అబద్ధం హాస్యాస్పదంగా ఉన్నాయి. సినీ ప్రముఖుల వ్యక్తిగత జీవిత నిర్ణయాలను మీడియా హెడ్ లైన్స్ కోసం ఉపయోగించుకోవడం సిగ్గుచేటు," అని అన్నారు. సమంత స్పందిస్తూ, "విడాకులు నా వ్యక్తిగత విషయం . దాని గురించి ఊహాగానాలు మానుకోవాలని అభ్యర్థిస్తున్నా. మహిళగా ఉండటానికి, బయటకు వచ్చి నిలబడి పోరాడటానికి చాలా ధైర్యం, బలం కావాలి. ఈ ప్రయాణంతో నేను చాలా నేర్చుకున్నాను. అందుకు గర్వపడుతున్నా. ఇతరులపట్ల ఇటువంటి మాటలు సరికాదు. మంత్రిగా మీ మాటలకు ఓ విలువ ఉంటుంద గ్రహించి, ఇతరుల వ్యక్తిగత జీవితాల గురించి మాట్లాడేటప్పుడు బాధ్యతగా, గౌరవంగా ఉండాలని కోరుతున్నాను. నా విడాకులు పరస్పర అంగీకారంతోనే జరిగాయి. దీనిలో ఎటువంటి రాజకీయ ప్రమేయం లేదు. దయచేసి నా పేరుని రాజకీయాలలోకి లాగొద్దు. నేను వాటికి ఎప్పుడూ దూరంగానే ఉంటాను," అని అన్నారు. జూ.ఎన్టీఆర్ స్పందిస్తూ, "కొండా సురేఖగారు ఇతరుల వ్యక్తిగత జీవితాలతో నీచ రాజకీయాలు చేయడం సరికాదు. ప్రజా జీవితంలో ఉన్న మీవంటివారు మరింత హుందాగా, గౌరవంగా వ్యవహరించాలి. సినీ పరిశ్రమలో ఉన్నవారి గురించి మీరు ఇంత నిర్లక్ష్యంగా ఇటువంటి నిరాధారమైన వ్యాఖ్యలు చేయడం చాలా బాధాకరం. ఎవరైనా మాపై నిరాధారమైన వ్యాఖ్యలు చేస్తుంటే మేము చేతులు ముడుచుకొని మౌనంగా చూస్తూ కూర్చోము. ఇటువంటి వాటికంటే మనం ఉన్నతంగా వ్యవహరిస్తూ ఎవరి సరిహద్దులో వారు ఉండాలి. మన ప్రజాస్వామ్య దేశంలో ఇటువంటి నిర్లక్ష్య ధోరణిని సమాజం ఉపేక్షించదు. సహజ నటుడు నాని స్పందిస్తూ, "రాజకీయ నాయకులు దేని గురించి ఏదైనా మాట్లాడేయవచ్చనే మీ ధోరణి చాలా దిగజారుడుతనాన్ని సూచిస్తోంది. ఇతరుల వ్యక్తిగత జీవితాల గురించి మీరు ఇంత నిర్లక్ష్యంగా ఇంత మూర?ంగా మాట్లాడిన మాటలు విన్నప్పుడు మీరు ప్రజల పట్ల బాధ్యతగా ఉంటారని ఆశించలేము. ఇది కేవలం సినీ నటులో లేదా రాజకీయపార్టీల గురించి మాత్రమే కాదు. గౌరవ ప్రదమైన హోదాలో ఉంటూ ఈవిదంగా ఎవరు మాట్లాడినా తప్పే. మనం మీడియా ముందుకు వచ్చి ఏం మాట్లాడినా చెల్లుతుందనుకోవడం తప్పే. సమాజంపై తీవ్ర ప్రభావం చూపే ఇటువంటి ధోరణిని అందరూ ఖండించాలి," అని ట్వీట్ చేశారు ప్రకాష్ రాజ్ స్పందిస్తూ,"ఏంటీ సిగ్గులేని రాజకీయాలు%ా% సినిమాల్లో నటించే ఆడవాళ్ళంటే చిన్న చూపా? ఎజస్ట్ ఆస్కింగ్," అని ట్వీట్ చేశారు. తాజాగా అక్కినేని అఖిల్ కొండ సురేఖను టార్గెట్ చేసి ఒక సంచలన ట్వీట్ పెట్టారు. ఎలాంటి ఆధారాలు లేకుండా నోటికి వచ్చిన మాటలు మాట్లాడిన కొండా సురేఖ తీరును అఖిల్ తప్పు పట్టారు. నటుడు మహేశ్ బాబు కూడా ఈ అంశంపై ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. మా సినిమా కుటుంబంపై మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు తనకు ఎంతో బాధ కలిగించాయి అని పేర్కొన్నారు. ఒక కూతురికి తండ్రిగా, భార్యకు భర్తగా, ఓ తల్లికి కొడుకుగా... ఓ మహిళా మంత్రి మరో మహిళపై చేసిన వ్యాఖ్యలు తనను తీవ్ర వేదనకు గురిచేశాయని, ఆమె ఉపయోగించిన భాష ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని పేర్కొన్నారు. మరోవైపు కేసీఆర్ను కేసీఆర్ చావగొట్టిండేమో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్కు పదవీ కాంక్ష ఎక్కువ అని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు చేశారు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోవడానికి నూటికి నూరుశాతం కేటీఆర్ అని ఆరోపించారు. కేటీఆర్ పదవీకాంక్షే ఆ పార్టీకి కొంపముంచిందని అన్నారు. కేటీఆర్కు పదవీకాంక్ష అని ఆ పదవీకాంక్షతో కేసీఆర్ను ఏమైనా చేశారేమో అన్న ఆందోళన కలుగుతుందని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బడ్జెట్ సమావేశాల్లో మాత్రమే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రత్యక్షమయ్యారని మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఆ నాటి నుంచి నేటి వరకు కేసీఆర్ కనిపించడం లేదని చెప్పుకొచ్చారు. ఫామ్హౌస్లో కేసీఆర్ ఏం చేస్తున్నారో కూడా తెలియడం లేదు అని చెప్పుకొచ్చారు. గజ్వేల్లో కేసీఆర్ కనిపించడం లేదని త్వరలోనే పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తాం అని కొండా సురేఖ అన్నారు. గజ్వేల్ అసెంబ్లీ నుంచి పోటీ చేసి గెలుపొందిన తర్వాత ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని ఇదే విషయంపై ఓటర్లు సైతం చర్చించుకుంటున్నారని చెప్పుకొచ్చారు. ఇదే అంశంపై నాగార్జున సన్నిహిత వర్గాలు స్పందిస్తూ.. "రాజకీయ నాయకులు దృష్టిని ఆకర్షించడానికి సెలబ్రిటీల పేర్లను ఉపయోగించడమనే సంస్కృతిని ఆపాలి. ఈ దుష్ప్రచారానికి అడ్డుకట్ట వేయడానికి తెలుగు ఇండస్ట్రీ మొత్తం నాగార్జున, అతని కుటుంబానికి మద్దతుగా ముందుకు వచ్చింది. ఎందుకంటే తెలుగు చిత్ర పరిశ్రమలో నాగ్ అంటే విపరీతమైన ప్రేమ, గౌరవం ఉన్నాయి" అని పేర్కొన్నారు. ఏకొండా పై ఫిర్యాదు బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్తోపాటు టాలీవుడ్లోని పలువురు హీరోయిన్లపై తీవ్ర వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన తెలంగాణ మంత్రి కొండా సురేఖపై గురువారం బిఆర్ఎస్ మహిళా కార్పొరేటర్లు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిరాధారమైన ఆరోపణలు చేసిన కొండా సురేఖపై చర్యలు తీసుకోవాలని బంజారాహిల్స్ పోలీసులను కోరారు. మంత్రి కొండా సురేఖ చేసిన నిరాధారమైన ఆరోపణలు వెనక్కి తీసుకొని.. వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మంత్రి బుధవారం చేసిన ఈ వ్యాఖ్యలు సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నాయని వారు విమర్శించారు. గత రెండు వారాలుగా తిరుమల కల్తీ నెయ్యి వ్యవహారం జాతీయస్థాయిలో హైలైట్గా నిలిచింది. ఈ వ్యవహారంలో టిడిపి, వైసీపిలు రెండూ గోల్స్ చేశాయి. సెల్ఫ్ గోల్స్ కూడా చేసుకున్నాయి. ఈ వ్యవహారంలో టిడిపి కూటమి ప్రభుత్వం ఆత్మరక్షణలో పడిందని వైసీపి గొప్పగా చెప్పుకొంటే, తిరుమల డిక్లరేషన్ ఇచ్చేందుకు భయపడి జగన్ పర్యటన రద్దు చేసుకుని సెల్ఫ్ గోల్ చేసుకున్నారని టిడిపి ఎద్దేవా చేసింది. ? కనుక రెండు పార్టీలు సున్నితమైన ఈ అంశంలో నుంచి త్వరగా బయటపడాలనే కోరుకొంటున్నాయి. కానీ దీనిని అకస్మాత్తుగా ముగించడం సాధ్యపడదు కనుక రెండు పార్టీలు ఈ ప్రవాహంలో కొట్టుకుపోతున్నాయి. కానీ నిన్న తెలంగాణ మంత్రి కొండా సురేఖ బిఆర్ఎస్ నేత కేటీఆర్-అక్కినేని కుటుంబంపై సంచలన వ్యాఖ్యలు చేయడంతో మీడియాకు మరో కొత్త హాట్ టాపిక్ దొరికింది. కనుక ఇప్పుడు మీడియా ఆ అంశాన్ని భుజానికి ఎత్తుకుని స్పైసీ కథలు చెప్పడం ప్రారంభించాయి. దీంతో ప్రజల దృష్టి చేతిలో ఉన్న లడ్డూ మీద నుంచి ఆ అంశంపైకి మళ్ళింది. ఇది టిడిపి, వైసీపిలకు చాలా ఉపశమనం ఇచ్చేదే. అయితే ముళ్ళ కిరీటం ఒకరి నెత్తి మీద నుంచి మరొకరి నెత్తికి మారింది. కనుక ఇప్పుడు దానిని పెట్టుకొని కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు గేమ్ మొదలుపెట్టాయి. వాటి మధ్యలో టాలీవుడ్ హీరోలు కూడా కత్తులు పట్టుకొని దిగుతున్నారు. కనుక మరో కొత్త టాపిక్ దొరికే వరకు ఈ కథ రసవత్తరం సాగుతుంది. కనుక ఇక టిడిపి, వైసీపిలు తిరుమల స్వామివారి జోలికి, లడ్డూ జోలికి వెళ్లకుండా బుద్ధిగా రొటీన్ రాజకీయాలు చేసుకుంటే వాటికే మంచిది. తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ పార్టీ నేతల మధ్య జరుగుతున్న ఈ డైలాగ్ వార్ కు ఫుల్ స్టాప్ పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

● కొన్ని జిల్లాలలో అర్హత కలిగిన భాష పండితులు కరువు ● ఎస్ .టి.రిజర్వేషన్ కేటగిరీలో పోస్టులు భర్తీ లేదాయె
● భాష పండిత వ్యవస్థ రద్దు కోసం ఎన్నో సంవత్సరాలుగా ఉద్యమాలు ● ఎస్జీటి, స్కూల్ అసిస్టెంట్ నియామకాల్లో ఎలాంటి ఇబ్బందులుండవు
● సెలెక్ట్ అయిన ఉపాధ్యాయులకు నియామకపు ఉత్తర్వులు

డాక్టర్. ఎస్. విజయ భాస్కర్
9290826988



తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పంచాయతీ రాజ్ పాఠశాలల్లో పనిచేస్తున్న భాష వ్యవస్థ రద్దు చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల 8630మంది భాష పండితులకు స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులు కల్పించారు.1056 మంది అర్హత కలిగిన ఉపాధ్యాయులు పదోన్నతులు రాక మిగిలి పోయారు. కొన్ని జిల్లాలలో అర్హత కలిగిన భాష పండితులు ఉంటే పోస్టులు లేవు. భద్రాచలం లాంటి ఎస్ .టి.రిజర్వేషన్ కేటగిరీలో పోస్టులు అలాగే మిగిలి పోయాయి. గత మూడు దశాబ్దాలుగా ఉన్నత పాఠశాలలలో పనిచేస్తూ ప్రాథమిక పాఠశాల వేతనాలు తీసుకుంటూ శ్రమదోపిడికి, వెట్టిచాకిరికి గురవుతున్నామని భాష పండితులు ముఖ్యమంత్రులను, విద్యా శాఖ మంత్రులను, విద్యా శాఖ కార్యదర్శులను, విద్యా శాఖ సంచాలకులు (డైరెక్టర్) లను, ఇతర విద్యా శాఖ సంబంధిత అధికారులకు విజ్ఞాపన పత్రాలను సమర్పించారు.పాఠశాల విద్యా వ్యవస్థ లో ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ అంటూ రెండు కేటగిరిలు ఉంటాయి.రెండింటి విద్యార్హతలు వేరు వేరుగా ఉంటాయి.ఎస్జీటి ఉపాధ్యాయులుగా నియామకం కావడానికి ఇంటర్మీడియట్ పూర్తి చేసిన తర్వాత డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్ పూర్తి చేయాలి తరువాత టీచర్స్ ఎలిజిబిలిటి టెస్ట్ (టెట్) ఉత్తీర్ణులైన తర్వాత డి.ఎస్సీ పరీక్షను రాసి అందులో ఉత్తీర్ణత సాధించిన తరువాత ఒకటి నుండి ఐదవ తరగతి వరకు బోధించడానికి నియామకం చేస్తారు.స్కూల్ అసిస్టెంట్ పోస్టుల కోసం డిగ్రీ ( బి.ఏ.,బి.కాం.,బి.ఎస్సీ,బి.బి.ఏ.,బి.టెక్ తత్సమాన విద్యార్హతలు కలిగిన వారు) పూర్తి చేసిన తరువాత బ్యాచిలర్ ఇన్ ఎడ్యుకేషన్ (బి.ఎడ్) చేసి టీచర్స్ ఎలిజిబిలిటి టెస్ట్ ( టెట్) ఉత్తీర్ణత సాధించిన తరువాత డి.ఎస్సీ నిర్వహించి అందులో మెరిట్ సాధించిన వారికి స్కూల్ అసిస్టెంట్ ( తెలుగు, హిందీ, ఇంగ్లీష్, గణితం, భౌతిక శాస్త్రం, బయోలజీ, సాంఘిక శాస్త్రం) బోధించడానికి నియామకం చేస్తారు.భాష పండితులు ( తెలుగు, హిందీ, ఉర్దూ, మరాఠీ మిగతా దేశీయ భాషలు) బోధించడానికి లాంగ్వేజ్ పండిట్ 11,( తెలుగు, హిందీ, ఉర్దూ, మరాఠీ మిగతా దేశీయ భాషలు), స్కూల్ అసిస్టెంట్ రెండు కేటగిరీలు ఉన్నాయి.రెండు కేటగిరీలకు డిగ్రీ చేసిన తర్వాత పండిత శిక్షణ పూర్తి చేసుకున్న వారు లేదా బ్యాచిలర్ ఇన్ ఎడ్యుకేషన్ ( బి.ఎడ్ ) చేసిన తర్వాత ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు బోధించడానికి నియామకం చేస్తారు. ఎస్జీటి, స్కూల్ అసిస్టెంట్ నియామకాల్లో ఎలాంటి ఇబ్బందులు లేవు. భాష పండితుల వ్యవస్థ లో మాత్రం లాంగ్వేజ్ పండిట్ అయిన స్కూల్ అసిస్టెంట్ అయిన బోధనలోనూ, విద్యార్హత లోనూ ఎలాంటి తేడా లేదు. పొరుగు రాష్ట్రమైన ఆంధ్ర ప్రదేశ్ లో ఉన్నత పాఠశాలలలో బోధించే ఉపాధ్యాయులు స్కూల్ అసిస్టెంట్లు ఉండాలని భాష పండిత వ్యవస్థను రద్దు చేశారు. భాష పండిత వ్యవస్థ రద్దు కోసం ఎన్నో సంవత్సరాలుగా ఉద్యమాలు, పోరాటాలు చేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భాష పండిత వ్యవస్థను రద్దు చేయలేదు. కోఠారి కమీషన్ , వివిధ కమీషన్ లు, విద్యా కమిటీలు ఉన్నత పాఠశాలలలో కేవలం స్కూల్ అసిస్టెంట్ లు మాత్రమే బోధించాలని చెప్పినప్పటికీ పండిత వ్యవస్థ రద్దు చేయక పోవడంలో ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదని ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఉపాధ్యాయులు బహిరంగంగా విమర్శిస్తున్నారు.డి.ఎస్సీ 2024 కొత్త ఉపాధ్యాయుల నియామకాల్లో భాష లను బోధించడానికి కేవలం స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు వెరిఫికేషన్ చేస్తారని అందరూ భావించారు.కాని భాషలను బోధించడానికి భాష పండితులు, స్కూల్ అసిస్టెంట్ రెండు కేటగిరీలలో ఉపాధ్యాయుల పోస్టుల కోసం వెరిఫికేషన్ కు పిలుస్తున్నారు.

**నేడు కొత్త ఉపాధ్యాయుల ఫైనల్ లిస్ట్ :** తెలంగాణ రాష్ట్రంలోని కొత్త ఉపాధ్యాయ నియామకాల డి.ఎస్సీ ఫలితాలు విడుదల చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు విద్యా శాఖ కార్యదర్శి బుర్ర వెంకటేశం గారు తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాలలో కలెక్టర్ లకు అక్టోబర్ 4 వ తేదీ వరకు 1:3 సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసి ఫైనల్ లిస్ట్ అక్టోబర్ 5 వ తేదిన విడుదల చేయాలని అక్టోబర్ 9 న హైదరాబాద్ లోని లాల్ బహదూర్ స్టేడియంలో సెలెక్ట్ అయిన ఉపాధ్యాయులకు స్వయంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియామక ఉత్తర్వులు ఇవ్వనున్నట్లు ప్రకటించారు.తెలంగాణ రాష్ట్రం లోని 33 జిల్లాలలో ఉపాధ్యాయుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేసి ఫైనల్ లిస్ట్ తయారైంది. నూతన జాతీయ విద్యా విధానం (ఎన్ ఈ పీ-2020 )2020 ప్రకారం తెలంగాణ రాష్ట్రంలోని వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంటర్మీడియట్ బోర్డును రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.వచ్చే విద్యా సంవత్సరం నుండి 5౦3౦3౦4 విద్యా విధానం అమలు చేయడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.దీని ప్రకారం టిజిటి లు,పిజిటీ లు ఉన్నత పాఠశాలలలో ఉంటారు.భాష పండితుల విషయం లో పి.జి.లు పిహెచ్.డిలు,,బి.ఎడ్.,ఎం.ఎడ్ లు చేసిన భాష పండితులకు ఎక్కడ కేటాయిస్తారనేది పెద్ద ప్రశ్నగా మిగిలింది.స్కూల్ అసిస్టెంట్ లలో పి.జి తత్సమాన విద్యార్హతలు కలిగిన వారికి పి.జి టీ లుగా నియామకాలకు చేస్తారని స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు ఆశతో ఎదురు చూస్తున్నారు.

**భాష పండితులను ప్రాథమిక పాఠశాల స్థాయిలో నియమించాలి:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో విద్యార్థులకు చదవడం రావాలి, చదివింది అర్థం చేసుకోవాలి.అర్థం చేసుకున్నది వ్యక్తీకరించాలి.అనే ఉద్దేశంతో లిప్ ( ఎల్ఐపి) లెర్నింగ్ ఇంప్రూవ్మెంట్ ప్రొగ్రాం ను అమలు చేస్తున్నారు.ప్రాథమిక స్థాయిలో భాష పండితులను నియమిస్తే విద్యార్థులకు చిన్నప్పుడే తమ మాతృ భాష పై పట్టు దొరుకుతుంది.ఎంతోమంది మేధావులు, శాస్త్రవేత్తలు, డాక్టర్ లు, ఇంజనీర్లు,న్యాయమూర్తులు,న్యాయవాదులు ఇతర రంగాల ప్రముఖులు ప్రాథమిక పాఠశాల స్థాయిలో మాతృభాష తెలుగు మాధ్యమం లో విద్యను అభ్యసించి ఉన్నత విద్యను ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన చేసిన వారు.తెలంగాణ రాష్ట్రం లోని విద్యార్థులు జాతీయ స్థాయిలో నిర్వహించే పోటీ పరీక్షలలో ఉత్తీర్ణులు కాకపోవడానికి కారణం ప్రాథమిక స్థాయిలో జాతీయ భాష హిందీ లేకపోవడం.తెలంగాణ రాష్ట్రం లో ద్వితీయ భాషగా ఉర్దూ ను బోధిస్తున్నారు.ప్రాథమిక స్థాయిలో ఉర్దూ భాష పండితుల నియామకాలు జరిగితే ఉర్దూ లో మంచి పట్టు లభిస్తుంది.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ విద్యా శాఖ విద్యార్థులకు ప్రాథమిక స్థాయిలో తమ మాతృ భాష ( తెలుగు, హిందీ, ఉర్దూ, మరాఠీ) లలో భాష పండితులను నియమించి ప్రాథమిక స్థాయి లోనే చదవడం, రాయడం లో పట్టు సంపాదించడానికి అవకాశం ఉంటుంది.

**ఉపాధ్యాయులుగా చేయడం వృత్తి కాదు రేపటి తరాన్ని తయారు చేసే నైపుణ్యం :** సమాజం లోని అన్ని వృత్తుల కన్నా ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనది.గౌరవింపదగినది.ఆదరింపదగినది.ఉపాధ్యాయులుగా పని చేయడం అంటే యాంత్రికంగా పని చేయడం కాదు.రేపటి తరాన్ని రేపటి భవిష్యత్తును నిర్ణయించే నైపుణ్యం. ఒక డాక్టర్ తప్పుచేస్తే ఒక రోగికి అన్యాయం జరుగుతుంది.ఒక న్యాయమూర్తి తప్పుడు తీర్పు ఇస్తే ఒక బాధితుడుకి అన్యాయం జరుగుతుంది.ఒక ఉపాధ్యాయుడు తప్పు చేస్తే కొన్ని తరాల వరకు అన్యాయం జరుగుతుంది.ఉపాధ్యాయ వృత్తిని జీతం కోసం కాకుండా విద్యార్థుల జీవితాల కోసం నిర్వహించాలి. ఉపాధ్యాయ శిక్షణ కళాశాలలైన డైట్,బి.ఎడ్ కళాశాలల్లో ఉపాధ్యాయులు, ఉపన్యాసకులు, ఆచార్యులు లేక పోవడం వల్ల ఉపాధ్యాయ వృత్తి మీద ఎంతో ప్రేమగా ఎంతో బాధ్యతతో ఎంతో గౌరవంతో వచ్చిన వారికి నిరాశే మిగులుతుంది.మొత్తం తెలంగాణ రాష్ట్రంలోని 10 డైట్ కళాశాలల్లో 170,180 మంది ఉపాధ్యాయులు ఉండాల్సింది 20,22 మంది ఉపాధ్యాయుల కంటే ఎక్కువ లేరు.వారు కూడా 2024,25,26 విద్యా సంవత్సరంలో పదవీ విరమణ చేయనున్నారు.అనేక మంది స్కూల్ అసిస్టెంట్ లుగా 25,26 సంవత్సరాల నుండి ఉపాధ్యాయులుగా సుదీర్ఘ అనుభవం కలిగిన వారికి డైట్,బి.ఎడ్ కళాశాలల్లో పదోన్నతులు కల్పిస్తే ఛాత్రోపాధ్యాయులకు ఎంతో మేలు కలుగుతుంది.కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల చేత ఉపాధ్యాయ శిక్షణ కళాశాలలను నడపడం ఆందోళన కరమైన విషయం. నూతన విద్యా విధానంతో నిరక్షరాస్యుల శాతం పెరుగుతుంది. అందరికీ అందుబాటులో విద్యా అనే విధంగా సార్వత్రిక విశ్వవిద్యాలయం ( ఓపెన్ యూనివర్సిటీ) 1982 లో ప్రారంభించారు.నిరక్షరాస్యులను 21 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులకు ఎంట్రెన్స్ టెస్ట్ పెట్టి అడ్మిషన్లు ఇచ్చి బి.ఏ.,బి.కాం.,బి.ఎస్సీ చేసే అవకాశం ఇచ్చేవారు.నూతన విద్యా విధానం 2020 ప్రకారం 5౦3౦3౦4 ప్రకారం ఎంట్రెన్స్ టెస్ట్ తీసివేసి 10౦2 ఉండాలనే నిబంధన పెట్టారు.దీనివలన పదవతరగతి, ఇంటర్మీడియట్ పూర్తి చేయని వారు సార్వత్రిక విశ్వవిద్యాలయం ( ఓపెన్ యూనివర్సిటీ) లో డిగ్రీ చేయడానికి అవకాశం లేదు.గతంలో పదవ తరగతి ఉత్తీర్ణత సాధించని వారు ఓరియంటల్ కళాశాలల్లో ప్రీ డిగ్రీ కోర్సు పూర్తి చేసిన తర్వాత సార్వత్రిక విశ్వవిద్యాలయం ద్వారా పట్టభద్రులు కావడానికి అవకాశం ఉండేది.ఓరియంటల్ విద్యాసంస్థలను మూసి వేశారు.నిరక్షరాస్యత నిర్మూలనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్ల రూపాయలను ఖర్చు చేసి నూతన విద్యా విధానంతో కొత్త కొత్త నిబంధనలు అమలు చేసి అక్షరాస్యత కు దూరం చేస్తున్నారు.

**ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కు గత దశాబ్ద కాలంగా ముఖ్యమంత్రి దూరం:** తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత దశాబ్ద కాలంగా తెలంగాణ ముఖ్యమంత్రి గా చేసిన వ్యక్తి భారత రత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టిన దినోత్సవ సందర్భంగా ఇచ్చే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కార్యక్రమంలో పాల్గొనలేదు.తెలంగాణ ముఖ్యమంత్రి గా శ్రీ రేవంత్ రెడ్డి గారు ఈ సారి జరిగిన సెప్టెంబర్ 5న జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరు కానప్పటికీ ఉపాధ్యాయుల గొప్ప తనమును వేనోళ్ళ పొగిడారు.ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఉపాధ్యాయులే తమ ప్రభుత్వానికి సూచనలు సలహాలు ఇవ్వాలని కోరారు. ఇటీవల గత ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు పూర్తి చేయడం ముఖ్యంగా గత మూడు దశాబ్దాలుగా భాషోపాధ్యాయ,పిఈటీలకు 10 వేలకు పైగా పదోన్నతులను పూర్తి చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో ఆదర్శ పాఠశాలల పేరిట ప్రత్యేకంగా నిధులను మంజూరు చేసి మౌలిక సదుపాయాలను కల్పించడం జరిగింది. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అర్హులు అయిన వారికి ఇచ్చి దాని గౌర వాన్ని, ఉన్నతిని పెంపొందించాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోరుతున్నారు.ఉపాధ్యాయ వృత్తి కి అంకితమై పని చేస్తున్న ఉపాధ్యాయులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలని కోరారు. ఉద్యోగ అభద్రతా, సకాలంలో చెల్లించని జీతాలు, భారమైన బోధనేతర బాధ్యతలతో ఛాత్రోపాధ్యాయులకు సరైన శిక్షణ అందడం లేదు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ విద్యా శాఖ తెలంగాణ రాష్ట్రంలోని ఉపాధ్యాయ శిక్షణ కళాశాలల్లో పూర్తి స్థాయిలో ఉపాధ్యాయుల నియామకాలు వీలైనంత త్వరగా భర్తీ చేయాలని తల్లిదండ్రులు, మేధావులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోరుతున్నారు.

## జైళ్లలో కుల సంకెళ్లు సిగ్గు చేటు

దేశంలోని జైళ్లలో కుల వివక్ష కొనసాగడం దౌర్భాగ్యం. ఖైదీలకు కులాల వారీగా పనుల అప్పగింత, వసతి ఏర్పాటు నేటికీ అధికారికంగా కొనసాగుతుందని తెలిసినప్పుడు నవ్వాలో, ఏడవాలో తెలియని స్థితి. పౌరులంతా సమానమే నంటూ రాజ్యాంగం రాసుకొని దశాబ్దాలైనా ఈ విష సంస్కృతి ప్రభుత్వం ఆధ్వర్యంలోనే నడిచిపోవడం, సభ్య సమాజం దృష్టి సోకకపోవడం అనారోగ్యకరమైన వింత. నేడు సుప్రీం కోర్టు అన్ని రాష్ట్రాలకూ, కేంద్రానికీ ఈ విపరీత పోకడ కొనసాగరాదని, అందుకు అవసరమైన మార్పుల్ని జైలు మాన్యువల్స్ లో ప్రవేశ పెట్టాలని తాఖీదు నివ్వడం అభినందనీయం. జైలు గోడల మధ్య జరిగే కుల వివక్ష దృష్టికి వస్తే, దాన్ని విచారణకు అర్హమైన కేసుగా పరిగణించాలని కోర్టులకు, అధికార యంత్రా ంగానికి సూచించడం మంచి పరిణామం. సమాజం కుల రహితంగానో, అన్ని కులాల్ని సమానంగా చూసే స్థితికి చేరడంగానో అయ్యేందుకు చాలా దూరం, కాలం పడుతుంది. అంత బలమైన వ్యవస్థను మార్చడానికి ఎన్నో మార్పులు, సంస్కరణలు రావాలి. చట్టాల ద్వారా, చైతన్యం ద్వారా ఆ మార్గం లో నడిచేందుకు రాజ్యాంగం వీలు కల్పించింది. అంటరాని తనం నేరంగా పరిగణించినా, సమానత్వం హక్కులు, ప్రత్యేక హక్కులు పొందుపర్చినా ఆ కృషిలో భాగమే. వాటిని కాపాడాల్సిన, అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలది. అలా రక్షణగా నిలవాల్సిన ప్రభుత్వాలు తెలిసో, తెలియకో ఇలాంటి వివక్షా పూరిత నిబంధనల్ని కొనసాగించడం సమాజాన్ని వెనక్కి నడిపించడమే. సుప్రీం ఈ తప్పుని సరిచేసింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తదనుగుణంగా చర్యల్ని వెంటనే చేపట్టాలి.

డా.డివి.జి. శంకర రావు, మాజీ ఎంపీ,
944083691

## సమన్యాయం ఈ ప్రజాస్వామ్యానికి ఆరోగ్యకరం !

ఈ ప్రజాస్వామ్యం లో అందరికి సమన్యాయం చేయడం మన ప్రభుత్వాల,పోలీసున్యాయవ్యవస్థల కనీస ధర్మం.ఎందుకంటే ఇప్పుడున్న వ్యవస్థ ఎలా తయారు అయింది అంటే అధికార పార్టీకి ఒక న్యాయం,ప్రతిపక్ష పార్టీలకు మరో న్యాయంలా మన చట్టాలు ఉండకూడదు, పొడ చూపకూడదు కూడా.మన దృష్టిలో చట్టం ఎవరికి తొత్తులుగా మారాల్సిన అవసరం లేదు,అది తన మానాన తాను పని చేసుకుంటూ పోతే ఎవరికి ఎలాంటి సమస్య ఉండదు.అప్పుడు పార్టీలకు అతీతంగా అందరికి సమన్యాయం జరుగుతుంది. అయితే ఇప్పుడు దేశంలో గాని,రాష్ట్రంలో గాని అధికారపార్టీలా హవా 'మూడు పువ్వులు ఆరు కాయలుగా' వర్ధిల్లుతున్నది అనే మాట సత్య దూరం కాదు.వారు తప్పు చేసిన కూడా తమ పంతాన్ని నెగ్గించుకుంటూ ఎలాగోలా తమ అధికారాన్ని వినియోగించి చట్టం నుంచి తప్పించుకుంటున్నారు.మరో ప్రక్క ఏదైనా ప్రతిపక్షపార్టీ వారు తప్పులు చేస్తే వారిపై కేసులు బనాయించి వారికి జైలు శిక్షలు పడేలా చేస్తున్నారు.ఇదేమి న్యాయం అని అధికారపార్టీ వారిని అడిగితే మాకు కూడా ప్రతిపక్షంలో వున్నప్పుడు ఇదే పరిస్థితి తల ఎత్తింది అని వాపోతున్నారు.ఎంతో హుందాగా అందరికి అమోదయోగ్యంగా, ఎలాంటి విమర్శలకు,వివాదాలకు తావు లేకుండా పనిచేయాల్సిన చట్టం ఇలా ఒక వైపు వారికే కొమ్ము కాస్తూ అపహాస్యం పలు అవుతుండటం ముఖ్యంగా అటు సామాన్య ప్రజానీకానికి,ఇటు ప్రజాస్వామ్యానికి ఏమాత్రం ఆరోగ్యకరమైన పరిణామం కాదు, పైగా ఏ మాత్రం మింగుడు పడని విషయం కూడా.ఎందుకంటే చట్టం అనేది ప్రజలకు ఒక వజ్రాయుధంలా పనిచేస్తూ వారికి ఎనలేని భరోసాను ఇవ్వడమే కాదు,తప్పు చేస్తే నిర్దాక్షిణ్యంగా శిక్షిస్తుంది అనే భయం కూడా వారిలో కలిగించాలి. అప్పుడే ఈ ప్రజాస్వామ్యంలో ఎలాంటి అవినీతి, దౌర్జన్యం,నేరాలు,హత్యలు,అత్యాచారాలు, మోసాలు,దొంగతనాలు,భూకబ్జాలు, దురాక్రమణలు వంటి చట్ట విరుద్ధ కార్యక్రమాలు జరుగకుండా ప్రజలంతా సుఖ,శాంతులతో ప్రశాంతవాతావరణంలో జీవించగలుగుతారు. అలా కాకుండా చట్టం అదుపుతప్పితే మాత్రం ఈ సమాజంలో అసాంఘిక కార్యక్రమాలు ప్రబలి ఈ యావత్తు వ్యవస్థే భ్రష్టుపట్టి పోతుంది అనే మాట అక్షర సత్యం.అలాంటి దారుణ పరిస్థితులు నేటి సమాజంలో పొడచూపకుండా ఉండాలంటే మాత్రం చట్టం అనేది నేరగాళ్ల, మోసగాళ్ల,కబ్జా కోరుల,రేపిస్ట్ లా, 420 గాళ్ళ భరతం పట్టేలా ఉండాలి. ఒక విధంగా చెప్పాలంటే చట్టం అనేది నాలుగు పాదాలపై నడిచినప్పుడే ఏ దేశమైన,ఏ రాష్ట్రమైన అభివృద్ధి పథంలో శరవేగంగా దూసుకుపోతుంది. కాబట్టి అన్నింటికి మూలస్తంభం చట్టమే,అంటే ఒక దేశం గాని, రాష్ట్రం గాని తనదైన పంథాలో అన్ని రంగాలలో ఎలాంటి అవినీతికి,బంధుప్రీతికి తావు లేకుండా నైతికత అనే నాలుగు అక్షరాలతో అత్యంత దిగ్విజయంగా సాగిపోవాలంటే మాత్రం చట్టం తన పనిని, కర్తవ్యాన్ని అత్యంత సమర్థవంతంగా ఎలాంటి లోపభూయిష్టానికి తావులేకుండా నిర్వర్తించగలిగినప్పుడే ప్రజలందరికి సంపూర్ణమైన సుపరిపాలన అనే అభివృద్ధి ఫలాలు నూటికి నూరుపాళ్ళు ఈ ప్రజాస్వామ్యంలో ప్రజలకు అందేది.అలా జరుగకపోతే ప్రజల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే లాగా తయారు అవ్వడం తథ్యం. ఏదిఏమైనా పార్టీలకు అతీతంగా తప్పు చేసిన వారిని శిక్షిస్తూ,తప్పు చేయని వారికి రక్షణగా ఉండాల్సిన చట్టాలు ఇలా ఒంటెద్దు పోకడలను అవలంబిస్తూ ఇలా తమకున్న కీర్తి ప్రతిష్టలను చేజేతులారా మసక బారేలా చేసుకుంటుండటం ఈ ప్రజాస్వామ్యానికి సంబందించి అత్యంత హేయమైన,బాధాకరమైన విషయం. ఎందుకంటే అనాదిగా ఈ న్యాయవ్యవస్థ ప్రజలకు అందుబాటులో వుంటూ వారు తప్పుడు మార్గంలో పయనించకుండా వారికి ఒక కాపలాదారుడిగా వుంటూ విశేష సేవలు అందించిన చరిత్ర ఈ న్యాయ,పోలీసు వ్యవస్థల స్వంతం. అలాంటి గొప్ప చరిత్ర గల న్యాయ,పోలీసు వ్యవస్థ ఇలా కళ్ళు వున్న కళ్ళు లేని కబోదిలా మారి తమ ప్రతిష్టకు భంగకరం అయ్యేలా తయారు కావడం ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదు.ఏమైనా ఇప్పటికైనా న్యాయ,పోలీసు వ్యవస్థలు కళ్ళు తెరచి తమ తప్పులు తెలుసుకొని పార్టీలకు అతీతంగా ప్రజలకు,నాయకులకు సరి అయిన న్యాయం చేయాల్సిన గురుతరబాధ్యత ఈ న్యాయ,పోలీసు వ్యవస్థల భుజస్కందాలపై ఎంతైనా వుంది. జయ జయహో న్యాయ,పోలీసు వ్యవస్థ. ప్రజలందరికి న్యాయం అనేది అందని ద్రాక్షల కాకుండా అందే ద్రాక్షల మరో పది కాలాల పాటు వర్ధిల్లాలి అత్యంత విజయపథంలో!

బుగ్గన మధుసూదనరెడ్డి 9000369660

పాఠకులు, విశ్లేషకులు, రచయితలు తమ రచనలు క్రింది చిరునామాకు గానీ సూర్య దినపత్రిక ఎడిటోరియల్ మెయిల్ ఐడికి గాని పంపవలసినదిగా మనవి మెయిల్ :
suryaeditpage@gmail.com

SPR publications, Surya Soudha, Plot.No: 185, M.C.H. NO.258/1/185, siddi vinayaka nagar, Ayyappa Society
Opp: Hi-Tech City, Hyderabad - 500 072.

# ఆ ఎన్నికలపై తొందరెందుకు డిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌కు సుప్రీం కోర్టు ప్రశ్న



న్యూఢిల్లీ : ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ స్థాయీ సంఘంలోని చివరి సీటు కోసం ఎన్నిక జరిపించేందుకు అంత తొందర ఎందుకని లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాను దిల్లీ కోర్టు ప్రశ్నించింది. అంతేకాదు.. దీనికి సంబంధించిన ఛైర్మన్ ఎన్నిక నిర్వహణపై కూడా స్టే విధించింది.జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ ఆర్ మహాదేవన్ నేతృత్వంలోని బెంచ్ ఈ కేసుకు సంబంధించి విచారణ చేపట్టింది. నామినేషన్ అంశం కూడా ఉంది.. దానిని పర్యవేక్షించేందుకు అక్కడ మేయర్ ఉన్నారు. మీకు అధికారం ఎక్కడి నుంచి వచ్చింది..? ఇలా జోక్యం చేసుకొంటూ పోతే ప్రజాస్వామ్యం ఏమైపోతుంది. దీనిలో కూడా రాజకీయాలా..? అని న్యాయమూర్తులు లెఫ్టినెంట్ గవర్నర్ను నిలదీశారు. అనంతరం భాజపాకు చెందిన సుందర్ సింగ్ తన్వర్ను కమిటీలోకి ఎన్నుకోవడంపై మేయర్ షెల్లీ ఓబ్రాయ్ దాఖలు చేసిన పిటిషన్పై స్పందన తెలియజేయాలని ఎల్జీని బెంచ్ ఆదేశించింది.మరోవైపు ఆప్ దాఖలు చేసిన పిటిషన్పై బెంచ్ స్పందించింది. ఇప్పట్లో ఎన్నికలు నిర్వహించవద్దు.. రెండు వారాల తర్వాత చూడండి అని సూచించింది.ఎంసీడీ (మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ దిల్లీ) స్థాయీ సంఘంలో ఖాళీగా ఉన్న ఆరోస్థానం కోసం గత నెల నిర్వహించ తలపెట్టిన ఎన్నికలో చివరి క్షణాన లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్జీ) వి.కె.సక్సేనా జోక్యంతో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. అంతకుముందు జరిగిన ఎంసీడీ సమావేశంలో కౌన్సిలర్లను తనిఖీ చేశారన్న కారణంగా తలెత్తిన గందరగోళం మధ్య స్థాయీసంఘం ఎన్నికను మేయర్ షెల్లీ ఓబెరాయ్ అక్టోబరు 5వ తేదీకి వాయిదా వేశారు.



# పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు

## భద్రతా వ్యవహారాలపై మంత్రులతో ప్రధాని భేటీ

- భారత ఆర్థిక వ్యవస్థపై ప్రభావం ఎంత? అని ఆరా
- దేశీయ స్టాక్ మార్కెట్లపై ప్రభావంపైనా చర్చ
- ఒక్క రోజులో లక్షల కోట్ల సంపద ఆవిరి కావటంపై ఆందోళన

న్యూఢిల్లీ : పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం తీవ్రమవుతుందా? దాని ప్రభావం ప్రపంచ దేశాలపై పడుతోందా? భారత ఆర్థిక వ్యవస్థపై ప్రభావం ఎంత? దేశీయ స్టాక్ మార్కెట్లపై ప్రభావం చూవుతోందా? ఒక్క రోజులో లక్షల కోట్ల సంపద ఆవిరయ్యిందా? కేంద్రం ముందు ఉన్న ప్రత్యామ్నాయ మార్గాలేంటి? ఈ సమస్య నుంచి గట్టెక్కడం ఎలా? నిన్న సాయంత్రం ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశమైంది. ప్రస్తుతం పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. ఎగుమతులు, దిగుమతులపై తీవ్ర ప్రభావం చూవుతోందని భావిస్తోంది. దీన్ని నుంచి ఎలా గట్టెక్కాలని చర్చించారు.

రష్యా–ఆఫ్ఘనిస్తాన్ మధ్య వ్యవహరించినట్టుగానే చర్చలు, సంప్రదింపుల ద్వారా శాంతియుతంగా సమస్యను పరిష్కారం లభిస్తుందని పశ్చిమాసియా దేశాలను కోరుతోంది భారత్. కానీ అక్కడ పరిస్థితులు తారాస్థాయికి చేరాయి. ఇరాక్, లెబనాన్–ఇజ్రాయెల్ మధ్య భీకరమైన దాడులు జరుగుతున్నాయి. ఆయా దేశాలకు వెళ్లడం మానుకోవాలని తమ ప్రజలను వివిధ దేశాలు కోరాయంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

యుద్ధం కారణంగా ఆయా దేశాలతో వాణిజ్యం, నేవిగేషన్, ఆ మార్గంలో జరిగే సరకు రవాణా, ముడి చమురు, పెట్రోలియం ఉత్పత్తుల సరఫరా ప్రభావితం పడుతుందని భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ అంచనా వేసింది. ఎర్ర సముద్రం మీదుగా గల్ఫ్ ఆఫ్ ఏడెన్ ద్వారా జరిగే సరకు రవాణాపై తీవ్ర ప్రభావం పడుతుందని భావిస్తోంది.

ఈ మార్గంలో జరిగే సరకు రవాణా నౌకలపై దాడులకు తెగబడుతున్నారు యెమెన్ హౌతీ ఉగ్రవాదులు.

కొద్దిరోజులుగా మరింత తీవ్రమైంది. వారికి మద్దతుగా నిలుస్తున్నాయి లెబనాన్ హెజ్బొల్లా, ఇరాన్ వంటి దేశాలు. ఈ పరిస్థితుల్లో సరకు రవాణా ఖర్చులు పెరిగినట్టు అంచనా వేస్తోంది. వార్ నేపథ్యంలో కార్గో నౌకలపై మరింత ప్రభావితం చూపనుంది.

భారత ఎగుమతుల్లో ఎర్రసముద్రం, సూయజ్ కెనాల్ మీదుగా 50 శాతం వాణిజ్యం (రూ. 18 లక్షల కోట్లు) జరుగుతోంది. అందులో భారత దిగుమతులపై 30 శాతం ప్రభావం (రూ. 17 లక్షల కోట్లు) పడనుంది. దీని ప్రభావం దేశీయ స్టాక్ మార్కెట్లపై పడుతోంది.

పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం ప్రభావం భారత్ స్టాక్ మార్కెట్పై తీవ్ర ప్రభావం చూపింది.. చూవుతోంది. గురువారం ఒక్క రోజు లక్షల కోట్ల సంపద ఆవిరయ్యింది. ఈ వాతావరణం కొనసాగితే ప్రపంచ పరిణామాలతో ప్రభావితం కానుంది భారత ఆర్థిక వ్యవస్థ. అంతేకాదు వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకనున్నాయి. ఆయా దేశాల్లో జరుగుతున్న పరిణామాలను నిశితంగా పరిశీలన చేస్తోంది భారత్.

# రైల్వే ప్రైవేటీకరణ జరగదు

## కేంద్రం దృష్టంతా సేవలపైనే : కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్



నాసిక్: రైల్వేలను ప్రైవేటీకరించే ప్రశ్నేలేదని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పష్టంచేశారు. తమ దృష్టంతా తక్కువ ధరకు ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడంపైనే ఉందన్నారు. మహారాష్ట్రలోని నాసిక్లో జరిగిన రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ రైజింగ్ డే కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రూ.400 కన్నా తక్కువ ఖర్చుతోనే ప్రజలు వెయ్యి కి.మీల వరకు సౌకర్యవంతంగా ప్రయాణించేలా చూడటమే తమ లక్ష్యమని తెలిపారు. వచ్చే ఐదేళ్లలో రైల్వేలో పూర్తిస్థాయిలో మార్పులు వస్తాయన్నారు. వందేభారత్, నమో భారత్ వంటి రైళ్లతో పాటు రైల్వే రక్షణ యంత్రాంగం కవచ్ ఏర్పాటు ద్వారా ఈ మార్పులు తీసుకోస్తామని చెప్పారు. ఇది రైల్వేల పరివర్తన యుగంగా అభివర్ణించారు. రైల్వేలను ప్రైవేటీకరించే ప్రశ్నే లేదని, రైల్వేలు, రక్షణ వ్యవస్థ భారత దేశానికి వెన్నెముకలాంటివన్నారు. ఈ విషయాన్ని అసత్యాలు ప్రచారం చేస్తున్నవారు గుర్తు పెట్టుకోవాలని సూచించారు. రైల్వేల రాజకీయాకరణకు ప్రధాని నరేంద్ర మోదీ చెక్ పెట్టారని, ప్రస్తుతం పనితీరు, భద్రత, సాంకేతికత, అందరికీ తక్కువ ధరలకే సేవలందించడంపైనే దృష్టి కేంద్రీకరించినట్లు తెలిపారు. ఆర్పీఎఫ్ జోనల్ సెంటర్ల అప్గ్రేడ్కు రూ.35కోట్లు కేటాయించామన్న మంత్రి వైష్ణవ్.. సర్వీస్ నిబంధనలు, ప్రమోషన్లు వంటి డిమాండ్లను పరిశీలిస్తున్నామన్నారు. గత పదేళ్లలో 31 వేల కి.మీల మేర కొత్త ట్రాక్లు నిర్మించినట్లు వెల్లడించారు.

# ఎస్సీల ఉపవర్గీకరణపై పునఃసమీక్ష అవసరం లేదు

- ఇప్పటికే ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల ఉపవర్గీకరణ ఆమోదిస్తూ సుప్రీం తీర్పు
- న్యాయసమీక్షకు లోబడే వర్గీకరణ ఉంటుందని స్పష్టీకరణ



డిల్లీ: ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల ఉప వర్గీకరణ ఆమోదిస్తూ ఇచ్చిన తీర్పును సమీక్షించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ ఏడాది ఆగస్టులో ఉప వర్గీకరణకు సర్వోన్నత న్యాయస్థానం ఆమోద ముద్ర వేసిన సంగతి తెలిసిందే. తీర్పును సమీక్షించాలంటూ 10 పిటిషన్లు దాఖలయ్యాయి. వాటిపై నేడు విచారణ జరిగింది. పిటిషన్లు అన్నింటినీ పరిశీలించాం. తీర్పును సమీక్షించాల్సిన పరిస్థితులు కనిపించలేదు. అందుకే వాటిని కొట్టివేస్తున్నాం అని కోర్టు పేర్కొంది.నేపథ్యం ఇదీ.. ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎస్సీ రిజర్వేషన్లలో 50 శాతాన్ని వాల్మీకి, మజహబీ సిక్కు సామాజికవర్గాలకు తొలి ప్రాధాన్యంగా ప్రత్యేకిస్తూ 2006లో పంజాబ్ ప్రభుత్వం చట్టం తీసుకొచ్చింది. అలాంటి ఉప వర్గీకరణ చెల్లదంటూ పంజాబ్–హరియాణా హైకోర్టు 2010లో తీర్పు వెలువరించింది. ఈవీ చిన్నయ్య వర్సెస్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేసులో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం 2004లో వెలువరించిన తీర్పును ఉల్లంఘించేలా పంజాబ్ చట్టం ఉందని హైకోర్టు అభిప్రాయపడింది. దానిని సవాల్ చేస్తూ పంజాబ్ ప్రభుత్వం అప్పట్లో సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అనంతరం దీనిపై మరో 22 పిటిషన్లు దాఖలయ్యాయి. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ కూడా ఇందులో ఒక పిటిషనర్గా ఉన్నారు. పిటిషన్లను విచారించిన అయిదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం.. 2020లో దీనిని ఏడుగురు సభ్యుల విస్తృత ధర్మాసనానికి బదిలీ చేసింది. సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం దీని విచారణను చేపట్టి.. 6:1 ఆధిక్యంతో తీర్పు వెలువరించింది. ఎస్సీల రిజర్వేషన్లను వర్గీకరించి అదే వర్గంలో అత్యంత వెనుకబడిన వర్గాలకు ప్రత్యేక కోటాలు కల్పించడానికి పచ్చజెండా ఊపింది. అయితే న్యాయసమీక్షకు లోబడే ఈ వర్గీకరణ ఉంటుందని స్పష్టంచేసింది. నిర్దిష్ట గణాంకాల ఆధారంగా, అత్యంత వెనుకబడిన వర్గాలకు న్యాయం చేసేందుకే దాన్ని ఉపయోగించాలని స్పష్టంచేసింది. వెనుకబాటుతనం పేరుతో 100% రిజర్వేషన్లను ఒకే ఉప వర్గానికి (సబ్ గ్రూప్నకు) ధారాదత్తం చేయడానికి వీల్లేదని తేల్చిచెప్పింది. రాష్ట్రాలు రాజకీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని నిర్ణయం తీసుకుంటే వాటిని న్యాయస్థానాలు సమీక్షించవచ్చని పేర్కొంది. 15(4), 16(4) అధికరణాల కిందికి వచ్చే అన్ని వర్గాలకూ ఆ ప్రయోజనాన్ని కల్పించాలని చెప్పింది.

# తిరుమల లడ్డూ వ్యవహారంపై విచారణకు ప్రత్యేక బృందం



- సిబిఐ డైరెక్టర్ నేతృత్వంలో 5గురు సభ్యుల సిట్
- అభ్యంతరం వ్యక్తం చేసిన పిటీషనర్ తరపు న్యాయవాది
- సిట్ సభ్యులపై ఎలాంటి సందేహాలు లేవన్న రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది రోహత్గి
- ఈ విషయంలో రాజకీయ డ్రామాలు వద్దని ఇరుపక్షాలకు సుప్రీం సూచనలు
- తనపై విజిలెన్స్ విచారణ అంశాన్ని దాచిపెట్టిన సుబ్బారెడ్డిపై ఆగ్రహం
- కొత్తసిట్ విచారణను స్వాగతించిన ఏపి సిఎం చంద్ర బాబు

న్యూఢిల్లీ : తిరుమల లడ్డూ వివాదంలో సుప్రీంకోర్టులో స్వతంత్ర దర్యాప్తునకు ఆదేశించింది. ఐదుగురు సభ్యులతో కూడిన ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తు చేయాలని సూచించింది. ఇద్దరు ప్రస్తుతం వేసిన సిట్ నుంచి సభ్యులుగా ఉంటారు. ఇంకో ఇద్దరు సిబీఐ నుంచి తీసుకొస్తారు. మరో వ్యక్తి ఎఫ్ఎస్ఎస్ఐఏ నుంచి ఉండే అవకాశం ఉంది. ఫుడ్ సెఫ్టీ ఆఫీసర్ నాయకత్వం వహించబోతున్నారు. మొత్తం దర్యాప్తును సిబీఐ డెరెక్టర్ ప్రవీణ్ సూద్ పర్యవేక్షించబోతున్నారు. తిరుమల వివాదంపై పదిన్నరకు సుప్రీంకోర్టులో ప్రారంభమైన విచారణలో కేంద్రం తరవున తుషార్ మెహతా వాదనలు వినిపించారు. ప్రస్తుతం లడ్డూ వివాదంలో ఏపీ ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసిందని అది కొనసాగితే మంచిదన్నారు. ఆ సిట్ సభ్యులపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని వారిపై నమ్మకం ఉందని పేర్కొన్నారుఅయితే కేంద్ర అధికారి పర్యవేక్షణ ఏర్పాటు చేస్తే మంచిదని తుషార్ మెహతా అభిప్రాయపడ్డారు. కేంద్రం తరవున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వివరణ ఇచ్చారు.. దీనిపై పిటిషనర్ తరవున వాదనలు వినిపించిన కపిల్ సిబాల్ అభ్యంతరం వ్యక్తం చేశారు. లడ్డూ కల్తీపై సుప్రీం కోర్టులో ప్రారంభమైన విచారణలో.. టీటీడీ తరవున సిద్ధార్థ్ లూథ్రా వాదనలు వినిపించారు. ప్రభుత్వం తరవున ముకుల్ రోహత్గి వాదనలు వినిపించారు. సిట్ సభ్యులపై మాకు ఎలాంటి సందేహాలు లేవని రోహత్గి అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఉన్నత న్యాయస్థానం కీలక నిర్ణయం తీసుకుంది. లడ్డూ కల్తీపై కేంద్ర ప్రభుత్వ అధికారి పర్యవేక్షణలో సిట్ దర్యాప్తు జరగాలని జస్టిస్ గవాయ్ అన్నారు. స్వతంత్ర దర్యాప్తు ఉంటేనే రాజకీయ జోక్యం ఉండదు జస్టిస్ గవాయ్ తెలిపారు. స్వతంత్ర దర్యాప్తుపై ఎలాంటి అభ్యంతరం లేదని కపిల్ సిబల్ పేర్కొన్నారు. దీనిపై స్వతంత్ర దర్యాప్తు అవసరమని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వంలో కీలకమైన వ్యక్తులు ఇలా మాట్లాడుతుంటే సిట్ దర్యాప్తుపై ప్రభావం పడుతుందని అందుకే సిట్పై తమకు పూర్తిగా నమ్మకం లేదని అన్నారు.

ఈ లడ్డు కల్తీ వివాదంపై దర్యాప్తు చేసేందుకు సుప్రీంకోర్టు స్వతంత్ర దర్యాప్తు కోసం ఐదుగురు సభ్యులతో కూడిన కొత్త సిట్ను ఏర్పాటు చేసింది. అంటే రాష్ట్ర సిట్ను కోర్టు రద్దు చేసిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. . ఇప్పుడు ఈ కేసు దర్యాప్తు చేస్తున్న కొత్త సిట్లో ఇద్దరు సీబీఐ అధికారులు ఉంటారు. ఇది కాకుండా, బృందంలో రాష్ట్ర పోలీసు నుండి ఇద్దరు వ్యక్తులు, ఎఫ్ఎస్ఎఐ నుండి ఒక అధికారి ఉంటారు. ఈ క్రమంలోనే ఈ కేసును నిష్పక్షపాతంగా విచారించాలని కోర్టు స్పష్టం చేసింది. సొలిసిటర్ జనరల్ పాత సిట్పై విశ్వాసం వ్యక్తం చేసినప్పటికీ, కోర్టు కొత్త సిట్ను ఏర్పాటు చేసింది. తిరుమల లడ్డూ వ్యవహారంలో రాజకీయ డ్రామాలు వద్దని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. విచారణ సందర్భంగా జస్టిస్ గవాయ్ మాట్లాడుతూ.. ఇది రాజకీయ డ్రామాగా మారకూడదని, స్వతంత్ర సంస్థ ఉంటే ఆత్మవిశ్వాసం ఉంటుంది.

ఇదిలా ఉండగా, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని గత ప్రభుత్వం హయాంలో తిరుపతిలో లడ్డూల తయారీలో జంతువుల కొవ్వును ఉపయోగించారని పేర్కొన్నారు. చంద్రబాబు చేసిన ఈ ప్రకటన తర్వాత రాజకీయంగా పెద్ద దుమారం రేగింది. ఈ వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరింది. సుప్రీంకోర్టులో మూడు కంటే ఎక్కువ పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్ను దాఖలు చేసిన వారిలో సుబ్రమణ్యస్వామి, రాజ్యసభ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, చరిత్రకారుడు విక్రమ్ సంపత్లు ఉన్నారు. వీటిపై సెప్టెంబర్ 30న విచారణ జరి పారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఈ విషయంలో దేవుడిని కనీసం రాజకీయాలకు దూరంగా ఉంచాలని సుప్రీం కోర్టు పేర్కొంది.

వైకాపా ఎంపీ వైవీ సుబ్బారెడ్డిపై ఆగ్రహం : పిటిషనర్లలో ఒకరైన వైకాపా ఎంపీ, తితిదే మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తనపై విజిలెన్స్ విచారణ అంశాన్ని దాచిపెట్టారు. విజిలెన్స్ విభాగం నుంచి వచ్చిన నోటీసులు.. దానిపై హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయాన్ని సుప్రీంకోర్టుకు ఆయన చెప్పలేదు. రాష్ట్ర ప్రభుత్వం తరఫు న్యాయవాదులు ఈ అంశాన్ని సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వైవీ సుబ్బారెడ్డి తీరుపై అత్యున్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. భక్తుల మనోభావాలతో కూడిన వ్యవహారాన్ని రాజకీయంగా వాడుకోవద్దని సూచించింది. కోర్టులను రాజకీయ వేదికలుగా వినియోగించవద్దని వ్యాఖ్యానించింది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి పర్యవేక్షణలో కమిటీ ఏర్పాటుకు ధర్మాసనం విముఖత వ్యక్తం చేసింది. ఈ వివాదంపై సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక విచారణ జరిపించాలని కోరుతూ.. మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామి, వైకాపా ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, విక్రమ్సంపత్ అనే భక్తుడు, సుదర్శన్ టీవీ ఎడిటర్ సురేష్ ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేసిన విషయం తెలిసిందే.

స్వాగతించిన బాబు : తిరుపతి లడ్డూ కల్తీ అంశంపై సుప్రీం కోర్టు ఆదేశాలను తాను స్వాగతిస్తున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు. సీబీఐ, ఏపీ పోలీస్, ఎఫ్ఎస్ఎస్ ఏఐ అధికారులతో సిట్ ఏర్పాటు చేసి తిరుపతి లడ్డూ కల్తీపై విచారణ చేయాలని ఈ రోజు సుప్రీం కోర్టు ఆదేశాలు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ ఆదేశాలను తాను స్వాగతిస్తున్నానని ఎక్స్ ఖాతాలో పోస్టు చేసిన చంద్రబాబు.. సత్యమేవ జయతే, ఓం నమో వేంకటేశాయ! అంటూ ముగించారు.

# రూ.5వేల కోట్ల డ్రగ్స్ రాకెట్ వెనుక కాంగ్రెస్

## అమిత్ షా తీవ్ర విమర్శలు



డిల్లీ :డిల్లీలో వేలాది కోట్ల రూపాయల విలువైన డ్రగ్స్ రాకెట్ గుట్టు రట్టయిన సంగతి తెలిసిందే. ఈ రాకెట్లో తుషార్ గోయల్ పేరు ప్రముఖంగా వినిపించింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్పై భాజపా అగ్రనేత అమిత్ షా తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ డ్రగ్స్ వ్యవహారంలో హస్తం పార్టీ నేత ప్రమేయం ఉండటం సిగ్గుచేటని తీవ్రంగా మండిపడ్డారు.ఒకపక్క డ్రగ్స్ ఫ్రీ ఇండియా కోసం మోదీ ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. ఉత్తర భారత్లో పట్టుబడిన డ్రగ్స్లో కాంగ్రెస్ నేత ప్రమేయం ఉండటం సిగ్గుచేటు. ప్రమాదకరం. కాంగ్రెస్ పాలనలో పంజాబ్, హరియాణా, మొత్తం ఉత్తర భారతంలోని యువత ఈ మాదకద్రవ్యాల వల్ల ఎన్ని కష్టాలు ఎదుర్కొన్నారో చూశాం. ఒకవైపు మోదీ.. యువతను క్రీడలు, ఆవిష్కరణలు, విద్యవైపు ప్రోత్సహిస్తుంటే, వారిని కాంగ్రెస్ డ్రగ్స్ ప్రపంచం వైపు మళ్లించాలని అనుకుంటోంది. డ్రగ్ డీలర్ల రాజకీయ పలుకుబడితో సంబంధం లేకుండా ఆ నెట్వర్క్ ఎక్కడున్నా మోదీ ప్రభుత్వం పెకిలించి వేస్తుంది అని ఎక్స్ వేదికగా అమిత్ షా స్పందించారు. మరోపక్క కాంగ్రెస్ మాత్రం అతడితో తమకు ఎలాంటి సంబంధం లేదని, రెండేళ్ల క్రితమే పార్టీ నుంచి బహిష్కరించామని భాజపా ఆరోపణలను తోసివుచ్చింది.

# సరిహద్దుల్లో చైనా నిర్మాణాలు వేగవంతం



- వాయుసేన చీఫ్ అమర్ ప్రీత్ సింగ్
- అదే స్థాయిలో మనం కూడా సరిహద్దు సౌకర్యాలను అప్గ్రేడ్ చేస్తున్నాం
- 2047 నాటికి ఆయుధాలను పూర్తిగా దేశీయంగా తయారు చేసుకోవాల్సిన అవసరం ఉంది

న్యూఢిల్లీ : వాస్తవాధీన రేఖ వెంబడి చైనా శరవేగంగా మౌలిక వసతులు, నిర్మాణాలు చేపడుతోందని వాయుసేన చీఫ్, ఎయిర్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ శుక్రవారం వెల్లడించారు. భారత్ కూడా అదే స్థాయిలో వేగంగా సరిహద్దుల వద్ద సౌకర్యాలను అప్గ్రేడ్ చేస్తోందన్నారు. దళాల వద్ద దేశీయ తయారీ ఆయుధ వ్యవస్థలు ఉండటం చాలా ముఖ్యమని సింగ్ అభిప్రాయపడ్డారు. 2047 నాటికి భారత దళాల వద్ద పూర్తిగా దేశీయ ఆయుధాలే ఉండాలని ఎయిర్ మార్షల్ సింగ్ సూచించారు. ఎయిర్ ఫోర్స్డే రానున్న నేపథ్యంలో ఆయన ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించి పలు అంశాలను వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న యుద్ధాలను దృష్టిలోపెట్టుకొని.. భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కోవాలంటే దేశీయ ఆయుధాలు ఉండటం ముఖ్యమన్నారు. ఇప్పటికే రష్యా నుంచి మూడు యూనిట్ల ఎస్–400 వ్యవస్థలు దిగుమతి అయ్యాయని.. వచ్చే ఏడాది మిగిలినవాటిని కూడా అందజేస్తామని మాస్కో చెప్పినట్లు ఏపీ సింగ్ వెల్లడించారు. ఇక 114 మల్టీరోల్ ఫైటర్ జెట్ల కొనుగోళ్లపై స్పందిస్తూ.. మనం ఏ మార్గంలో కొనాలన్నది నిర్ణయించుకోవాల్సి ఉంది. ప్రస్తుతం మనం 114 విమానాల కోసం డీఏపీ–2020 అంశాన్ని చూస్తున్నాం. కానీ, వాటిని దేశీయంగా తయారుచేస్తే బాగుంటుందని భావిస్తున్నాం. వాయుసేన 2047 నాటికి పూర్తిగా దేశీయ ఆయుధాలతోనే ఉండాలి. ఉపరితలం నుంచి గగనతలంలోకి ప్రయోగించే దీర్ఘశ్రేణి క్షిపణి కుష వంటి వాటిని ప్రవేశపెట్టే అంశాన్ని పరిశీలిస్తున్నాం. మనవద్ద పెద్దసంఖ్యలో ఆకాశ్ క్షిపణులు ఉన్నాయి. ఇప్పుడు ఆకాశ్ ఎన్జీ కోసం చూస్తున్నాం. మీరు బయటి వాటికోసం ఆధారపడితే.. ఎప్పుడైనా అవి ఇబ్బంది పెట్టొచ్చు. యుద్ధం చేయాలంటే.. కనీసం 200 నుంచి 300 క్షిపణులు ప్రయోగించాల్సి ఉంటుంది. అందుకే వాటిని దేశీయగా తయారుచేసుకోవడం ఉత్తమం.

ఇప్పటికే తేజస్లో జాప్యం జరిగిన విషయం మీకు తెలుసు. మనం ఏటా 24 విమానాలను ఉత్పత్తి చేయగలిగితే.. దానిని నివారించవచ్చు. మనం ప్రైవేటు సంస్థల వైపు మళ్లాల్సిన అవసరం ఉంది. హెచ్ఏఎల్కు కూడా పరిమితులున్నాయి. ఉత్పత్తిలో సవాళ్లను ఎదుర్కోవాలంటే ప్రైవేటు రంగం అవసరం చాలా ఉంది అని సింగ్ వెల్లడించారు.

ఇప్పటివరకు తూర్పు లద్దాఖ్లో పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వాయుసేన చీఫ్ పేర్కొన్నారు. మనకు నయోమాలో సరికొత్త ఎయిర్ ఫీల్డు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే మనకు ఉన్న సామర్థ్యాలను బలోపేతం చేసుకొన్నాం. సెంట్రల్ సెక్టార్లో ఎయిర్ ఫీల్డ్లను అప్గ్రేడ్ చేస్తున్నామన్నారు.

# ఛత్తీస్‌గడ్‌లో ఎన్కౌంటర్..

## 36 మంది మావోయిస్టుల మృతి



దంతెవాడ: ఛత్తీస్గఢ్ దండకారణ్యంలో మళ్లీ తుపాకుల మోత మోగింది. నారాయణ్పూర్– దంతెవాడ సరిహద్దుల్లో శుక్రవారం ఎన్కౌంటర్ చోటుచేసుకుంది. ఈ ఎదురుకాల్పుల్లో 36 మంది మావోయిస్టులు మరణించినట్లు పోలీసులు వెల్లడించారు.బస్తర్ రేంజ్లోని దంతెవాడ, నారాయణ్పూర్ జిల్లాల సరిహద్దుల్లో ఉండే అబూజ్మడ్ దండకారణ్యంలో మావోయిస్టులు నక్కినట్లు సమాచారం అందింది. దీంతో భద్రతా సిబ్బంది ఈ ప్రాంతంలో ప్రత్యేక ఆపరేషన్ చేపట్టారు. ఈ క్రమంలోనే మధ్యాహ్నం సమయంలో భద్రతా దళాలను చూసిన మావోయిస్టులు వారిపై కాల్పులకు దిగారు. దీంతో భద్రతా సిబ్బంది ఎదురుకాల్పులు జరిపారు.ఘటనాస్థలంలో 36 మంది మావోయిస్టుల మృతదేహాలను గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. అంతేగాక భారీ ఎత్తున పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఎన్కౌంటర్ కొనసాగుతోంది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# కాల్పులు జరిగిన చోటే మళ్లీ ట్రంప్ సభ

## అతిథిగా ఎలాన్ మస్క్ హాజరయ్యే అవకాశం



వాషింగ్టన్ : వచ్చే నెల అమెరికాలో అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలో జులైలో పెన్సిల్వేనియాలోని ప్రచార సభలో అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్పై కాల్పులు జరిగిన విషయం తెలిసిందే. తాజాగా అదే ప్రాంతంలో ట్రంప్ మరో సభలో పాల్గొనేందుకు సిద్ధమయ్యారు. ఇక, ఈ సభకు తాను హాజరవుతానని ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ పేర్కొన్నారు. ఐ యామ్ కమింగ్ బ్యాక్ టు బట్లర్ అంటూ డొనాల్డ్ ట్రంప్ తన ఎక్స్ ఖాతాలో ఓ పోస్ట్ చేశారు. ఈ పోస్టును స్పేస్ ఎక్స్ సీఈవో ఎలాన్ మస్క్ రీ పోస్ట్ చేస్తూ.. నేను మీకు మద్దతుగా అక్కడ ఉంటాను అని రాసుకొచ్చారు.

ఇక, గత జులైలో అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పెన్సిల్వేనియాలోని బట్లర్లో ప్రచార సభ నిర్వహించారు. ఆ సమయంలో థామస్ మాథ్యూ క్రూక్స్ అనే యువకుడు ట్రంప్పై కాల్పులు జరిపాడు. ఆ కాల్పుల్లో ట్రంప్ కుడి చెవి పైభాగం నుంచి తూటా దూసుకెళ్లింది. వేగంగా స్పందించిన అమెరికా సీక్రెట్ సర్వీస్ సిబ్బంది ఆయన్ను కాపాడారు. తనపై కాల్పులు జరిగిన చోటే ర్యాలీ నిర్వహిస్తానని గతంలో ట్రంప్ ప్రకటించారు. ఇక, ఇటీవల ఫ్లోరిడాలోని వెస్ట్ పామ్బీచ్లో ట్రంప్ గోల్ఫ్ ఆడుతుండగా ట్రంప్పై హత్యాయత్నం చోటుచేసుకుంది. ఫెన్సింగ్ నుంచి నిందితుడు తుపాకీతో రావడాన్ని గమనించి భద్రతా బలగాలు కాల్పులు జరిపారు. ఆ వెంటనే నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

# ఆస్పత్రి నుంచి రజనీ కాంత్ డిశ్చార్జ్

చెన్నై: ప్రముఖ తమిళ నటుడు రజనీకాంత్ ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. గురువారం ఉదయం 11 గంటలకు ఆయన చెన్నైలోని అపోలో ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. సెప్టెంబర్ 30వ తేదీన తలైవర్ రజనీకాంత్ తీవ్ర కడుపునొప్పితో ఆస్పత్రిలో చేరారు. గుండెకు అనుసంధానం అయి ఉండే ప్రధాన రక్త నాళం బృహద్ధమనిలో సమస్య తలెత్తినట్లు తెలిసింది. ఈ సమస్య కోసం ఆయన గుండెలో ఒక స్టంట్ వేశారు. అనంతరం ఆయన కండీషన్ స్టేబుల్ అయింది. ప్రస్తుతం రజనీకాంత్ రెండు సినిమాలు చేస్తున్నారు. అందులో 'జై భీమ్' డైరెక్టర్ టీఈ జ్ఞానవేల్ రాజా దర్శకత్వం వహించిన 'వేట్టయన్' సినిమా మొదటిది. అక్టోబర్ 10వ తేదీన దసరా కానుకగా తెలుగు, తమిళ భాషల్లో విడుదల కానుంది. తెలుగులో వేట్టయన్: ది హంటర్ పేరుతో ఈ సినిమా రిలీజ్ కానుంది.



# బాల్క సుమన్ సంచలన కామెంట్స్

తెలంగాణ బ్యూరో[ప్రతినిధిః తెలంగాణలో ఉపఎన్నికల అంశం తరుచూ వినిపిస్తోంది. కొన్ని నియోజకవర్గాలకు ఉపఎన్నికలు ఖాయమని బీఆర్ఎస్ నేతలు పదే పదే చెబుతున్నారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి జంప్ అయిన ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో బైపోల్స్ జరుగుతాయనేది గులాబీ నేతల మాట. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు అనర్హతకు గురై ఆయా నియోజకవర్గాల్లో ఉపఎన్నికలు రావడం ఖాయమని అంటున్నారు. అనర్హత కారణంగా ఉప ఎన్నికలు జరిగే నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ గెలుపు తథ్యమని ఆ పార్టీ నేతలు స్పష్టం చేస్తున్నారు. తాజాగా చెన్నూరు నియోజకవర్గానికి సంబంధించి బీఆర్ఎస్ నేత బాల్క సుమన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. చెన్నూరు నియోజకవర్గానికి ఉప ఎన్నికలు పక్కా అని బాల్క సుమన్ స్పష్టం చేశారు. సూటుకేస్ కంపెనీలకు డబ్బులు పంపిన వ్యవహారంలో చెన్నూరు ఎమ్మెల్యే జైలుకు పోవటం ఖాయమన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఎమ్మెల్యే వివేక్‌ను కాపాడే ప్రయత్నం చేస్తున్నారని.. రేవంత్ రెడ్డి కాదు కదా.. భగవంతుడు కూడా వివేక్‌ను కాపాడలేరన్నారు. ఈడీ కేసు జరుగుతుంటే.. తెలంగాణ పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. వివేక్ కేసు వ్యవహారంలో సుప్రీంకోర్టు వరకు వెళ్తామని వెల్లడించారు. వివేక్.. అక్రమంగా వందల కోట్ల రూపాయలను ఎన్నికల్లో ఖర్చు చేశారని ఆరోపించారు. తెలంగాణ పోలీసులకు స్వామి భక్తి ఎక్కువైందని విమర్శించారు. పోలీసులు రేవంత్ రెడ్డి అడుగులకు మడుగులు వత్తుతున్నారని మండిపడ్డారు. అత్యుత్సాహం ప్రదర్శిస్తోన్న పోలీసులు భవిష్యత్తులో బలికాక తప్పదని హెచ్చరించారు. ఈడీ విచారణ జరుగుతోన్న కేసును పోలీసులు క్లోజ్ చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఏపీ తాజా పరిణామాలను తెలంగాణ పోలీసులు గుర్తుంచుకోవాలని తెలిపారు. జగన్ హయాంలో అత్యుత్సాహం ప్రదర్శించిన ఐపీఎస్‌ల పరిస్థితి ఏమైంది.. తప్పు చేసిన పోలీస్ అధికారులను చంద్రబాబు ఇంటికి పంపారన్నారు.

# రుణమాఫీ చేసి తీరుతాం

● ఏ ఒక్క రైతు అధైర్య పడొద్దు : మంత్రి తుమ్మల

తెలంగాణ బ్యూరో[ప్రతినిధి: రైతు రుణమాఫీపై బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలపై వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పందించారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. రుణమాఫీ గురించి పట్టించుకోని పార్టీలు ప్రస్తుతం మాట్లాడుతున్నాయని మండిపడ్డారు. రైతన్నల ఆదరణతో కాంగ్రెస్ ప్రభుత్వం ) అధికారంలోకి వచ్చిందని చెప్పుకొచ్చారు. కష్టమైనా.. ఒక పథకాన్ని ఆపైన సరే రుణమాఫీ, రైతు భరోసా, రైతు బీమాను అమలు చేస్తామని మరోసారి స్పష్టంచేశారు. అన్ని సబ్సిడీ పథకాలను మళ్లీ పునరుద్ధరిస్తామని వెల్లడించారు. కచ్చితంగా రెండు లక్షల వరకు రుణమాఫీ చేసి తీరుతామని తేల్చిచెప్పారు. ఏ ఒక్క రైతు అధైర్య పడవద్దని భరోసా ఇచ్చారు. భారతదేశంలో ఎక్కువ పంటలను సాగు చేసే ఏకైక రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమన్నారు. మన రాష్ట్రంలో ఒక కోటి 45 లక్షల టన్నుల వరి ధాన్యం పండిస్తున్నామని చెప్పారు. ఏ ఒక్క రైతు ఇబ్బంది పడకుండా సీఎం రేవంత్ రెడ్డి కష్టపడుతున్నారని తెలిపారు. ఈ సీజన్లో రైతులు ఎక్కువగా సన్నధాన్యాన్ని పండించారన్నారు. 500 రూపాయలు అదనంగా ఇచ్చి సన్నధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. కాగా.. రైతు రుణమాఫీకి సంబంధించి మంత్రి తుమ్మలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు గుప్పించిన విషయం తెలిసిందే. 20 లక్షల మందికి రుణమాఫీ కానే కాలేదన్న వ్యవసాయ మంత్రి ప్రకటనతో సీఎం బండారం మరోసారి బట్టబయలైందన్నారు. వందశాతం రుణమాఫీ పూర్తిచేశామని విర్రవీగిన ముఖ్యమంత్రివన్నీ డొల్లమాటలేనని ఇంకోసారి తేలిపోయిందని విమర్శించారు. ఓవైపు డిసెంబర్ 9న ఏకకాలంలో చేస్తామని దగా చేసి.. మరోవైపు 10 నెలలైనా 20 లక్షల మందికి మోసం చేశారన్నారు. 2 లక్షల రుణమాఫీ పూర్తయిపోయిందన్న సన్నాసి మాటలు నయవంచన కాక మరేంటి అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారిక లెక్కల ప్రకారమే 20 లక్షల అన్నదాతలకు అన్యాయం జరిగితే అనధికారికంగా రుణమాఫీ కాని రైతులందరో అని అన్నారు. చేస్తామన్న రుణమాఫీ ఇప్పటికీ పూర్తి చేయలేదని.. ఇవ్వాల్సిన రైతుబంధు సీజన్ ముగిసినా ఇయ్యలేదన్నారు. రాబంధుల ప్రభుత్వం ఉండి రైతులకు ఏం లాభం రేవంత్ చేతకానితనం.. అన్నదాతలకు కోలుకోలేని శాపం అంటూ కేటీఆర్ ఎక్స్ వేదికగా పోస్టు చేశారు.



# సోయా పంటకు బోనస్ ఇచ్చి ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

● ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి



తెలంగాణ బ్యూరో[ప్రతినిధి: ఎకరానికి 6 కిలోల సీలింగ్ లేకుండా పండిన మొత్తం సోయా పంటను ఎంఎస్పీ ధరకు అదనంగా రూ.500 బోనస్ ఇచ్చి పంటను మొత్తం ప్రభుత్వమే కొనుగోలు చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లాలో మంత్రుల రివ్యూ మీటింగ్ ఉన్న విషయాన్ని శుక్రవారమే తెలపడంతో మీటింగ్ వెళ్లలేని పరిస్థితి కల్పించారన్నారు. దీంతో సోయా కొనుగోలు పై ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలి అనుకున్న డిమాండ్ లను మీడియా ద్వారా ఎమ్మెల్యే తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వమే సోయా పంట కొనుగోలు సెంటర్లను ఏర్పాటు చేయాలన్న తన డిమాండ్‌ను గుర్తు చేశారు. తదనంతరం ప్రభుత్వం మొక్కుబడిగా మాత్రమే కొనుగోలు సెంటర్లను ఏర్పాటు చేసిందని విమర్శించారు. ఎకరానికి 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి వస్తే ప్రభుత్వం ఎకరానికి 6 క్వింటాళ్ల మట్టుకు మాత్రమే తీసుకుంటామంటుంది. మిగతా పంటను అమ్ముకోవాలంటే రైతులు మళ్లీ ప్రైవేట్ వ్యాపారుల చుట్టూ తిరిగి క్వింటాలుకు 4,300 రూపాయలకే అమ్ముకోవాలా? అని ప్రశ్నించారు. ఉమ్మడి జిల్లాలో 1,30,000 ఎకరాలలో సోయా పంట పండుతుంది (కామారెడ్డి 90 వేలు,నిజమాబాద్ 40 వేలు ఎకరాలు) మీడియా ద్వారా ప్రభుత్వానికి, జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రులకు డిమాండ్ చేస్తున్న ..ఎకరానికి 6 కిలోల సీలింగ్ లేకుండా పండిన మొత్తం సోయాపంటను కొనుగోలు చేయాలి. కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిన విధంగా ఎమ్మెస్పి ధర కంటే అదనంగా 500 బోనస్ ఇచ్చి క్వింటాలుకు 5,392 రూపాయలు చెల్లించాలి. లేదంటే రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ తరపున పోరాటం చేస్తామని హెచ్చరించారు.



# రుణమాఫీ కాలేదని చెప్పిన వ్యవసాయ మంత్రి

● మంత్రి ప్రకటనతో సీఎం బండారం మరోసారి బట్టబయలు ● వందశాతం రుణమాఫీ పూర్తిచేశామని విర్రవీగిన ముఖ్యమంత్రివన్నీ డొల్లమాటలే ● రూ.2 లక్షల రుణమాఫీ పూర్తయిపోయిందన్న సన్నాసి మాటలు నయవంచన కాక మరేంటి ● మాజీ మంత్రి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

తెలంగాణ బ్యూరో[ప్రతినిధిః సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ట్విటర్ వేదికగా సంచలన వ్యాఖ్యలు చేశారు. 20 లక్షల మందికి రుణమాఫీ అందలేదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించడంతో సీఎం బండారం మరోసారి బట్టబయలైందని కేటీఆర్ అన్నారు. 100% రుణమాఫీ పూర్తి చేశామన్న ముఖ్యమంత్రి డొల్లమాటలే అని మరోసారి తేలిపోయిందన్నారు. 2 లక్షల రుణమాఫీ పూర్తి చేశామన్న సన్నాసి మాటలు మోసం తప్ప మరొకటి కాదా అని ప్రశ్నించారు. రాబందు ప్రభుత్వం ఉంటే రైతులకు ఎలాంటి ప్రయోజనం లేదని, రేవంత్ అసమర్థత ధాన్యం దాతలకు కోలుకోలేని శాపమని కేటీఆర్ ట్వీట్ చేశారు. ఒకవైపు డిసెంబర్ 9న ఏకకాలంలో చేస్తామని మాయమాటలు చెప్పి.. మరోవైపు 10 నెలల తర్వాత కూడా 20 లక్షల మందిని మోసం చేశారని మండిపడ్డారు. 2 లక్షల రుణమాఫీ పూర్తయిపోయిందన్న సన్నాసి మాటలు నయవంచన కాక మరేంటి ?? అని ప్రశ్నించారు. అధికారిక లెక్కల ప్రకారమే.. 20 లక్షల అన్నదాతలకు అన్యాయం జరిగితే అనధికారికంగా రుణమాఫీ కాని రైతులందరో ?? అని ట్విటర్ వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. చేస్తామన్న రుణమాఫీ ఇప్పటికీ పూర్తి చేయలేదు.. ఇవ్వాల్సిన రైతుబంధు సీజన్ ముగిసినా ఇయ్యలేదన్నారు. రాబందుల ప్రభుత్వం ఉండి రైతులకు ఏం లాభం రేవంత్ చేతకానితనం.. అన్నదాతలకు కోలుకోని శాపం అని ట్విటర్ వేదికగా సీఎం పై మండిపడ్డారు.

**దొడ్డు వడ్లకు రూ. 500 బోనస్ వెంటనే చెల్లించాలి:** రైతులు పండించిన దొడ్డు వడ్లకు రూ. 500 బోనస్ వెంటనే చెల్లించాలని మాజీమంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. శుక్రవారం జరిగిన సమావేశంలో ప్రభుత్వం కేవలం సన్న వడ్లకే 500 రూపాయలు బోనస్ అని ప్రకటించడం పైన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలి అన్నారు. మూసీ ప్రక్షాళన కోసం రూ. లక్షా 50 వేల కోట్లు అంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు రైతు భరోసాకి, దొడ్డు వడ్ల బోనస్ కు పైసలు లేవా అని ప్రశ్నించారు. లక్షలాది మంది రైతులకు పంగనామాలు పెడతామంటే ఊరుకోం.. వానాకాలం సీజన్ పూర్తి అవుతున్న రైతు భరోసా ఊసేలేదు అని కేటీఆర్ మండిపడ్డారు.

# నా ఫామ్‌హౌస్ బఫర్ జోన్‌లో లేదు

● మాజీ మంత్రి మహేందర్ రెడ్డి



తెలంగాణ బ్యూరో[ప్రతినిధిః ఫామ్‌హౌస్ కూల్చాలని మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు, సబితా ఇంద్రారెడ్డి చెబుతున్నారని.. తన ఫామ్ హౌస్ రూల్‌కు వ్యతిరేకంగా ఉందంటే తానే కూల్చి వేస్తానని మాజీమంత్రి పట్నం మహేందర్ రెడ్డి అన్నా రు. తానే బాధ్యత తీసుకుని కూల్చుతానని స్పష్టం చేశా రు. శుక్రవారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలపై పట్నం మహేందర్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ... రూల్ ప్రకారమే ఉందని అధికారులు ఒక రిపోర్ట్ ఇచ్చారని గుర్తుచేశారు. ఇల్లీగల్ అంటే కేటీఆర్ రావాలని.. తానే వచ్చి కూల్చుతానని సవాల్ విసిరారు. తన ఫామ్ హౌస్ లీగల్‌గా ఉందని అన్నారు. అక్కడ మామిడి తోట వ్యవసాయం ఉందని తెలిపారు. అధికారులను అడిగే తానే కట్టానని పట్నం మహేందర్ రెడ్డి తేల్చిచెప్పారు. తన ఫామ్ హౌస్ బఫర్ జోన్‌లో లేదు ఎఫ్‌టియల్‌లో లేదని అన్నారు. అధికారులు వచ్చి లీగల్‌గా ఉందని చెప్పారని అన్నారు. మాజీ మంత్రులు కేటీఆర్, సబితా, హరీష్ రావు ఎవరి ఫామ్ హౌస్ ఇల్లీగల్‌గా ఉన్నా కూల్చాల్సిందేనని చెప్పారు. 111జీఓ రాష్ట్రం పరిధిలో లేదని అన్నారు. అది సుప్రీంకోర్టు పరిధిలో ఉందని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం 111జీవో పై ముందుకు వెళ్లాలని మహేందర్ రెడ్డి వెల్లడించారు.

## బ్లాక్ మెయిల్ రాజకీయాలకు పాల్పడుతున్న

# సీఎం రేవంత్

● ప్రజల నుంచి నిరసన వచ్చినప్పుడు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు ● హామీలు అమలు చేసే వరకూ వదిలిపెట్టం ● మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు



తెలంగాణ బ్యూరో[ప్రతినిధిః వరంగల్ డిక్లరేషన్ అమలు కోసం ఢిల్లీలోని ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ఇంటిముందు ధర్నా చేస్తామని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. దసరా తర్వాత ఢిల్లీకి వెళ్తామని చెప్పారు. తొర్రూరులో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మహాధర్నా జరిగింది. ఈ ధర్నాలో హరీష్‌రావు పాల్గొని మాట్లాడారు. రైతుల రుణమాఫీ చేసేవరకూ వదిలిపెట్టమని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలపై రాహుల్ గాంధీ స్పందించాలని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఒక చేతిలో రాజ్యాంగం మరో చేతితో రౌడీయిజం చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్‌ది రైతు గుండె రేవంత్‌ది రాతిగుండె అని హరీష్‌రావు విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి అబద్దాల పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. ఆగష్టు 15వ తేదీలోగా రుణమాఫీ చేస్తామని అన్ని దేవుళ్లపై ఒట్టుపెట్టి మోసగాడిగా మారారని హరీష్‌రావు విమర్శించారు. రేవంత్ రెడ్డి మొనగాడు కాదు మోసగాడు అని విమర్శించారు. 31 కుంటి సాకులు చెప్పి రేవంత్ రుణమాఫీ ఎగ్గొడుతున్నారని అన్నారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లు కూలిస్తే ఊరుకోమని హరీష్‌రావు హెచ్చరించారు. రేవంత్ రెడ్డి దసరాలోపు రైతుబంధు డబ్బులు ఇవ్వాలని హరీష్‌రావు కోరారు. హామీలు అమలు చేసే వరకూ రేవంత్‌ను వదిలిపెట్టమని హెచ్చరించారు. ఒక్క బస్సు తప్ప రేవంత్ పాలన అంతా తుస్సేనని హరీష్‌రావు విమర్శించారు. రైతులు చనిపోయినా రేవంత్‌కు కనికరం లేదా అని ప్రశ్నించారు. ప్రజల నుంచి నిరసన వచ్చినప్పుడు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యేలు, మంత్రులను రైతులు నిలదీయాలని అన్నారు. రేవంత్ రెడ్డి బ్లాక్ మెయిల్ రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు.రేవంత్ రెడ్డి గుండాగిరిచేస్తే బీఆర్ఎస్ నేతలు చూస్తూ ఊరుకోరని హరీష్‌రావు వార్నింగ్ ఇచ్చారు. పాలకుర్తికి ఇద్దరు ఎమ్మెల్యేలట... అయినా అభివృద్ధి జరగడం లేదని హరీష్‌రావు విమర్శించారు.

# ప్రజలే మంచి, చెడు నిర్ణయిస్తారు : జగదీష్ రెడ్డి



తెలంగాణ బ్యూరో[ప్రతినిధి : బీఆర్ఎస్ పుట్టిందే తెలంగాణ కోసం..కేసీఆర్‌ది నిర్మాణాత్మక ఆలోచన, కాంగ్రెస్ పార్టీది కూలగొట్టే అరాచక పాలన అని సూర్యాపేట మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ సభ్యత్వ బీమా, సీఎం ఆర్ఎఫ్ చెక్కులు, ఎల్‌వోసీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇల్లు ఇస్తారని నమ్మి ఓట్లేస్తే ఉన్న ఇల్లు కూలగొట్టే పరిస్థితి దాపురించిందన్నారు. రైతు భరోసా లేదు, ఉన్న రైతుబంధు ఇస్తలేరు. అభివృద్ధి చేతకాకనే అరాచకాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. హామీలను గలికొదిలేసి అభివృద్ధిని ఆటకెక్కించారు. ప్రజల సమస్యలు పట్టకపోగా.. వాళ్లే ఇబ్బందులకు గురిచేస్తున్నరు.. అభివృద్ధి చేసిందెవరో, ఆగం చేస్తున్నదెవరో ప్రజలంతా గమనిస్తున్నరు. హంస పాలను, నీళ్లను వేరు చేసినట్లు ప్రజలే మంచి, చెడు నిర్ణయిస్తారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటున్న ఏకైక పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనన్నారు. పార్టీ సభ్యత్వ బీమాతో కార్యకర్తల కుటుంబాలకు అండగా నిలుస్తున్నామని స్పష్టం చేశారు.



# తెలంగాణలో మరో మూడు రోజుల పాటు వర్షాలు

● పలు జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం
● హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

తెలంగాణ బ్యూరో[ప్రతినిధి: తెలంగాణలోని పలు జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురుస్తోన్న సంగతి తెలిసిందే. రాష్ట్రంలో మరో మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ నేపథ్యంలో రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఈ నెల 5వ తేదీన నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, యాదాద్రి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉంది. 6వ తేదీన రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాల్ జిల్లాల్లో ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉంది. 7వ తేదీన భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట జిల్లాల్లో ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ఇక హైదరాబాద్‌లో సాయంత్రం 4 గంటల సమయంలో చల్లని గాలులు వీస్తూ.. పలు చోట్ల భారీ వర్షం కురిసింది. భారీ వర్షానికి భాగ్యనగరం తడిసి ముద్దైంది. నగరంలో వర్షం కురియడంతో ఉక్కపోత నుంచి ఉపశమనం కలిగింది. నిన్న, మొన్న నగరంలో పలు చోట్ల వానలు పడిన విషయం తెలిసిందే. టోలిచౌకి, నాంపల్లి, మెహిదీపట్నం, ఎల్‌బీ నగర్, చైతన్యపురి, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజాగుట్ట, ఖైరతాబాద్, సోమాజిగూడ, బేగంపేట్‌తో పాటు పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. మరో రెండు గంటల్లో సౌత్ హైదరాబాద్‌లో భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు

# మాజీ మంత్రి కేటీఆర్‌పై కుషాయిగూడ పోలీసులకు ఫిర్యాదు

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ అధిష్ఠానంపైన తప్పుడు ఆరోపణలు చేసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై తగిన చర్యలు తీసుకోవాలని గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ ఎస్సీ సెల్ కన్వీనర్ తోటకూర శ్రీకాంత్ గురువారం కుషాయిగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ జి.అంజయ్యను కలిసిన ఆయన ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు.

మూసీ ప్రక్షాళన కోసం రూ.లక్షా యాభైవేల కోట్ల నిధులు కేటాయించారని, అందులో రూ.25వేల కోట్లు ఢిల్లీ పెద్దలకు దోచి పెట్టేందుకు మూసీ ప్రక్షాళన ప్రక్రియ చేపట్టారని కేటీఆర్ తప్పుడు ఆరోపణలు చేసినట్లు శ్రీకాంత్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేటీఆర్‌పై కేసు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# హైడ్రా పేరిట పేదల నివాసాలను కూల్చవద్దు

● సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: హైడ్రా పేరిట పేదల నివాసాలను కూల్చవద్దని, భూకబ్జాల నుంచి చెరువులు, కుంటలను కాపాడాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర పార్టీ నేతలు డిమాండ్ చేశారు. గురువారం విద్యానగర్‌లోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పార్టీ సహాయ కార్యదర్శి సాధినేని వెంకటేశ్వరరావు, నాయకులు కె. గోవర్ధన్, పీఓడబ్ల్యూ కన్వీనర్ సంధ్య, ఐఎఫ్‌టీయూ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, అధ్యక్షురాలు అనురాధ మాట్లాడారు. హైదరాబాద్ నగరాన్ని కబ్జాల నుంచి రక్షించడానికి రూపొందించిన హైడ్రాను నిరుపేదలు, బస్తీవాసులపై ప్రయోగించి వారికి నివాసాలు, జీవనోపాధి లేకుండా చేసే విధానాలను నిలిపివేయాలన్నారు. రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం రూ. 2 లక్షల వరకు వెంటనే రుణమాఫీ చేయాలని, రామగుండం రాడార్ కేంద్రం ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. సమావేశంలో పీడీఎస్‌యూ ప్రధాన కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నాం



తెలంగాణ బ్యూరో ప్రతినిధిః దేశ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు తెలుగు దేశం పార్టీ జాతీయ ప్రచార కార్యదర్శి జె.దశరథ్ తెలిపారు. గత నెల రోజులు గా తిరుమల ఏడుకొండల స్వామి ప్రసాదంలో జరుగుతున్న తంతును న్యాయస్థానం సుప్రీం కోర్టు రివ్యూ చేసిన అనంతరం జస్టిస్ గవాయి ఒక స్వతంత్ర సంస్థతో దర్యాప్తునకు ఆదేశించాలని నిర్ణయించింది.

ఈ తీర్పును తెలుగు దేశం పార్టీ స్వాగస్తుందని తెలిపారు. ముఖ్యంగా ఈ సంస్థలో సీబీఐ డైరక్టర్ తోపాటు ఐపీయస్, ఐఎస్ఏ తోపాటు ఆంధ్ర ప్రదేశ్ లోని ఇద్దరు పోలీస్ అధికారులను చేర్చడం ఆహ్వానించ తగ్గ పరిణామమనిని దశరథ్ పేర్కొన్నారు సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ మాసుద్ దీనికి సార్యధ్యం వహిస్తారని జస్టిస్ గావాయ్ పేర్కొన్నరని దశరథ్ చెప్పారు తిరుమల దేవదేవుని సమక్షంలో కోట్లాది మంది భక్తులకు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్న పరిణామంగా దేశవిదేశాల్లో ఇదే అంశం చర్చనీ యాంశంగా ఉందని దశరథ్ పేర్కొన్నారు.

# సుప్రీంకోర్టు ఆదేశాలనే వక్రీకరిస్తారా

● రాజకీయ దురుద్దేశంతో చంద్రబాబు వ్యవహరిస్తున్నారు ● చంద్రబాబు మాటలు అబద్ధమని టీటీడీ ఈవో పదే పదే చెప్తున్నారు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై చంద్రబాబు వేసిన సిట్ ను సుప్రీంకోర్టు రద్దు చేస్తే.. ఆయన మాత్రం దాన్ని వక్రీకరిస్తూ తప్పుడు ప్రచారాలు చేసుకుంటున్నారని వైసీపీ అధినేత వైఎస్ జగన్ మండిపడ్డారు. దేవుడంటే భయం, భక్తీ లేకుండా తప్పులు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు వ్యాఖ్యలు, ఆదేశాలను టీడీపీ వక్రీకరిస్తోందని జగన్ విమర్శించారు. తిరుమలను చంద్రబాబు అపవిత్రం చేశారని ఆక్షేపించారు. తిరుమల లడ్డూలో జంతువుల కొవ్వు కలిపిన వ్యవహారంపై సుప్రీంకోర్టు సీరియస్ కావడంతో జగన్ రెడ్డి, బావ ధర్మారెడ్డి, బాబాయ్ సుబ్బారెడ్డి, మామ కరుణాకర్ రెడ్డి అంటూ టీడీపీ ఎక్స్ హ్యాండిల్ లో చంద్రబాబు ట్వీట్ పెట్టడం దారుణమన్నారు. సుప్రీంకోర్టు చంద్రబాబు మీద అక్షింతలు వేశారని నేషనల్ మీడియా మొత్తం రిపోర్ట్ చేసిందని జగన్ గుర్తుచేశారు. చంద్రబాబు తప్పుల్ని నేషనల్ మీడియా వేలెత్తి చూపిస్తున్నా, సుప్రీంకోర్టు తిడుతున్నా టీడీపీ ట్విట్టర్ హ్యాండిల్ మాత్రం ఎంత దుష్ప్రచారం చేస్తోందో చూడాలని జగన్ కోరారు.చంద్రబాబు మాటలు అబద్ధమని టీటీడీ ఈవో పదే పదే చెప్తున్నారని, అయినా ఇంకా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని జగన్ విమర్శించారు. ఇంత జరిగినా తిరుమల అన్నా తిరుపతి అన్నా నాకు భయమూ లేదా భక్తీ లేదనే విధంగా చంద్రబాబు వ్యవహరించారని జగన్ ఆరోపించారు. రాజకీయ దురుద్దేశంతో మన గుడిని, మన లడ్డూ ప్రసాదాన్ని మనమే తగ్గించుకుంటూ కోట్లాది మంది భక్తుల మనోభావాలతో ఆడుకుంటున్నారని జగన్ ఆక్షేపించారు. లడ్డూపై చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై ఆయనకు మొట్టికాయలు వేయాలని కోర్టుల్ని, ప్రధాని మోడీని తాము ఆశ్రయించిన విషయాన్ని జగన్ గుర్తుచేశారు. సెప్టెంబర్ 25న సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల్లో అత్యున్నత పదవిలో ఉన్న వ్యక్తి భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా బహిరంగ ప్రకటనలు చేయడం సరికాదని చెప్పిన విషయాన్ని కూడా జగన్ ప్రస్తావించారు. 26 సెప్టెంబర్ న ఎఫ్ఐఆర్ నమోదు అయితే 18నే చంద్రబాబు బహిరంగ ఆరోపణలు చేయడం భక్తుల సెంటిమెంట్ దెబ్బతీస్తుందని సుప్రీంకోర్టు చెప్పిందని జగన్ గుర్తుచేశారు.

# సుప్రీం తీర్పుపై హర్షం : హోంమంత్రి వనిత



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంలో ఐదుగురు సభ్యులతో కూడిన స్వతంత్ర సిట్ ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. సిట్‌లో సీబీఐ నుంచి ఇద్దరు, ఏపీ ప్రభుత్వం తరవున ఇద్దరు, ఎఫ్ఎస్ఎస్ఏఐ నుంచి ఒకరు సభ్యులుగా ఉండాలని సూచించడంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అనకాపల్లిలో నిర్వహించిన మీడియా సమావేశంలో హోంమంత్రి మాట్లాడారు. శ్రీవారి లడ్డూ అనేది భక్తుల మనోభావాలకు సంబంధించిన ముఖ్యమైన అంశమని అనిత అన్నారు. స్వతంత్ర దర్యాప్తు సంస్థతో సిట్ ఏర్పాటు చేయడం శుభ పరిణామం అని చెప్పుకొచ్చారు. సిట్ ఏర్పాటుతో స్వామివారి భక్తులు, ప్రజలకు వాస్తవాలు తెలుస్తాయని ఆమె అన్నారు. తప్పు చేయనివారు భయపడరని, విజిలెన్స్ ఎంక్వైరీ అంటే వైసీపీ నేత వైవీ సుబ్బారెడ్డి ఎందుకు భయపడుతున్నారో చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. సిట్ ద్వారా త్వరలో నిజానిజాలు బయటపడతాయని, స్వామివారికి అపచారం చేసిన వారు ఎవరైనా సరే జైలుకు వెళ్లడం ఖాయమని హోంమంత్రి అనిత అన్నారు.

## నా ఫాంహౌస్ అక్రమమైతే

# నేనే కూలుస్తా

సీఎం రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ సీనియర్ నేత కేవీపీ బహిరంగ లేఖ

తెలంగాణ బ్యూరో[ప్రతినిధి: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ సీనియర్ నేత కేవీపీ రామచంద్రరావు బహిరంగ లేఖ రాశారు. ఈ సందర్భంగా లేఖలో పలు కీలక అంశాలను ప్రస్తావించారు. అవి, మూసీ ప్రక్షాళన/ సుందరీకరణను నేను పూర్తిగా స్వాగతిస్తున్నాను.. ఈ ప్రాజెక్ట్ విషయంలో అటు బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, వారి పెంపుడు మీడియా పేదలకు అన్యాయం పేరుతో మాట్లాడేలా చేస్తున్నాయి.. అన్నీ వారి స్వప్రయోజనాలు కాపాడుకోవడం కోసమే అని ఆయన విమర్శించారు. ఈ విషయంలో ప్రతిపక్షాలది మొసలి కన్నీరేనని దేశప్రజలందిరికి తెలుసు.. మీ ఆశయాన్ని దెబ్బ తీసే వారి ప్రయత్నాలను ఖండిస్తున్నాను అని చెప్పుకొచ్చారు. అజీజ్ నగర్ లో నా కుటుంబసభ్యుల పేరు మీద ఉన్న ఫాం హౌస్ మీద, వారి స్వార్థం కోసం ప్రతిపక్ష నాయకులు పదేపదే ఆరోపణలు చేస్తున్నారు. మీ భుజంపై తుపాకీ పెట్టి నన్ను కాల్చాలని తద్వారా మిమ్మల్ని ఇరుకున పెట్టాలని ప్రయత్నం చేస్తున్నారని కేవీపీ అన్నారు. అయితే, కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా మీపై, మన పార్టీపై ఆధారాలు లేని ఆరోపణలు చేయడానికి ప్రతిపక్షాలు నన్ను, నా కుటుంబ సభ్యుల పేరుపై ఉన్న ఫాం హౌస్ ను పావుగా వాడుకోవడం.. నాకు తీవ్ర మనోవేదన కలిగిస్తుందని కాంగ్రెస్ సీనియర్ నేత కేవీపీ రామచంద్రరావు అన్నారు. మా ఫాం హౌస్ లో ఏ కట్టడమూ ఎఫ్‌టీఎల్,బఫర్ జోన్ పరిధిలో లేవు.. ఏ కట్టడమైనా ఒక్క అంగుళం మేరకు ఉన్నా.. నా సొంత ఖర్చులతో కూల్చడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన చెప్పుకొచ్చారు. సంబంధిత అధికారులను వీలు చేసుకొని.. వెంటనే మా ఫాం హౌస్ కు పంపించండి.. చట్ట ప్రకారం అక్కడ ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్ల పరిధిని మార్క్ చేస్తే.. ఆ పరిధిలో ఏదైనా కట్టడం ఉంటే.. 48 గంటలలో ప్రభుత్వానికి భారం కాకుండా.. నా సొంత ఖర్చులతో ఆ కట్టడాలను కూలుస్తాం అని వెల్లడించారు. అలాగే, వ్యర్థాలను తొలగించి, శుభ్రం కూడా చేస్తామని మీకు హామీ ఇస్తున్నాను అని కేవీపీ రామచంద్ర రావు వెల్లడించారు. అయితే ఈ మార్కింగ్ ప్రక్రియ పారదర్శకంగా జరగాలని నా కోరిక.. మార్కింగ్ చేసే సమయం, తేదీ ముందే ప్రకటిస్తే.. నాపై పదేపదే ఆరోపణలు చేస్తున్న ప్రతిపక్ష నాయకులు, వారి అనుకూల మీడియా కూడా తీరిక చేసుకొని వచ్చి.. ఈ ప్రక్రియని వీక్షించే అవకాశం కలుగుతుంది అన్నారు. ఒక క్రమశిక్షణ, నిబద్ధత కల్గిన కార్యకర్తగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నా శాయశక్తులా ప్రయత్నం చేస్తున్నాను.. నా వల్ల పార్టీకి నష్టం కలిగే ఏ పని చేయను అని పేర్కొన్నారు. ఇది నేను, డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి దాదాపు మూడు దశాబ్దాల క్రితం అంటే 1996లోనే మా అంతరాత్మ సాక్షిగా తీసుకున్న నిర్ణయం అని వెల్లడించారు. నా తుది ఊపిరి వరకూ దీనికి కట్టుబడే ఉంటాను.. కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా నాకు చట్టం నుంచి ఏ మినహాయింపులు వద్దు.. చట్టాన్ని తన పని తాను చేసుకోనిపోనిద్దాం.. మీ నాయకత్వంలోని మన కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎటువంటి చెడ్డ పేరు రావొద్దు.. నాలో ఉన్న కాంగ్రెస్ రక్తం అందుకు అంగీకరించనందునే మీకు ఈ బహిరంగ లేఖ రాస్తున్నాను అని కేవీపీ రామచంద్రరావు తెలిపారు.

# సుప్రీం తీర్పు మాకు సమ్మతమే

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నట్లు ఏపీ గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. అమ్మవారిని దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందని మంత్రి కొల్లు అన్నారు. ఇంద్రకీలాద్రిపై దసరా మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయని తెలిపారు. వినాయకుడి గుడి వద్ద నంచి క్యూ లైన్లో నడిచి తాను కొండపైకి చేరినట్లు మంత్రి చెప్పారు. గత ఐదేళ్లపాటు మహోత్సవాలను వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని రవీంద్ర మండిపడ్డారు. ఎన్డీయే ప్రభుత్వం దేవాలయాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, అందుకే ఉత్సవాలను ఇంత ఘనంగా నిర్వహిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు.



# దేశ ప్రగతికి అత్యుత్తమ మార్గం

## పి4 పేరుతో చంద్రబాబు ప్రణాళికలు

## విజన్ 2047 నాటికి లక్ష్య సాధన దిశగా అడుగులు

**ప్రభుత్వ-ప్రైవేట్-ప్రజల భాగస్వామ్యానికి ఉద్దేశించిన 'పి4' మోడల్ను అనుసరించడం ద్వారా భారతదేశంలో అనేక సమస్యలు పరిష్కరించగలమన్న ధీమా తో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు నాయుడు ఉన్నారు. ఆమధ్య నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో, "పేదరికం" లేకుండా చేయడం, రాష్ట్రాలు తమ స్వంత జనాభా నిర్వహణ ప్రణాళికలను రూపొందించుకోవడం మరియు నదుల అనుసంధానం గురించి నాయుడు చేసిన కొన్ని సూచనలు, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ముగింపు వ్యాఖ్యలలో కూడా ప్రస్తావించారంటే దీని ప్రభావం ఏమేరకు ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రధానంగా నదుల అనుసంధానం కోసం కేంద్రం రోడ్ మ్యాప్ను సిద్ధం చేయాలని, 2047 నాటికి భారతదేశ జనాభా డివిడెండ్ తగ్గిపోతుందని, రాష్ట్రాలు తమ తమ జనాభా నిర్వహణ ప్రణాళికలను రూపొందించుకోవాలని నాయుడు సూచించడం గమనార్హం. ఈ విషయంపై మరిన్ని వివరాలలోకి వెళితే...**




ఏపీ సీఎం చంద్రబాబు రూటు మార్చారు. మళ్లీ విజన్ దిశగా అడుగులు వేయడం ప్రారంభించారు. నిన్న మొన్నటి వరకు అంటే సెప్టెంబరు మాసం అంతా కూడా రెండు కీలక విషయాలతోనే పాలన సరిపోయింది. దీంతో ప్రభుత్వం పరంగా పెద్దగా ఏమీ చేయలేకపోయారు. ఎలాంటి నిర్ణయాలు కూడా తీసుకోలేక పోయారు. సెప్టెంబరు 1 నుంచి 15 వరకు రాష్ట్రంలో వరదలు, తుఫానులతోనే కాలం గడిచిపోయింది. వీటి నుంచి ప్రజలను రక్షించడం.. సమీక్షలు.. సాయం అంటూ కాలం కరిగిపోయింది. దీనికితోడు కృష్ణానదిలో 4 ఐరన్ పడవల వ్యవహారం కూడా సర్కారుకు తలనొప్పిగా మారింది. ఈ విషయాల నుంచి కొంత బయటకు వచ్చే సమయంలో ఆ తర్వాత.. 15 రోజులు కూడా తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీ వ్యవహారం తెరమీదికి వచ్చింది. ఈ పరిణామాలతో సెప్టెంబరు మాసం అంతా కూడా గడిచి పోయింది.

## సంక్రాంతి నుంచి మరో కార్యక్రమం

సంక్రాంతి నుంచి మరో కార్యక్రమం అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. పేదరికంలేని సమాజ నిర్మాణమే లక్ష్యంగా పీ-4 కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. సూపర్ సిక్స్ అమల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని ప్రకటించారు సీఎం చంద్రబాబు నాయుడు. సంక్రాంతి నుంచి పీ-4 ప్రొగ్రామ్ అమల్లోకి రాబోతుందని సీఎం స్పష్టం చేశారు. ఇప్పటికే దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకానికి శ్రీకారం చుట్టనున్నట్టుగా ఇప్పటికే ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే సంక్రాంతి నుంచి పీ4 కార్యక్రమం అమలు చేయాలని నిర్ణయించింది. ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటించారు.

ఈ మధ్య బందర్లో పర్యటించిన సీఎం చంద్రబాబు 2047 కల్లా భారత్ ప్రపంచంలోనే సూపర్ పవర్గా మారబోతుందన్నారు. ప్రగతిపథంలో దూసుకెళ్లాలంటే హార్డ్ వర్క్ తో పాటు స్మార్ట్ వర్క్ చేయాలన్నారు. టెక్నాలజీని , ఇంటెలిజెన్సీని వాడుకుంటూ ముందుకు సాగాలన్నారు. అభివృద్ధి అంశాలతో పాటు కుటుంబనియంత్రణపై ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన సీఎం స్వర్ణాంధ్ర లక్ష్యంగా త్వరలో పి4 కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్టు చెప్పారు.

## రహదారుల అభివృద్ధి

పి4 ద్వారా రాష్ట్రంలో కుల గణనకు బదులు నైపుణ్య గణన చేపడతారు. ఇప్పటికే దీనిపై కేబినెట్లో చర్చించి ఆమోదించామని చెప్పారు. మానవ వనరులను పెట్టుబడిగా మార్చేందుకు మార్గదర్శకాలన్నింటినీ అందిపుచ్చుకుంటూ.. సంపద సృష్టించడమే లక్ష్యంగా కార్యచరణ. చేపడతారు. స్వల్ప, మధ్యకాలిక, దీర్ఘకాలిక లక్ష్యాలతో ప్రజలకు ఉపాధిని అందించడంతో ప్రతి కుటుంబంలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా మారే అవకాశం ఉంటుందన్నారు. తమ రాష్ట్ర పునర్నిర్మాణం కోసం తమ పార్టీ, కేంద్రం కలిసి పనిచేస్తాయి. పీ-4 పథకానికి పచ్చ జెండా ఊపిన చంద్రబాబు రాష్ట్ర వ్యాప్తంగా రహదారులు, ప్రాజెక్టుల అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా ఊపారు. దీని ప్రకారం.. పబ్లిక్-ప్రైవేట్-ప్రభుత్వం-పార్టనర్ షిప్(పీ-4) కింద రహదా రులను అభివృద్ధి చేయనున్నారు. ముఖ్యంగా స్టేట్ హైవేస్ను ఈ పథకం కిందే డెవలప్ చేసేందుకు మార్గనిర్దేశం చేశారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా వచ్చే ఆరు మాసాల్లో రోడ్లు అద్దాల్లా మెరిసేలా నిర్ణయం తీసుకున్నారు.

## విజన్ 2047

గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గా ఉన్న రోజుల్లో తన మార్కు అభివృద్ధిని సాధించాలని పలురకాల లక్ష్యాలను ముందు ఉంచుకున్నారు. విజన్ 2020 లో వందరోజుల ప్రణాళిక షార్ట్ టర్మ్ ప్లాను, లాంగ్ టర్మ్ ప్లాన్ ఇవ్వడం స్కీములతో ప్రజలను భాగస్వామ్యం చేసేలా స్వర్ణాంధ్రప్రదేశ్ సాధించే లక్ష్యంతో 2020 ని రూపొందించారు .అభివృద్ధి మంత్రాన్ని పటిస్తూ చంద్రబాబు నాయుడు అప్పట్లో ప్రత్యేక కార్యాచరణను రూపొందించారు. ఇందులో టెక్నాలజీని బాగా అభివృద్ధి పరిచారని చెప్పవచ్చు. నేడు 2020తో పోలిస్తే 2047 కు ప్రత్యేక కార్యచరణ ఉంది. విద్య , వైద్యం, వాణిజ్య, వ్యాపార రంగాల అభివృద్ధి ఎలా సాధించాలో చంద్రబాబు తెలియంది కాదు

రానున్న వందేళ్లు ఇండియా వైపే చూస్తాయని ప్రపంచానికి ఇండియా గ్లోబల్ లీడర్ గా మారుతుంది అనటంలో సందేహం లేదంటూ రోబోటిక్స్ అత్యంత కీలకంగా మారతాయని, డ్రోన్స్ పని టెక్నాలజీతో విస్తృతమవుతుందని వివరించారు. ఈ క్రమంలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ రూపు రేఖల్ని మార్చుతుందన్న ధీమా ఆయనది

## గతంలో పిపిపి పద్ధతి

పి పి పి పద్ధతిలో అభివృద్ధి చంద్రబాబు లక్ష్యం రాష్ట్ర అభివృద్ధిపై కేంద్రీకృతమైనట్టు తెలుస్తుంది . ఇందులో ప్రజలు, ప్రభుత్వం, ప్రైవేటు భాగస్వామ్యంతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించే ప్రణాళిక చంద్రబాబు రూపొందించుకున్నారు. రానున్న వందేళ్లలో భారత్ వేగంగా అభివృద్ధి చెంది ప్రపంచంలో రెండో స్థానంలో నిలుస్తుందని, ఆ విధంగా గ్లోబల్ ఎకానమీ సాధిస్తుందని ఇందుకు ఆయన ఎంచుకున్న ఐదు ప్రధాన రంగాలను తనదైన శైలితో ముందుకు సాగుతున్నారు. అందులో మొదటిది సోలార్ సోలార్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చని ఇది ఒక గేమ్ చేంజర్ గా నిలుస్తుందని చెప్పుకొచ్చారు. విద్యుత్ వినియోగం ఎలా ఉంటుంది, విద్యుత్తును ఎలా ఆదా చేయాలి, సోలార్ లేని సమయాల్లో విద్యుత్ ను విండ్ ద్వారా ఏర్పాటు చేసుకునే ప్రణాళికను చంద్రబాబు వివరించారు . దీని ద్వారా ఎన్నో పర్యావరణ లాభాలు ఉంటాయని, ఆరోగ్యపరమైన లాభాలు కూడా ఉంటాయన్నారు. ఇక రెండోది వాటర్ వాటర్ ఈస్ వెల్త్ గా చంద్రబాబు అభివర్ణించారు. దీనికి నదుల అనుసంధానం ప్రత్యేకమైనదిగా భావించారు. భవిష్యత్తు అంతా ఆశాజనకంగా ఉండాలంటే, బంగారు భవిష్యత్తు రావాలంటే దేశంలో నదులన్నీ అనుసానందానం కావాలని ఈ సందర్భంగా సూచించారు. తన వద్ద ఉన్న ప్రత్యేక కార్యచరణతో ఈ విధానం రూపొందించినట్లు చంద్రబాబు వివరించారు.

ఇక మూడవది టెక్నాలజీ టెక్నాలజీ అంటే చంద్రబాబు పేరు గుర్తొచ్చే రోజులు గతంలో ఉన్నాయి . ఎందుకంటే హైదరాబాద్ ఉమ్మడిగా ఉన్నప్పుడు సాఫ్ట్ వేర్ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషిచేశారు. కొన్ని ప్రాంతాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసి అక్కడ టెక్నాలజీకి పెద్దపీట వేశారు . దీంతో చంద్రబాబుకు టెక్నాలజీ పై ఎక్కువ నమ్మకం ఉంది. టెక్నాలజీ ద్వారా విద్య, వైద్యం ,రవాణా , పరిపాలన, వ్యవసాయం ఇటువంటి వాటిని సమ-ర్ధవంతంగా నిర్వహించవచ్చని పేర్కొన్నారు .

నాలుగవది డెమోక్రసీక్ మేనేజ్మెంట్ భారతదేశంలో ఇతర దేశాలతో పోలిస్తే పనిచేసే వాళ్లు ఎక్కువమంది ఉన్నారు. ఇది సౌత్ ఇండియాలో ఉండటం గొప్ప వరం అని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో పనిచేసేవాళ్లు తక్కువ అవుతారని పేర్కొన్నారు. చైనాలో ప్రస్తుతం ఇదే తరహా ఆందోళన నెలకొనగా ఆ గ్యాప్ ను పూడ్చులేని పరిస్థితిలో చైనా ఉందని, భారతదేశం ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ ఆ విధమైన గ్యాప్ కొని తెచ్చుకోకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వివరించారు. రాబోయే వంద ఏళ్ళు భారతదేశం ప్రపంచానికి సర్వీసులు అందించే కేంద్రంగా ఉంటుందని అన్నారు.

## పి4 అంటే ..

పబ్లిక్..ప్రైవేట్ ..పీపుల్..పార్టనర్షిప్ పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. సంక్రాంతి నుంచి అమల్లోకి రానున్న పి 4 కార్యక్రమాన్ని నిమ్మకూరులో పైలట్ ప్రాజెక్టా చేపట్టనున్నారు. జనవరి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అమలు కాబోతున్న పి4 కార్యక్రమం ఎలా వుండబోతుంది. విధివిధానాలు ఎలా వుంటాయనే చర్చ జరుగుతోందిప్పుడు.





## రిచ్ టూ పూర్ నినాదం

రిచ్ టు పూర్ నినాదం చంద్రబాబు 2047 ప్రణాళికలో రిచ్ టూ పూర్ నినాదాన్ని ముందుకు తీసుకువచ్చారు. ఇందులో యువతకి స్కిల్ డెవలప్మెంట్ ఏర్పాటు చేసి వారిని ఉద్యోగాలు కల్పించే వారిగా ప్రత్యేక చర్యలు తీసుకోనున్నారు. అలాగే సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ ను మరింత అభివృద్ధి చేసి వారిలో నైపుణ్యాలు పెంచి వారిని లక్షాధికారులుగా చేసే ఉద్దేశాన్ని వివరించారు. అలాగే వ్యవసాయాన్ని విస్తృతంగా అందించి వ్యవసాయ అనుబంధ రంగాలను అభివృద్ధి చేయాలని సూచించారు. అందులో భాగంగా రైతులకు నష్టం లేకుండా పంటలు పండే రోజులు పండని రోజుల్లో కూడా వ్యవసాయ ఆధారిత పంటలపై దృష్టి సారించే ప్రణాళికను రూపొందించనున్నారు.

ప్రధానంగా సోషల్ సెక్యూరిటీ ఉండే విధంగా తన విజన్ లో రూపొందించారు. తద్వారా గ్లోబల్ ఎకానమీ సాధ్యమవుతుందని చంద్రబాబు ఊహించారు . ప్రపంచానికి భారతదేశము పెద్దన్నగా ఉండే రోజులు వస్తాయి అని అన్నారు. ఈ గ్లోబల్ ఎకానమీ రావాలంటే భారతదేశంలో గానీ , రాష్ట్రంలో గాని పేదరికం పోవాలని, నిరక్షరాస్యత తగ్గించాలని, పౌష్టికారాలోహం లేకుండా చూడాలని తన ప్రణాళికను రూపొందించుకున్నారు. విజన్ 2020 తో స్వర్ణాంధ్రప్రదేశ్ అంటూ ప్రతిపక్షంలో కూర్చున్న చంద్రబాబు విజన్ 2047 తో అధికారంలోకి

## గ్రోత్ రేటు 15 శాతానికి లక్ష్యం



ఇక, మరో కీలక నిర్ణయం గ్రోత్ రేటు 15 శాతానికి చేర్చడం. ప్రస్తుతం రాష్ట్ర గ్రోత్ రేట్ 7.8 శాతంగా ఉంది. అయితే.. మౌలిక వసతుల కల్పన,ఉ పాధి, విద్యారంగాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించడం ద్వారా.. ప్రజల ఆదాయ వృద్ధి రేటు తదనుగుణంగా రాష్ట్ర వృద్ధిని కూడా 15 శాతానికి పెంచేందుకు అవసరమైన నిర్ణయాలు తీసుకుంటారు. వచ్చేరెండున్నరేళ్లలో రాష్ట్ర స్థూల ఉత్పత్తులు కూడా పెంచనున్నారు. దీంతో రాష్ట్ర వృద్ధిని 15 శాతానికి పెంచాలని నిర్ణయించారు. ఈ పరిణామాలతో చంద్రబాబు తిరిగి విజన్ దిశగా అడుగులు ప్రారంభించినట్టు అయింది.

సూర్య
హైదరాబాద్ శనివారం
5 అక్టోబర్ 2024
9

# దశాబ్దం తర్వాత బంగ్లాదేశ్ విజయం



మహిళల టీ20 ప్రపంచ కప్-2024లో బంగ్లాదేశ్ బోణీ కొట్టింది. షార్జా వేదికగా స్కాట్లాండ్‌తో గురువారం జరిగిన మ్యాచ్‌లో 16 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ క్రమంలో ఉమెన్స్ వరల్డ్ కప్‌లో పదేళ్ల తర్వాత తొలిసారి గెలుపు రుచిచూసింది. 2014 టీ20 ప్రపంచకప్ నుంచి బంగ్లా బరిలోకి దిగుతోంది. తమ సొంతగడ్డపై జరిగిన ఈ మెగాటోర్నీలో మొదటి మూడు మ్యాచ్‌ల్లో ఓడి ఆ తర్వాత రెండింట్లో గెలిచింది. అయితే ఆ తర్వాత జరిగిన టీ20 వరల్డ్ కప్‌లలో బంగ్లాదేశ్ బరిలోకి దిగుతున్నప్పటికీ ఒక్కటి అంటే ఒక్క మ్యాచ్ కూడా విజయం సాధించలేకపోయింది. వరుసగా 16 మ్యాచ్‌ల్లో ఓటమిపాలైంది. స్కాట్లాండ్‌పై విజయంతో ఎట్టకేలకు తిరిగి గెలుపు బాట పట్టింది. కాగా, మొదట బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్లకు 119 పరుగులు చేసింది. శోభన (36బీ 38 బంతుల్లో, 2 ఫోర్లు), శాంతి రాణి (29బీ 32 బంతుల్లో, 3 ఫోర్లు) టాప్ స్కోరర్లు. స్కాట్లాండ్ బౌలర్లలో సస్కియ మూడు వికెట్లు తీసింది. అనంతరం ఛేదనలో స్కాట్లాండ్ 20 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 103 పరుగులకే పరిమితమైంది. వికెట్ కీపర్ సారా బ్రైస్ (49బీ 52 బంతుల్లో, 1 ఫోర్) పోరాడింది. బంగ్లా బౌలర్లలో రితూ మోని రెండు వికెట్లు పడగొట్టింది. కాగా, ఈ వరల్డ్ కప్ వాస్తవానికి బంగ్లాదేశ్‌లో జరగాల్సింది. కానీ ఆ దేశంలో రాజకీయ సంక్షోభంతో శాంతి భద్రతలు అదుపుతప్పడంతో యూఏఈ వేదికగా నిర్వహిస్తున్నారు. తొలి రోజు జరిగిన మరో మ్యాచ్‌లో ఆసియా ఛాంపియన్స్ శ్రీలంకపై పాకిస్థాన్ 31 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన పాకిస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 116 పరుగులు చేసింది. కెప్టెన్ ఫాతిమా (30బీ 20 బంతుల్లో, 3 ఫోర్లు, 1 సిక్సర్) టాప్ స్కోరర్. ఆటపట్టు, సుగందిక, ప్రబోధని తలో మూడు వికెట్లు తీశారు.అనంతరం ఛేదనలో శ్రీలంక 20 ఓవర్లలో 9 వికెట్లకు 85 పరుగులకే పరిమితమైంది.



# చరిత్ర సృష్టించిన హర్మన్‌ప్రీత్ కౌర్

భారత మహిళల క్రికెట్ టీమ్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ చరిత్ర సృష్టించింది. మహిళల టీ20 ప్రపంచకప్ 2024లో భాగంగా న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి మ్యాచ్‌తో అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. హర్మన్‌ప్రీత్ కౌర్‌కు కెప్టెన్‌గా ఇది నాలుగో టీ20 ప్రపంచకప్. ఈ క్రమంలోనే అత్యధిక టీ20 ప్రపంచకప్ ఎడిషన్స్‌లో టీమిండియాను నడిపించిన కెప్టెన్‌గా చరిత్రకెక్కింది. హర్మన్‌ప్రీత్ కౌర్‌కు ముందు మిథాలీ రాజ్ మూడు ఎడిషన్లలో టీమిండియాను నడిపించగా.. జులన్ గోస్వామి రెండు ఎడిషన్స్‌లో టీమిండియాకు సారథం వహించింది. 2018, 2020, 2023, 2024 టీ20 ప్రపంచకప్‌ల్లో హర్మన్‌ప్రీత్ కౌర్ టీమిండియా కెప్టెన్‌గా వ్యవహరించగా.. 2012, 2014, 2016 ఎడిషన్స్‌లో మిథాలీ రాజ్, 2019, 2010లో జులన్ గోస్వామి టీమిండియా కెప్టెన్లుగా వ్యవహరించారు.

అయితే ఇప్పటి వరకు భారత మహిళల జట్టు టీ20 ప్రపంచకప్ గెలవలేదు.జులన్ గోస్వామి సారథ్యంలో రెండు సార్లు సెమీఫైనల్లో వెనుదిరిగింది. మిథాలీ రాజ్ సారథ్యంలో గ్రూప్ దశలోనే ఇంటిదారి పట్టింది. హర్మన్ ప్రీత్ కౌర్ సారథ్యంలో మెరుగైన ప్రదర్శన చేసిన భారత్ 2018, 2023లో సెమీఫైనల్లో వెనుదిరిగింది. 2020లో ఫైనల్ చేరి ఆస్ట్రేలియా చేతిలో ఓటమిపాలైంది. ఈ సారైనా టైటిల్ గెలవాలని హర్మన్‌సేన భావిస్తోంది. ఇక అత్యధిక టీ20 ప్రపంచకప్‌లు ఆడిన తొలి భారత మహిళా ప్లేయర్‌గా హర్మన్‌ప్రీత్ కౌర్ రికార్డ్ సాధించింది. తాజా ఎడిషన్‌తో కలిపి ఆమె మొత్తం 9 ఎడిషన్స్ ఆడింది. ప్రపంచంలో ఆరుగురు ప్లేయర్లు మాత్రమే ఈ రికార్డు సాధించగా.. అందులో హర్మన్‌ప్రీత్ ఒకరు. 2009 నుంచి హర్మన్‌ప్రీత్ కౌర్‌తో పాటు సోఫీ డివైన్, సుజీ బేట్స్, ఎల్లిస్ పెర్రీ, స్టెఫైన్ టేలర్, చమరి ఆటపట్టు ప్రతీ ఎడిషన్ ఆడుతున్నారు. అత్యధిక టీ20 మ్యాచ్‌లు ఆడటంతో పాటు సారథ్యం వహించిన ప్లేయర్‌గా హర్మన్‌ప్రీత్ కౌర్ చరిత్రకెక్కింది. ఇప్పటి వరకు 174 మ్యాచ్‌లు ఆడిన హర్మన్‌ప్రీత్ కౌర్.. 119 మ్యాచ్‌కు సారథ్యం వహించింది. న్యూజిలాండ్‌తో మ్యాచ్‌లో టీమిండియా టాస్ ఓడి ఫీల్డింగ్‌కు దిగింది. ఈ టోర్నీలో గ్రూప్-ఏలో ఉన్న టీమిండియా.. ఆదివారం పాకిస్థాన్‌తో.. అక్టోబర్ 9న శ్రీలంకతో, అక్టోబర్ 13న ఆస్ట్రేలియాతో తలపడనుంది.



## టాస్ ఓడిన భారత్.. తెలుగు అమ్మాయికి చోటు

మహిళల టీ20 ప్రపంచకప్ 2024లో భాగంగా న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి మ్యాచ్‌లో టీమిండియా టాస్ ఓడింది. టాస్ గెలిచిన న్యూజిలాండ్ సారథి సోఫీ డివైన్ బ్యాటింగ్ ఎంచుకుంది. పిచ్ కండిషన్స్ నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపింది. ఈ వికెట్‌లో ఏ మాత్రం మార్పు ఉండదని చెప్పింది. న్యూజిలాండ్ టీమ్ సూపర్ ఫామ్‌లో ఉందని, అత్యుత్తమ ప్రదర్శన కనబర్చేందుకు ప్రయత్నిస్తామని చెప్పుకొచ్చింది. ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్ ముగ్గురు పేసర్లు, ఇద్దరు స్పిన్నర్లతో బరిలోకి దిగింది. మరోవైపు ముందుగా ఫీల్డింగ్ చేయడంపై తమకు ఎలాంటి సమస్య లేదని టీమిండియా కెప్టెన్ హార్మన్ ప్రీత్ కౌర్ తెలిపింది. వాతావరణం చల్లగా ఉన్నందున సెకండ్ బ్యాటింగ్‌కు ఎలాంటి ఇబ్బంది ఉండదని చెప్పింది. తమ ప్లేయర్లు ఫియర్‌లెస్ బ్యాటర్లని, దూకుడుగా ఆడుతామని చెప్పింది. అంతేకాకుండా తమ జట్టు సమతూకంగా ఉందని, తమ ఆటను ఆస్వాదిస్తామని తెలిపింది. ముగ్గురు పేసర్లతో కూడిన బౌలింగ్ విభాగానికి అరుంధతి రెడ్డి కూడా తోడైందని, లెగ్ స్పిన్నర్ ఆశా సోభనా కూడా చోటు దక్కించుకుందని పేర్కొంది.

**తుది జట్లు:** భారత్: స్మృతి మంధాన, షెఫాలీ వర్మ, హర్మన్‌ప్రీత్ కౌర్(కెప్టెన్), జెమీమా రోడ్రిగ్స్, రిచా ఘోష్(కీపర్), దీప్తి శర్మ, అరుంధతి రెడ్డి, పూజా వస్త్రాకర్, శ్రేయాంక పాటిల్, ఆశా సోభనా, రేణుక సింగ్

న్యూజిలాండ్: సుజీ బేట్స్, జార్జియో ప్లిమ్మర్, అమెలియా కేర్, సోఫీ డివైన్(కెప్టెన్), బ్రూక్ హాల్లిడే, మ్యాడ్డీ గ్రీన్, ఇసాబెల్లా గేజ్(కీపర్), జెస్ కేర్ర్, రోస్‌మేరీ మైర్, లీ టాహుహు, ఈడెన్ కార్సన్

## హార్దిక్ పాండ్యా బౌలింగ్‌పై టీమిండియా కోచ్ అసంతృప్తి

టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా రీఎంట్రీ ఇచ్చేందుకు సిద్దమవుతున్నాడు. శ్రీలంకతో టీ20 సిరీస్ అనంతరం భారత జట్టుకు దూరమైన హార్దిక్ పాండ్యా.. ఆదివారం నుంచి బంగ్లాదేశ్‌తో ప్రారంభం కానున్న మూడు టీ20ల సిరీస్‌తో మైదానంలోకి అడుగుపెట్టనున్నాడు. ఈ సిరీస్ కోసం ఇప్పటికే టీమిండియాతో కలిసిన హార్దిక్ పాండ్యా.. తొలి టీ20 వేదికైన గ్వాలియర్‌లో ముమ్మరంగా సాధన చేస్తున్నాడు. బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌పై స్పెషల్ ఫోకస్ పెట్టిన హార్దిక్ పాండ్యా.. గంటల కొద్దీ నెట్స్‌లో బంతులు వేసాడు.

టీమిండియా నయా బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్.. హార్దిక్ పాండ్యా బౌలింగ్‌ను పర్యవేక్షించాడు. అయితే హార్దిక్ బౌలింగ్ తీరుపై మోర్నీ మోర్కెల్ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు వార్తలు వస్తున్నాయి.

# అన్‌క్యాప్‌డ్ రూల్ ధోనీ ఒక్కడి కోసమే కాదు

## మరో 8 మంది స్టార్లను రిటైన్ చేసుకోవచ్చు

ఐపీఎల్ 2025 మెగా వేలానికి సంబంధించిన రిటెన్షన్ పాలసీని భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) ఖరారు చేసింది. ప్రతీ ఫ్రాంచైజీ ఆరుగురు ఆటగాళ్లను రిటైన్ చేసుకోవచ్చని తెలిపింది. ఇందులో ఒక రైట్ టు మ్యాచ్(ఆర్‌టీఎం) కార్డ్ కూడా ఉంది. అట్టిపెట్టుకున్న ఐదుగురి ఆటగాళ్ల కోసం రూ.75 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ప్రతీ జట్టు పర్స్ వాల్యూను రూ. 120 కోట్లకు పెంచింది. రిటైన్ చేసుకునే ఆటగాళ్లకు వరుసగా రూ. 18 కోట్లు, రూ. 14 కోట్లు, రూ. 11 కోట్లు ఇవ్వాల్సి ఉంటుంది. నాలుగు, ఐదో ఆటగాడిని తీసుకోవాలనుకుంటే తిరిగి రూ. 18 కోట్లు, రూ. 14 కోట్లు ఇవ్వాల్సి ఉంటుంది. ఐదుగురు ఆటగాళ్లను రిటైన్ చేసుకుంటే రూ. 45 కోట్లు మాత్రమే మిగులుతాయి. ఈ డబ్బుతోనే వేలంలో ఆర్‌టీఎమ్‌తో పాటు 15 మంది ఆటగాళ్లను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. అనామక ఆటగాళ్లను రిటైన్ చేసుకోవాలనుకుంటే రూ. 4 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. గరిష్టంగా ఇద్దరు అనామక ఆటగాళ్లతో పాటు ఐదుగురు క్యాప్‌డ్ ప్లేయర్లను తీసుకోవచ్చని తెలిపింది. ఈ ఐదుగురు క్యాప్‌డ్ ప్లేయర్లలో విదేశీ ఆటగాళ్లపై ఎలాంటి పరిమితి విధించలేదు.

ఐదేళ్ల పాటు అంతర్జాతీయ క్రికెట్‌కు దూరంగా ఉండటంతో పాటు బీసీసీఐ కాంట్రాక్ట్ లేని ఆటగాడిని అనామక ప్లేయర్‌గా పరిగణించవచ్చని పేర్కొంది. ఈ అన్‌క్యాప్‌డ్ రూల్ మళ్లీ తీసుకురావడం తీవ్ర చర్చనీయాంశమైంది. 2018 వరకు అమల్లో ఉన్న ఈ రూల్‌ను 2022 మెగా వేలంలో తొలగించారు. మళ్లీ తాజాగా ప్రవేశపెట్టారు. అయితే చెన్నై సూపర్ కింగ్స్ మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ కోసమే ఈ రూల్ తీసుకొచ్చారని జోరుగా ప్రచారం జరుగుతోంది.

తాజా నిర్ణయంతో సీఎస్‌కే అతన్ని అనామక ప్లేయర్‌గా రూ. 4 కోట్లకే తీసుకోనుంది. అయితే ధోనీ ఒక్కడికే కాకుండా మరో 7 మంది భారత స్టార్ ఆటగాళ్లను ఈ నియమం కింద రిటైన్ చేసుకోవచ్చు.



**ధోనీతో పాటు 8 మంది ఆటగాళ్లు...**

**పియూష్ చావ్లా:** వెటరన్ లెగ్ స్పిన్నర్ పియూష్ చావ్లాకు కూడా అనామక ప్లేయర్ రూల్ వర్తిస్తోంది. ప్రస్తుతం ముంబై ఇండియన్స్‌కు ఆడుతున్న పియూష్ చావ్లా.. ఐపీఎల్‌లో ఇప్పటి వరకు 192 మ్యాచ్‌లు ఆడి 192 వికెట్ల తీసాడు. అతన్ని ముంబై అనామక ప్లేయర్‌గా రూ. 4 కోట్లకే రిటైన్ చేసుకోవచ్చు.



సందీప్ శర్మ: ఐపీఎల్ స్టార్ పేసర్ సందీప్ శర్మకు కూడా అన్‌క్యాప్‌డ్ రూల్ వర్తిస్తోంది. ఐపీఎల్‌లో అసాధారణ బౌలింగ్‌తో అదరగొడుతున్న సందీప్ శర్మ.. 127 మ్యాచ్‌ల్లో 137 వికెట్లు తీసాడు.

**అమిత్ మిశ్రా:** వెటరన్ స్పిన్నర్ అమిత్ మిశ్రాకు కూడా అనామక ప్లేయర్ రూల్ వర్తిస్తోంది. ఇప్పటి వరకు అతను 174 వికెట్లు తీసాడు. అతన్ని లక్నో సూపర్ జెయింట్స్ రిటైన్ చేసుకునే ఛాన్స్ ఉంది.



**మోహిత్ శర్మ:** వెటరన్ పేసర్ మోహిత్ శర్మకు కూడా ఈ నియమం వర్తిం చనుంది. గత రెండు సీజన్లు మోహిత్ శర్మ బంతితో దుమ్మురేపాడు. ముఖ్యంగా డెత్ ఓవర్ల స్పెషలిస్ట్‌గా గుర్తిం పు తెచ్చుకున్నాడు. స్లోయర్ బాల్స్‌తో బ్యాటర్లను ఇబ్బంది పెడుతున్నాడు. ఇప్పటి వరకు 112 ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడిన మోహిత్ శర్మ.. 132 వికెట్లు తీసాడు.



**విజయ్ శంకర్:** ఆల్‌రౌండర్ విజయ్ శంకర్‌కు కూడా అన్ క్యాప్‌డ్ ప్లేయర్ రూల్ వర్తి స్తోంది. ఇప్పటి వరకు 72 ఐపీ ఎల్ మ్యాచ్‌లు ఆడిన విజయ్ శంకర్.. 1115 పరుగులు చేశాడు.



**కర్ణ్ శర్మ:** లెఫ్టార్మ్ స్పిన్నర్ కర్ణ్ శర్మకు కూడా ఈ రూల్ వర్తిస్తోంది. 83 ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడిన కర్ణ్ శర్మ 76 వికెట్లు పడగొట్టాడు.





**మయాంక్ మార్కండే:**

మయాంక్ మార్కం డేను కూడా అనా మకప్లేయర్‌గా రిటైన్ చేసుకోవచ్చు. 26 ఏళ్ల మయాంక్ 37 మ్యాచ్‌ల్లో 37 వికెట్లు తీసాడు.

## సిఎం స్పోర్ట్స్ కప్ ప్రారంభోత్సవంలో మెరిసిన ఎన్‌సిసి క్యాడెట్లు




తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: ముఖ్యమంత్రి స్పోర్ట్స్ కప్ ప్రారంభోత్సవ కార్యక్రమం - 2024 , అక్టోబర్ 03 న ఎల్ బి స్టేడియంలో జరిగింది. రాజకీయ, బ్యూరోక్రసీ మరియు సైనిక రంగానికి చెందిన ప్రముఖులతో పాటు సుమారు ఐదు వేల మంది ఈ వేడుకలకు హాజరయ్యారు. ఎన్‌సిసికి చెందిన విశిష్ట సైనికాధికారులు ఎయిర్ సిఎమ్‌డిఈ విఎం రెడ్డి, డిడిజి, కల్నల్ సమీర్ శర్మ, డైరెక్టర్ కల్నల్ సచిన్ నింబాల్కర్, కెసి, కల్నల్ అనిల్, కల్నల్ వెంకటేష్, లెఫ్టినెంట్ కల్నల్ శరత్ మరియు మేజర్ అంకిత్ పాల్గొనటం తో పాటుగా యువతను ప్రేరేపించారు. ఎన్‌సిసికి చెందిన దాదాపు 150 మంది క్యాడెట్‌లు కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. అద్భుతమైన ప్రదర్శనలతో అందరి దృష్టిని ఆకర్షించారు. ముఖ్యమంత్రికి స్వాగతం పలికి ఎన్‌సీసీ క్యాడెట్ బ్యాండ్ బృందం ఆద్యంతం మంత్రముగ్ధులను చేసి ప్రేక్షకులను ఆకట్టుకుంది. బ్యాండ్ యొక్క ప్రదర్శన అసాధారణమైనది, వారి రిథమిక్ కోఆర్డినేషన్ మరియు క్రమశిక్షణతో కూడిన ఎగ్జిక్యూషన్ కార్యక్రమం యొక్క ప్రాముఖ్యతను పెంపొందించడంతోపాటు శాశ్వతమైన ముద్రను మిగిల్చింది. 17 మంది ఎన్‌సిసి క్యాడెట్‌ల బృందం "ఏక్ సూరిలి ఆశా హే" అనే సమూహ గీతాన్ని శ్రావ్యంగా ఆలపించింది, తర్వాత ప్రదర్శించిన బృంద నృత్యం మరింత మెరుగ్గా ఉంది. కృష్ణ లీలాలో కూచిపూడి ప్రదర్శనతో ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేసింది. ఎఐటిఎస్‌సి 2024లో క్యాడెట్‌ల అత్యద్భుతమైన ప్రదర్శనకు ముఖ్యమంత్రి ప్రశంసలు కురిపించారు, వారి అంకితభావం, క్రమశిక్షణ పోటీతత్వ స్ఫూర్తిని ప్రశంసించారు. ఎఐటిఎస్‌సి 2024లో భాగమైన ఎయిర్ సిఎండిఈ విఎం రెడ్డి, డిడిజి, కల్నల్ సమీర్ శర్మ, దిర్ మరియు ఎన్‌సిసి క్యాడెట్‌లకు సిఎం అవార్డును అందించడం గర్వించదగిన ఘట్టం, ముఖ్యమంత్రి డిడిజి, ఎన్‌సిసి క్యాడెట్‌లను అభినందించారు.

## బిడ్డపై మహమ్మద్ షమీది దొంగ ప్రేమ..

● హాసిన్ జహాన్ సంచలన వ్యాఖ్యలు!



టీమిండియా స్టార్ పేసర్ మహమ్మద్ షమీపై అతని మాజీ సతీమణి హాసిన్ జహాన్ మరోసారి సంచలన ఆరోపణలు చేసింది. తమ బిడ్డ ఐరాపై మహమ్మద్ షమీ చూపించేది దొంగ ప్రేమని, ఆమెను అతను అస్సలు పట్టించుకోడని తెలిపింది. మహమ్మద్ షమీ ఇటీవలే తన కూతురు ఐరాను కలిసాడు. హాసిన్ జహాన్‌తో విడాకుల అనంతరం చాలా రోజులకు ఐరాను కలుసుకున్నాడు. దాంతో షమీ భావోద్వేగానికి గురయ్యాడు. ఇద్దరూ కలిసి సరదాగా షాపింగ్ కూడా చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోను మహమ్మద్ షమీ సోషల్ మీడియా వేదికగా పంచుకున్నాడు. 'చాలా రోజుల తర్వాత నా కూతుర్ని చూశాను. నా బంగారు తల్లిని కలిసినప్పుడు ప్రపంచం ఆగిపోయినట్లు అనిపించింది. ఐరా.. నిన్ను ఎంతగా ప్రేమిస్తున్నానో మాటల్లో చెప్పలేను.'అని షమీ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా పేర్కొన్నాడు. ఈ వీడియో సోషల్ మీడియా వేదికగా వైరల్ అయ్యింది. అయితే ఈ వీడియోపై అతని మాజీ భార్య హాసిన్ జహాన్ ఘాటుగా స్పందించింది. కూతుర్ని షమీ అస్సలు పట్టించుకోడని, కేవలం షో ఆఫ్ చేయడానికి ఈ వీడియో షేర్ చేశాడని మండిపడింది. 'ఇది కేవలం షో ఆఫ్ మాత్రమే.. నా కూతురు పాస్‌పోర్ట్ గడువు ముగిసింది. కొత్త పాస్‌పోర్ట్ కోసం షమీ సంతకం కావాల్సి వచ్చింది.

అందుకే ఐరా తన తండ్రిని కలవడానికి వెళ్లింది. అయితే అక్కడ షమీ సంతకం చేయకుండా ఆమెను షాపింగ్‌కు తీసుకెళ్లాడు. అక్కడ తాను ఎండార్స్ చేసే బ్రాండెడ్?షూస్, బట్టలు మాత్రమే కొనిచ్చాడు. ఆ కంపెనీకి చెందిన వస్తువులు ఏవీ కొన్నా.. వాటికి షమీ డబ్బులు చెల్లించాల్సిన అవసరం ఉండదు. అందుకే ఆ షాపింగ్ మాల్‌కు తీసుకెళ్లాడు. కానీ నా కూతురు గిటార్, కెమెరా కొనివ్వాలని అడిగింది. కానీ ఆ వస్తువులను షమీ కొనివ్వలేదు. మహమ్మద్ షమీ తన కూతురి గురించి అస్సలు పట్టించుకోడు. షమీ తనతో మాత్రమే బిజీగా ఉంటున్నాడు. ఒక నెల క్రితమే ఐరాను కలిసాడు. అప్పుడు ఎలాంటి పోస్ట్ షేర్ చేయలేదు. ఇప్పుడు ఎందుకు చేశాడో అతనికే తెలియాలి. 'అని హాసిన్ జహాన్ ఘాటుగా వ్యాఖ్యానించింది.

## ఐసీసీ టైటిల్ గెలవకున్నా.. కోహ్లి గొప్ప కెప్టెన్: హర్భజన్ సింగ్

టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లిపై మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ ప్రశంసల జల్లు కురిపించాడు. ఐసీసీ టైటిల్ గెలవకున్నా విరాట్ కోహ్లి గొప్ప కెప్టెన్ అని కొనియాడాడు. కెప్టెన్‌గా జట్టులో అనేక మార్పులు తీసుకొచ్చాడని గుర్తు చేశాడు. ముఖ్యంగా టెస్ట్‌ల్లో టీమిండియాను నడిపించిన విధానం అద్భుతమని ప్రశంసించాడు. విదేశీ గడ్డపై కూడా టీమిండియా విజయాలు సాధిస్తుందంటే.. దానికి కారణం విరాట్ కోహ్లి కెప్టెన్సీనే అని అభిప్రాయపడ్డాడు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో విరాట్ కోహ్లి సారథ్యం గురించి మాట్లాడిన హర్భజన్ సింగ్.. ఐసీసీ ట్రోఫీ గెలవనంత మాత్రాన కోహ్లి గొప్ప నాయకుడు కాకుండా పోడని అభిప్రాయపడ్డాడు. 'విరాట్ కోహ్లి సారథ్యంలో టీమిండియా ఒక్క ఐసీసీ ట్రోఫీ కూడా గెలవలేదు. అంత మాత్రానా అతను గొప్ప నాయకుడు కాకుండా పోడు. సారథిగా కోహ్లి ప్రపంచకప్‌లు గెలవకపోయినా.. జట్టులో విజయం సాధించాలనే కాంక్షను పుట్టించాడు. రెండో ఇన్నింగ్స్‌లో 400 పరుగుల లక్ష్యం ఛేధించడమంటే మాములు విషయం కాదు. కెప్టెన్‌గా జట్టులోని ప్రతీ ఆటగాడికి ఫియర్‌లెస్ గేమ్ నేర్పించాడు. చివరి వరకు పోరాడాలనే తెగువ తీసుకొచ్చాడు. గబ్బా టెస్ట్‌లో శుభ్‌మన్ గిల్, రిషభ్ పంత్ ఆడిన తీరు ఎప్పటికీ మరవలేం. అప్పట్నుంచే భారత జట్టు ఆలోచనా విధానం పూర్తిగా మారిపోయింది. విదేశాల్లోనూ టీమిండియాను చూస్తే ప్రత్యర్థి జట్లు భయపడుతున్నాయి. ఇందుకు ప్రధాన కారణం విరాట్ కోహ్లి.'అని హర్భజన్ సింగ్ చెప్పుకొచ్చాడు.

**ఫైనల్లో చెలరేగే ఆటగాడు..** ఆటగాడిగా కూడా కోహ్లి గొప్ప బ్యాట్స్‌మన్ అని హర్భజన్ సింగ్ కొనియాడాడు. 'విరాట్ కోహ్లి గొప్ప ఆటగాడు. మెగా టోర్నీలు, కీలక ఫైనల్లో ఎప్పుడూ అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తాడు. గత టీ20 ప్రపంచకప్ ఫైనల్లోనూ కీలక ఇన్నింగ్స్ ఆడాడు. టీ20 ఫార్మాట్‌లో పరుగులు ఎలా చేయాలో





కోహ్లికి బాగా తెలుసు. 'అని భజ్జీ చెప్పుకొచ్చాడు. విరాట్ కోహ్లి సారథ్యంలోనే టీమిండియా తొలిసారి ఆసీస్ గడ్డపై టెస్ట్ సిరీస్ గెలిచింది. 2018-19 బోర్డర్ గవాస్కర్‌ను సొంతం చేసుకుంది. ఆ తర్వాత 2021-22 బోర్డర్ గవాస్కర్‌ను గెలుచుకుంది. ఈ సిరీస్‌లో తొలి మ్యాచ్ అనంతరం విరాట్ కోహ్లి వ్యక్తిగత పనులతో స్వదేశం తిరిగి రాగా.. అజింక్యా రహానే జట్టును నడిపించాడు. ఈ ఏడాది నవంబర్‌లో భారత్ మరోసారి ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లనుంది. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ 2024లో భాగంగా ఈసారి ఐదు టెస్ట్‌లు జరగనున్నాయి. సుమారు 30 ఏళ్ల తర్వాత ఐదు టెస్ట్‌ల సిరీస్ నిర్వహిస్తున్నారు.

## మా దేశ క్రికెట్ ఐసీయూలో ఉంది

తమ దేశ క్రికెట్ ఐసీయూలో ఉందని, చికిత్స అందించడానికి స్పెషలిస్టులు కూడా లేరని పాకిస్థాన్ మాజీ కెప్టెన్ రషీద్ లతీఫ్ అన్నాడు. పాక్ స్టార్ ప్లేయర్ బాబర్ అజామ్ కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పుకున్న నేపథ్యంలో లతీఫ్ ఈ వ్యాఖ్యలు చేశాడు. ప్రస్తుతం పాకిస్థాన్ క్రికెట్‌లో నాయకత్వ సంక్షోభం ఏర్పడిందని పేర్కొన్నాడు. "ఇది నాయకత్వ సంక్షోభం. పాకిస్థాన్ క్రికెట్ ఐసీయూలో ఉంది. చికిత్స అందించడానికి నిపుణులు ఎవరూ లేరు. అసలు బాబర్ అజామ్ తిరిగి కెప్టెన్సీని తీసుకోవాల్సింది కాదు. జట్టు రాణించలేదు, అతను పెద్దగా పరుగులు చేయలేదు. అయితే కెప్టెన్సీకి రాజీనామా చేసిన నిర్ణయం ఆలస్యమైందని నా అభిప్రాయం. ఈ నిర్ణయం అతనిపై మాత్రమే కాదు, జట్టుపై కూడా తీవ్ర ప్రభావం చూపుతోంది"అని రషీద్ లతీప్ అన్నాడు. సారథి బాధ్యతల నుంచి బాబార్ తప్పుకోవడం ఇది రెండో సారి. 2023 వన్డే వరల్డ్ కప్ ముగిసిన అనంతరం జట్టు పేలవ ప్రదర్శనకు బాధ్యత వహిస్తూ అన్ని ఫార్మాట్ల కెప్టెన్సీ నుంచి తప్పుకున్నాడు. టీ20లకు బాబర్ అజామ్ స్థానంలో షాహిన్ అఫ్రిదిని కెప్టెన్‌గా నియమించారు. కానీ అఫ్రిదికి కేవలం న్యూజిలాండ్ సిరీస్ వరకే ఛాన్స్ ఇచ్చారు. టీ20 వరల్డ్ కప్ ముంగిట తిరిగి వైట్ బాల్‌కు బాబార్‌ను తిరిగి కెప్టెన్‌గా పాకిస్థాన్ క్రికెట్ బోర్డు నియమించింది. కానీ ఈ మెగాటోర్నీలో పాక్ ఘోర వైఫల్యాలను చవిచూసింది. అమెరికాతో చేతిలోనూ ఓటమిపాలై కనీసం గ్రూప్ స్టేజ్‌ను కూడా దాటలేకపోయింది. మరోవైపు కెప్టెన్సీ మార్పులపై పాకిస్థాన్ టీమ్‌లో ఐకమత్యం దెబ్బతిందని సమాచారం. ఆటగాళ్ల మధ్య గొడవలు మొదలయ్యాయని తెలిసింది. ఈ నేపథ్యంలో ఒత్తిడి మేరకు బాబర్ అజామ్ కెప్టెన్సీకి రాజీనామా చేశాడని ప్రచారం కూడా సాగుతోంది. కాగా, బాబర్ స్థానంలో మహ్మద్ రిజ్వాన్ జట్టు పగ్గాలు అందుకునే అవకాశం ఉంది. పాకిస్థాన్ తరపున బాబర్ అజామ్ ఇప్పటి వరకు 54 టెస్టులు, 117 వన్డేలు, 123 టీ20లు ఆడాడు. టెస్టుల్లో 3962 పరుగులు, వన్డేల్లో 5729 పరుగులు, టీ20ల్లో 4145 పరుగులు చేశాడు.



## క్రికెట్ అభిమానులకు అసౌకర్యం కలగవద్దు

● టీ 20 మ్యాచ్ నిర్వహణకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు
● కమిషనర్ సుధీర్ బాబు ● 12న ఉప్పల్ రాజీవ్ గాంధీ స్టేడియంలో
● భారత్ బంగ్లాదేశ్ జట్ల మధ్య టీ20-2024 క్రికెట్ మ్యాచ్

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో త్వరలో జరగనున్న టీ 20 క్రికెట్ మ్యాచ్ నిర్వహణకు సంబంధించిన భద్రతా ఏర్పాట్ల గురించి రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు ఐపిఎస్ ఉప్పల్ స్టేడియంలో డీసీపీలు, ఏసిపిలు, జిహెచ్‌ఎంసి, ఫైర్, ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్ నుంచి మరియు హైదారాబాద్ క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, రాచకొండ కమిషనరేట్ పరిధిలో జరగనున్న మ్యాచ్ నిర్వహణకు అవసరమైన అన్ని రకాల సెక్యూరిటీ పరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో క్రికెట్ పోటీలు నిర్వహించడం గొప్ప అవకాశం అని, ఎన్ని సవాళ్ళు ఎదురైనా తగిన విధంగా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని, ప్రేక్షకులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా బందోబస్తు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు. టికెట్ల పంపిణీలో ఎటువంటి గందరగోళం లేకుండా చూడాలని నిర్వహణ బృందానికి సూచించారు. ప్రేక్షకులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఉండేందుకు అవసరమైన పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. సాధారణ వాహనదారుల రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా, ఉప్పల్ ప్రధాన రహదారి మీద ట్రాఫిక్ జామ్ ఏర్పడకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. స్టేడియం పరిసరాల్లో సీసీటీవీలను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతీ ఒక్కరి కదలికలూ సీసీటీవీ కెమెరాల్లో నిక్షిప్తం అవుతాయని పేర్కొన్నారు. నకిలీ టికెట్లు అమ్మేవారిపైన కఠిన చర్యలు తీసుకుంటామని, టికెట్ల పంపిణీ పూర్తి పారదర్శకంగా జరుగుతుందని, ఎటువంటి పుకార్లనూ నమ్మవద్దని తెలిపారు. ఈ సమావేశంలో డిసిపి మల్కాజ్ గిరి పద్మజ ఐపిఎస్, హెచ్ సి ఎ ప్రెసిడెంట్ జగన్మోహన్రావు, హెచ్ సిఎ వైస్ ప్రెసిడెంట్ దల్జిత్ సింగ్, డీసీపీ ఎస్బి కరుణాకర్, డీసీపీ క్రైమ్ అరవింద్ బాబు, ఎస్ఓటి డిసిపి రమణారెడ్డి, విమెన్ సేఫ్టీ డిసిపి ఉషా విశ్వనాథ్, అడిషనల్ డిసిపి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# ‘మట్కా’ టీజర్ లాంచ్



మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హైలీ యాంటిసిపేటెడ్ పీరియడ్ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ‘మట్కా’. కరుణ కుమార్ దర్శకత్వంలో వైర ఎంటర్‌టైన్‌మెంట్స్, ఎస్ఆర్‌టి ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి నిర్మిస్తున్నారు. రీసెంట్ గా రిలీజైన సెకండ్ లుక్ కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. మేకర్స్ ఈ సినిమా టీజర్‌కు సంబంధించిన అప్‌డేట్ ఇచ్చారు. మట్కా పవర్ ప్యాక్డ్ టీజర్ అక్టోబర్ 5న విడుదల కానుంది. టీజర్ లాంచ్ ఈవెంట్ విజయవాడ ఓల్డ్ థియేటర్ రాజ్ యువరాజ్ లో జరగనుంది. వరుణ్ తేజ్ కెరీర్ లో హయ్యెస్ట్ బడ్జెట్ మూవీగా రూపొందుతున్న ‘మట్కా’లో మీనాక్షి చౌదరి, నోరా ఫతేహి హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి జి.వి.ప్రకాష్ కుమార్ మ్యూజిక్ అందిస్తున్నారు ఎ.కిషోర్ కుమార్ సినిమాటోగ్రఫర్. కార్తీక శ్రీనివాస్ ఆర్ ఎడిటర్. షూటింగ్ చివరి దశలో ఉన్న మట్కా నవంబర్ 14న విడుదల కానుంది.

# “మిస్టర్ ఇడియట్” లిరికల్ సాంగ్



మాస్ మహరాజ్ రవితేజ తమ్ముడు రఘు కొడుకు మాధవ్ హీరోగా నటిస్తోన్న సినిమా “మిస్టర్ ఇడియట్”. ఈ చిత్రంలో సిమ్రాన్ శర్మ హీరోయిన్‌గా నటిస్తోంది. జేజేఆర్ ఎంటర్ టైన్ మెంట్స్ ఎల్ఎల్ పీ పతాకంపై శ్రీమతి యలమంచి రాణి సమర్పణలో నిర్మాత జె జే ఆర్ రవిచంద్ “మిస్టర్ ఇడియట్” సినిమాను నిర్మిస్తున్నారు. పెళ్లి సందడి చిత్రంతో కమర్షియల్ హిట్ అందుకున్న దర్శకురాలు గౌరీ రోణంకి డైరెక్ట్ చేస్తున్నారు. త్వరలోనే ఈ సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. రీసెంట్ గా రిలీజ్ చేసిన “మిస్టర్ ఇడియట్” ట్రైలర్ డిజిటల్ వ్యూస్ లో హ్యూజ్ రెస్పాన్స్ తెచ్చుకుంది. “మిస్టర్ ఇడియట్” సినిమా నుంచి ‘కాంతార కాంతార..’ లిరికల్ సాంగ్ ను యంగ్ టాలెంటెడ్ హీరో నిఖిల్ సోషల్ మీడియా ద్వారా రిలీజ్ చేశారు. పాట చాలా ఎనర్జిటిక్ గా ఉందన్న ఆయన మూవీ టీమ్ కు బెస్ట్ విషెస్ తెలియజేశారు. అనూప్ రూబెన్స్ మంచి బీట్ తో కంపోజ్ చేసిన ‘కాంతార కాంతార..’ పాటకు కాసర్ల శ్యామ్ లిరిక్స్ అందించారు. రాహుల్ సిప్లిగంజ్ పాటలోని ఎనర్జీని రెట్టింపు చేసేలా పాడారు.

# ‘మెన్షన్ హౌస్ మల్లేష్’ టైటిల్ పోస్టర్



శ్రీనాథ్ మాగంటి, గాయత్రి రమణ, సాయి కామాక్షి భాస్కర్ల ప్రధాన పాత్రలలో బాల సతీష్ దర్శకత్వం లో కనకమేడల ప్రొడక్షన్స్ బ్యానర్ పై రాజేష్ నిర్మిస్తున్న సినిమాకి ‘మెన్షన్ హౌస్ మల్లేష్’ అనే ఇంట్రస్టింగ్ టైటిల్ పెట్టారు. డైరెక్టర్ శైలేష్ కొలను ఈ సినిమా టైటిల్ పోస్టర్ ని లాంచ్ చేశారు. హీరో శ్రీనాథ్ మాగంటి వైట్ అండ్ వైట్‌లో బ్లాక్ షేడ్స్‌తో కింగ్ చైర్‌లో కూర్చుని ఇంటెన్స్‌గా చూస్తున్న టైటిల్ పోస్టర్ అదిరిపోయింది. పోస్టర్ లో గాయత్రి రమణ, సాయి కామాక్షి భాస్కర్ల, రాజేష్, మురళీధర్ గౌడ్, రాజ్ కుమార్ కసిరెడ్డి డైనమిక్ ఎక్స్ ప్రెషన్స్‌తో కనిపించడం క్యూరియాసిటీని పెంచింది. ఈ చిత్రానికి ప్రముఖ టెక్నిషియన్స్ పని చేస్తున్నారు.

# మెగా ఫ్యాన్స్‌కి కిక్కిచ్చే అప్‌డేట్లు



మెగాస్టార్ చిరంజీవి, రామ్ చరణ్ ఫ్యాన్స్ కోసం మరికొన్ని రోజుల్లో బిగ్ అప్డేట్స్ రానున్నాయి. అసలే ఈ మెగా హీరోలు బిగ్ స్క్రీన్ పై కనిపించి చాలా కాలమైంది. చిరంజీవి చివరగా నటించిన భోళా శంకర్ సినిమా వచ్చి ఏడాది దాటిపోయింది. పైగా ఆ సినిమా అంతగా ఆడలేదు. ఇక రామ్ చరణ్ నటించిన ఆర్ఆర్ఆర్, ఆచార్య చిత్రాలు విడుదలై దాదాపు రెండున్నర సంవత్సరాలు అవుతోంది. ప్రస్తుతం చిరంజీవి విశ్వంభర అనే ప్రాజెక్ట్‌లో బిజీగా ఉంటే, రామ్ చరణ్ గేమ్ చేంజర్ షూటింగ్‌లో పాల్గొంటున్నారు. తాజా సమాచారం ప్రకారం, ఈ రెండు చిత్రాలకు సంబంధించి ఆసక్తికర అప్‌డేట్ బయటకు వచ్చింది. ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం, ఈ దసరా సందర్భంగా ఈ రెండు చిత్రాల టీజర్లు విడుదలయ్యే అవకాశం ఉంది. దసరా పండుగను పురస్కరించుకుని ఈ టీజర్లు విడుదల చేయాలని చిత్ర బృందాలు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. గేమ్ చేంజర్ సినిమాకు సంగీత దర్శకుడు థమన్, ఇటీవల సోషల్ మీడియాలో ఒక పోస్ట్ ద్వారా ఈ దసరాకు టీజర్ ఖచ్చితంగా వస్తుందని కన్ఫర్మ్ చేశారు. మరి విశ్వంభర టీజర్ కూడా అదే సమయంలో విడుదలైతే, ఇది మెగా ఫ్యాన్స్ కోసం డబుల్ ధమాకా అనే చెప్పాలి. విశ్వంభర చిత్రానికి బింబిసార ఫేమ్ వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్నారు.

# అత్యంత వైభవంగా మొదలైన దళపతి 69 పూజ



విజయ్ సినిమా కెరీర్‌లో ఆఖరి చిత్రం దళపతి 69ని అత్యంత వైభవంగా ప్రారంభించింది కేవీయన్ ప్రొడక్షన్స్. పూజా కార్యక్రమాలతో భారీ సినిమాకు కొబ్బరికాయ కొట్టేశారు. నవరాత్రుల్లో రెండో రోజున ఈ సినిమా పూజా కార్యక్రమాలతో మొదలు కావడం ఆనందంగా ఉందంటున్నారు మేకర్స్. సినిమాలో నటించే నటీనటులు, సాంకేతిక నిపుణుల సమక్షంలో ఆత్మీయంగా జరిగింది దళపతి 69 మూవీ పూజ. సినిమా రెగ్యులర్ షూటింగ్ మొదలవుతుంది. దళపతి కెరీర్‌లో హిస్టారిక్ ప్రాజెక్ట్ ఇది. సిల్వర్‌స్క్రీన్ మీద ఆయన చివరిసారిగా కనిపించనున్న చిత్రం ఇదే. దళపతి ఫ్యాన్స్ కి ఇదొక ఎమోషనల్ ప్రాజెక్ట్. విజయ్ సరసన ఈ చిత్రంలో పూజా హెగ్డే నాయికగా నటిస్తున్నారు. బాబీ డియోల్ కీలక పాత్రలో కనిపిస్తారు. గౌతమ్ వాసుదేవ మీనన్, నేషనల్ అవార్డ్ విన్నింగ్ యాక్ట్రెస్ ప్రియమణి, వెటరన్ యాక్టర్ ప్రకాష్ రాజ్, రెయిజింగ్ స్టార్ మమిత బైజు ప్రధాన పాత్రల్లో మెప్పించడానికి సిద్ధమవుతున్నారు. హెచ్.వినోద్ దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. కేవీయన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె నారాయణ నిర్మిస్తున్నారు. దాదాపు మూడు దశాబ్దాలుగా వెండితెరమీద విలక్షణమైన నటనతో బాక్సాఫీస్‌ని షేక్ చేస్తున్న విజయ్ కెరీర్‌లో అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్న సినిమా ఇది. అనిరుద్ సంగీతం అందిస్తున్నారు.

# ‘జనక అయితే గనక’ అందరినీ అలరించే వినోదాత్మక చిత్రంగా నిలుస్తుంది



వెర్సటైల్ యాక్టర్ సుహాస్, సంగీర్తన హీరో హీరోయిన్లుగా రూపొందిన చిత్రం ‘జనక అయితే గనక’. శిరీష్ సమర్పణలో దిల్‌రాజు ప్రొడక్షన్స్ పతాకంపై హర్షిత్ రెడ్డి, హన్షిత రెడ్డి నిర్మించారు. సందీప్ రెడ్డి బండ్ల డైరెక్ట్ చేశారు. ఈ సినిమా దసరా సందర్భంగా ‘జనక అయితే గనక’ అక్టోబర్ 12న విడుదల కానుంది. ఇప్పటి వరకు చిత్రం నుంచి రిలీజ్ చేసిన పోస్టర్లు, పాటలు, టీజర్‌లు ఇలా అన్నీ కూడా ఆడియెన్స్‌లో మంచి బజ్‌ను క్రియేట్ చేశాయి. రీసెంట్‌గా చిత్రయూనిట్ మీడియా ముందుకు వచ్చింది. గురువారం నాడు ఏర్పాటు చేసిన ఈవెంట్‌లో.. దిల్ రాజు మాట్లాడుతూ.. ‘ఇప్పటికే మా సినిమాను చాలా మందికి షో వేశాం. ఆ రియాక్షన్సే ఇప్పుడు మీడియాకు చూపించాను. మంచి సినిమాను తీశాం కాబట్టి.. మీడియాకు ముందుగానే షో వేస్తాను. సినిమా హిట్ అయితే అందరికీ సంతోషంగా ఉంటుంది. అక్టోబర్ 6న విజయవాడలో పబ్లిక్ షో వేస్తున్నాం. 8వ తేదీని తిరుపతిలో షో వేస్తున్నాం. హ్యాపీ డేస్, శతమానం భవతి చిత్రాలు ఓవర్సీస్‌లో ముందుగా రిలీజ్ చేశాను. ఆ సెంటిమెంట్‌తోనే ఇప్పుడు కూడా ఈ మూవీని ముందుగా అంటే అక్టోబర్ 10న ఓవర్సీస్‌లో రిలీజ్ చేస్తున్నాను. 11న ఇక్కడ ప్రీమియర్లు వేసి.. 12న గ్రాండ్‌గా రిలీజ్ చేయనున్నాం. నాన్ థియేట్రికల్ బిజినెస్ పూర్తయింది. డిజిటల్, హిందీ డబ్బింగ్, ఓటీటీ ఇలా అన్నీ కూడా పూర్తయ్యాయి. మా సినిమా పూర్తి వినోదాత్మకంగా సాగుతుంది. అందరినీ అలరించేలా ఈ చిత్రం ఉంటుంది’ అని అన్నారు.

# ‘శ్వాగ్’కు ఆడియన్స్ నుంచి అద్భుతమైన రెస్పాన్స్ చాలా ఆనందాన్ని ఇచ్చింది

కింగ్ ఆఫ్ కంటెంట్ శ్రీవిష్ణు, ట్యాలెంటెడ్ డైరెక్టర్ హసిత్ గోలి లేటెస్ట్ కంటెంట్ ప్యాక్డ్ బ్లాక్ బస్టర్ ‘శ్వాగ్’. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై నిర్మాత టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మించారు. రీతూ వర్మ హీరోయిన్ గా నటించిన ఈ చిత్రంలో మీరా జాస్మిన్, దక్ష నాగర్కర్ ఇతర కీలక పాత్రల్లో పోషించారు. శుక్రవారం అక్టోబర్ 4 ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులని అలరించి, విమర్శకులు ప్రశంసలు అందుకొని కంటెంట్ ప్యాక్డ్ బ్లాక్ బస్టర్ హిట్ గా నిలిచింది. ఈ నేపథ్యంలో మేకర్స్ ప్రెస్ మీట్ నిర్వహించారు. హీరో శ్రీవిష్ణు మాట్లాడుతూ...’శ్వాగ్’కు ప్రేక్షకుల నుంచి చాలా మంచి స్పందన వస్తోంది. ముఖ్యంగా లేడీస్, ఫ్యామిలీ ఆడియన్స్ నుంచి విపరీతమైన అప్రిషియేషన్ వస్తోంది. కథ, పెర్ఫార్మెన్స్, కొత్త కంటెంట్ ను ప్రేక్షకులు చాలా అద్భుతంగా రిసీవ్ చేసుకుంటున్నారు. తెలుగు ప్రేక్షకులు కొత్త కంటెంట్ ఎప్పుడు చేసిన ఆదరిస్తారనే ధైర్యంతో ఈ సినిమా చేయడం జరిగింది. అలాగే రిసీవ్ చేసుకుంటున్నారు. నా క్యారెక్టర్స్, గెటప్స్ కి ఆడియన్స్ నుంచి చాలా మంచి అప్లాజ్ రావడం ఆనందంగా వుంది. ఫ్యామిలీ ఆడియన్స్ కి ప్రత్యేకంగా ధన్యవాదాలు. మార్నింగ్ నుంచి ఇండస్ట్రీ, మీడియా, ఫ్రెండ్స్, ఫ్యామిలీ నుంచి వచ్చినన్ని కాల్స్ మరే సినిమాకి రాలేదు. నాకు ఈ అవకాశం ఇచ్చిన నిర్మాత విశ్వప్రసాద్ గారికి, డైరెక్టర్ హసిత్, టీం అందరికీ చాలా థాంక్స్. సినిమా తప్పకుండా చూడండి, ఎప్పుడూ చూడని కొత్త ఎక్స్ పీరియన్స్ ఇస్తుంది. తెలుగు ప్రేక్షకులందరికీ థాంక్ యూ’అన్నారు.



# లేడీ సూపర్‌స్టార్ క్రేజీ మూవీ



ఈ మధ్యకాలంలో కొన్ని సినిమాలు నేరుగా డిజిటల్ రిలీజ్ అవుతున్నాయి. బిగ్ స్క్రీన్ పై వర్క్ అవుట్ కావు అనుకున్న సినిమాలని డిజిటల్ రిలీజ్ చేస్తున్నారు. అలాగే కొన్ని మూవీస్ కి ఓటీటీ హక్కుల ద్వారా పెట్టిన పెట్టుబడి మొత్తం రికవరీ అయితే థీయాట్రికల్ రిలీజ్ టెన్షన్ తప్పించుకోవడానికి నిర్మాతలు ఓటీటీలో విడుదలకి మొగ్గు చూపిస్తున్నారు. ఇవి కాకుండా కొన్ని సినిమాలని ఓటీటీ సంస్థలు తమ ఒరిజినల్ వెంచర్స్ గా నిర్మించడంతో థియేటర్స్ లోకి రావడం లేదు. 2020 తర్వాత ఓటీటీలకి ఇండియాలో విపరీతమైన ఆదరణ పెరిగింది. ఈ నేపథ్యంలోనే డిజిటల్ స్ట్రీమింగ్ సంస్థలు కూడా కోట్ల రూపాయిలు పెట్టుబడులు పెట్టి సినిమాల డిజిటల్ రైట్స్ కొనుకోలు చేస్తున్నాయి. డిజిటల్ బిజినెస్ నిర్మాతలకి వరంగా మారింది. ఇదిలా ఉంటే కోలీవుడ్ లో కమల్ హాసన్ ‘ఇండియన్ 3’ మూవీని ఓటీటీలో నేరుగా రిలీజ్ చేయడానికి నెట్ ఫ్లిక్స్ తో చర్చలు జరుపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ‘ఇండియన్ 2’ మూవీ డిజాస్టర్ కావడంతో ఆ ఇంపాక్ట్ ‘ఇండియన్ 3’ థీయాట్రికల్ బిజినెస్ మీద గణనీయంగా పడింది. ఒకవేళ ‘ఇండియన్ 3’ మూవీని థియేటర్స్ లో రిలీజ్ చేస్తే మాత్రం కచ్చితంగా భారీ నష్టాలు భరించాల్సి వస్తుందని భావించిన మేకర్స్ ఓటీటీ రిలీజ్‌కి మొగ్గు చూపిస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. మరో వైపు కోలీవుడ్ లో మరో క్రేజీ మూవీ కూడా డైరెక్ట్ ఓటీటీలో రిలీజ్ కి రెడీ అవుతోందనే ప్రచారం నడుస్తోంది. కోలీవుడ్ ఇండస్ట్రీలో బడా నిర్మాతగా వైనాట్ స్టూడియోస్ మీద సినిమాలు నిర్మిస్తోన్న ఎస్ శశికాంత్ దర్శకుడిగా మారి ‘టెస్ట్’ అనే మూవీ చేశాడు. ఈ చిత్రంలో మాధవన్, నయనతార, సిద్ధార్ధ్, మీరా జాస్మిన్ కీలక పాత్రలలో నటించారు. ఈ మూవీ షూటింగ్ ఆల్ మోస్ట్ కంప్లీట్ అయ్యిందని తెలుస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా రిలీజ్ కోసం నెట్ ఫ్లిక్స్ సంస్థతో చర్చలు జరుగుతున్నాయని టాక్. ఫైనల్ డిస్కషన్ ఒక కొలిక్కి వస్తే ఓటీటీ రిలీజ్ ఫిక్స్ అయిపోవచ్చని కోలీవుడ్ సర్కిల్ లో వినిపిస్తోంది. స్పోర్ట్స్ బ్యాక్ డ్రాప్ లో టెస్ట్ మ్యాచ్ చుట్టూ ఈ కథ తిరుగుతుందని తెలుస్తోంది.

# “క” ‘మాస్ జాతర’ సాంగ్



యంగ్ టాలెంటెడ్ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న భారీ పీరియాడిక్ థ్రిల్లర్ సినిమా “క”. ఈ సినిమాలో నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. శ్రీమతి చింతా వరలక్ష్మి సమర్పణలో శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో బ్యానర్‌పై చింతా గోపాలకృష్ణ రెడ్డి భారీ ప్రొడక్షన్ వ్యాల్యూస్ తో నిర్మిస్తున్నారు. దర్శకద్వయం సుజీత్, సందీప్ విలేజ్ బ్యాక్ డ్రాప్ యాక్షన్ థ్రిల్లర్ కథతో ”క” సినిమాను రూపొందిస్తున్నారు. ఈ సినిమాను త్వరలో తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్న డలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు తీసుకురాబోతున్నారు. “క” సినిమా నుంచి ‘మాస్ జాతర ‘ సాంగ్ ను ఈ నెల 7వ తేదీన విడుదల చేయబోతున్నారు. ఈ సాంగ్ ప్రోమో రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. సామ్ సీఎస్ మ్యూజిక్ అందించిన “క” సినిమా నుంచి ‘వరల్డ్ ఆఫ్ వాసుదేవ్..’ సాంగ్ ఇప్పటికే రిలీజై హ్యూజ్ రెస్పాన్స్ తెచ్చుకుంది.

PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185, SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044.